ఆదివారం గత వారం రోజుల పై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

27-5-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 116 పేజీలు: 10+4 వెల: 6.50


ప్రధాని మోడీతో కేరళం సిఎం సతీశన్ భేటీ

16వ సారి పెరోల్ పొందిన డేరాబాబా

5

కర్ణాటక నాయకత్వంలో మార్పు?

సిద్దు రాజ్యసభకు, డికె సిఎం?



5

ఐదు దేశాల్లో భారత్ డ్రైవింగ్‌లైసెన్స్ చెల్లుబాటు!



5

అన్నాడిఎంకెలో ముదురుతున్న ముసలం


మరో ఎమ్మెల్యే పార్టీకి రాజీనామా

20 బిలియన్ డాలర్లతో

## 'క్వాడ్' ప్రణాళిక

సరఫరాచైన్ బలోపేతంచేయడమే ప్రధాన లక్ష్యం...

ఢిల్లీ సమావేశంలో నిర్ణయం



న్యూఢిల్లీలో మంగళవారం జరిగిన క్వాడ్ కూటమి సమావేశంలో విదేశాంగ మంత్రి జై శంకర్, అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, జపాన్ విదేశాంగ మంత్రి తోషిమిత్సు మోటెగి, ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి సెనేటర్ పెన్నీ వాంగ్

**న్యూఢిల్లీ, మే26:** ప్రపంచ సరఫరా నెట్‌వర్క్‌లపై ఆధారపడటాన్ని తగ్గించడం, ఇండోపసిఫిక్ ప్రాంతంలో ఆర్థిక భద్రతను పెంపొందించడమే లక్ష్యంగా క్వాడ్ విదేశాంగమంత్రి ఎస్‌జైశంకర్ అధ్యక్షతన జరిగిన క్వాడ్‌దేశాల కూటమి సమావేశంలో అమెరికా,ఆస్ట్రేలియా,జపాన్, భారత్‌లు ఈ కీలక నిర్ణయం తీసుకున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ పెట్టుబడుల రూపంలో కీలక ఖనిజాల సరఫరా గొలుసులను బలోపేతం చేయడానికి 20 బిలియన్ డాలర్ల వరకు సమీకరించేందుకు ఒక ముఖ్య ప్రణాళికను ఆవిష్కరించాయి. భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్ సంయుక్తంగా క్వాడ్ క్రిటికల్ మినరల్స్ ఇనిషియేటివ్ ఫ్రేమ్‌వర్క్ ను విడుదల చేశాయి. ఈ ఫ్రేమ్‌వర్క్ అధునాతన సాంకేతికతలు, స్వచ్ఛ ఇంధన వ్యవస్థలు, సెమీ కండక్టర్లు, ఎలక్ట్రిక్ వాహనాలు, టెలీ కమ్యూనికేషన్లు, రక్షణ రంగ తయారీకి అవసరమైన కీలక ఖనిజాల తవ్వకం, శుద్ధి, పునరుద్ధరణలో సహకారానికి దిక్సూచిగా నిలుస్తుందని నేతలు వెల్లడించారు. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో కీలక ఖనిజాలు, సముద్ర భద్రత, ఇంధన సమస్యలపై క్వాడ్ విదేశాంగ మంత్రులు దిల్లీలో సమావేశమై చర్చలుజరిపిన అనంతరం ఈప్రణాళిక ఖరారుచేసారు. దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో క్వాడ్ విదేశాంగ మంత్రులు సమావేశం మంగళవారం జరిగింది. ఈ మీటింగ్‌లో భారత్, >>2



## సిఎన్‌జి ధర రూ.2 పెంపు

రెండు వారాల్లో ఇది నాల్గోసారి

**ముంబయి, మే 26:** గ్యాస్ పంపిణీ సంస్థ 'ఇంద్రప్రస్థ గ్యాస్ లిమిటెడ్' (ఐజీఎల్) మంగళవారం కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సిఎన్‌జి) ధరలను మరోసారి పెంచింది. కిలోకు రూ.2 చొప్పున పెంచింది. కేవలం రెండు వారాల లోపే ధరలు పెరగడం ఇది నాలుగోసారి. తాజా సవరణతో, ఢిల్లీలో సిఎన్‌జి ధర కిలోకు రూ.81.09 నుండి రూ.83.09కి చేరింది. అయితే, జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సిఆర్) అంతటా ధరలు పెరిగాయి. నోయిడా, ఘజియాబాద్, గ్రేటర్ నోయిడా వినియోగ >>2

# ఖాతాల్లోకి పెన్షన్లు

అర్హులకే అందేట్లు చూడాలి

ఒంటరి మహిళలకు తొలి ప్రాధాన్యం

పంచాయతీ సిబ్బందికి ఫస్ట్‌నే జీతాలు

వారికి రూ.50 కోట్లు మంజూరు: సిఎం రేవంత్



మంగళవారం పంచాయతిరాజ్ సమీక్షలో సిఎం రేవంత్, మంత్రి సీతక్క తదితరులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే26:** రాష్ట్రంలో పెన్షన్ల పంపిణీ విధానంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలిచ్చారు. పోస్టల్ శాఖ ద్వారా అందజేస్తున్న ప్రస్తుత విధానాన్ని మార్చి నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేయాలని స్పష్టం చేశారు. అర్హులకే పెన్షన్లు అందేలా చూడాలని, ఓటర్ ఐడీ, ఆధార్, ఎస్‌ఈఈఈపిసి డేటా ఆధారంగా పెన్షన్లను స్ట్రీమ్ లైన్ చేయాలని చెప్పారు. కొత్తగా అందించే పెన్షన్లలో ఒంటరి మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. మంగళవారం రాత్రి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష చేశారు. ఈసమీక్షలో అధికారులకు సిఎం పలు కీలక సూచనలు చేశారు. రాష్ట్రంలోని 50 వేల మంది గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతీ నెలా మొదటి తారీఖునే జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఐఏఎస్ అధికారులకు నెల నెలా సమయానికి జీతాలు అందినట్లే గ్రామ పంచాయతీ సిబ్బందికి కూడా అలాగే జీతాలు అందాలని స్పష్టం చేశారు. సిబ్బంది జీతాలు చెల్లించడానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతీ నెలా రూ.50 కోట్లు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తామన్నారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ అనే తేడా లేకుండా ప్రభుత్వంలోని అన్ని శాఖల పరిధిలోని ఉద్యోగులకు మొదటి తారీఖునే జీతాలు అందేలా చూడాలని చెప్పారు. సిబ్బంది జీతాలు ఒక్కరోజు ఆలస్యమైనా ఊరుకునేది >>2

## 99 రోజుల ప్రణాళిక సక్సెస్

జూన్ 2 నుండి ముగింపు వేడుకలు: డి.సిఎం భట్టి

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా ప్రణాళిక కార్యక్రమం విజయవంతం కావడంతో దాని ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించాలని మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయించింది. దీన్ని పురస్కరించుకుని జూన్ 2 నుండి 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలను అత్యంత ఘనంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని కెబినెట్ సబ్ కమిటి అధికారులను ఆదేశించింది. సచివాలయంలో మంగళవారం డిప్యూటీ సీఎం భట్టి >>2



మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో హరీష్. చిత్రంలో సబిత, రమణ, ముఠా గోపాల్

శంషాబాద్‌లో వెయ్యి కోట్ల

## భూముల స్కాం

170 ఎకరాల ప్రభుత్వ భూమి, పట్టా ఎలా అయింది?

సిట్ వేసి, విచారణ జరపండి: హరీష్ రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే26:** రూ. వెయ్యి కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ప్రేవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేశారని మాజీ మంత్రి.డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆరోపించారు. సిట్‌లేదా సిఐడీ విచారణజరిపి ప్రభుత్వ భూములను కాపాడాలని,ఇందులో ఇన్వాల్వ్ అయిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శంషాబాద్ మండలం పెద్ద షాపూర్‌లో 170 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేసే కుట్ర జరిగిందని ఆరోపించారు. మంగళవారం సాయంత్రం మాజీ మంత్రులు సబితాఇంద్రారెడ్డి, సత్యవతిరాథోడ్, నేతలు ఎల్.రమణ, ముఠాగోపాల్‌లతో కలిసి తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఆ భూమి ప్రభుత్వ భూమి అని, దాన్ని ఆక్రమణకు గురి కాకుండా ఉండాలని తహశీల్దార్‌కు ఆర్డీవో >>2

తెలంగాణలో 3 రోజులు రెడ్ అలర్ట్

నల్లగొండ 46.5°, నిజామాబాద్, సూర్యాపేట 46.4°

19 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైనే

నైరుతి పవనాలు మరింత ఆలస్యం



## వడదెబ్బకు 200 మంది బలి

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో భానుడి ఉగ్రరూపం కొనసాగుతూనే ఉంది. అత్యంత గరిష్టంగా 46 డిగ్రీలకు పైగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలకు తోడు తీవ్రమైన వడగాలులు వీస్తుండటంతో జనం విలవిలలాడిపోతున్నారు. ఎండల తీవ్రత, వడదెబ్బ కారణంగా ప్రతి రోజూ పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు విడుస్తున్నారు. దీంతో రాష్ట్రంలో వడదెబ్బ మరణ మృదంగం మోగిస్తోంది. వారం రోజుల వ్యవధిలోనే రాష్ట్రంలో దాదాపు 200 మంది దాకా వడదెబ్బకు బలైనట్టు సమాచారం. ఆదివారం వరకు రాష్ట్ర వ్యాప్తంగా 144 మంది వడదెబ్బబారిన పడి మృతిచెందగా సోమవారం ఒక్క రోజునే 54 మంది మృతిచెందారు. మంగళవారం కూడా రాష్ట్రంలో ఖమ్మం జిల్లాలో ఇద్దరు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఏటూరు నాగారంలో ఒకరు, కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఇద్దరు వడదెబ్బబారిన పడి ప్రాణాలు విడిచారు. ఎండల తీవ్రతకు రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్నం వేళ రోడ్లన్నీ కర్ఫ్యూను తలపిస్తూ నిర్మానుష్యంగా మారుతున్నాయి. తెలంగాణలో మూడు రోజులపాటు (ఈనెల 28వరకు) ఇదే పరిస్థితి కొనసాగుతుందని, ఎండల తీవ్రతతో పాటు వడగాల్పులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉండనుందనిపేర్కొంది. ప్రస్తుతం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 41 నుండి 46 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో వడగాల్పుల తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుందని ఆ జిల్లాలకు రెడ్ అలర్ట్‌ను జారి చేసింది. కాగా.. కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, మహబూబాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారి అయింది. అదే విధంగా ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ అయింది. గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలో 19 జిల్లాల్లో 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా నల్గొండ జిల్లా వేములపల్లి మండలం బుగ్గబావి గూడలో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆ తర్వాత భద్రాద్రి కొత్త గూడెం, జగిత్యాల, కొమరం భీం ఆసిఫాబాద్, నిజామాబాద్, సూర్యాపేట జిల్లాల్లో 46.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు ఖమ్మం, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో 46.3 డిగ్రీలు, కరింనగర్, మహబూబాబాద్, ములుగు, నిర్మల్ జిల్లాల్లో 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, వరంగల్, ఆదిలాబాద్, రాజన్నసిరిసిల్ల, సిద్ధిపేట జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో రాబోయే అయిదు రోజుల పాటు ఎండల తీవ్రత ఇలాగే కొనసాగుతుందని, ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. మధ్యాహ్నం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని, ఆ సమయంలో అత్యవసరమైతే తప్ప వృద్ధులు, గర్భిణులు, చిన్నపిల్లలు బయటకు రావొద్దని హెచ్చరించింది. కాగా.. అత్యధిక ఉష్ణోగ్రతల కారణంగా వాతావరణంలో క్యుములో నింబస్ మేఘాలు ఏర్పడుతున్నాయి. మధ్యాహ్నం 2:30 తర్వాత లేదా సాయంత్రం వేళల్లో ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షాలు కురుస్తున్నాయి. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలరాక మరింతఆలస్యం కానుందన్న అంచనాల >>2



మంగళవారం హైదరాబాద్‌లో డిజిపి ఆనంద్ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు దంపతులు నరహరి, దానమ్మ

## మావోయిస్టు దంపతులు నరహరి, దానమ్మ లొంగుబాటు

ఇంకా అజ్ఞాతంలో 47 మంది

గ్రేహౌండ్స్, ఎస్‌ఐబిలు రద్దుకావు: డిజిపి

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** మావోయిస్టులకు మరో ఎదురు దెబ్బతగిలింది. ఆపార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, బిహార్ ఝార్కండ్ ప్రత్యేక ప్రాంతీయ కమిటీ కార్యదర్శి పసునూరి నరహరి అలియాస్ విశ్వనాథ్ ఊరఫ్ సలైదా, ఆయన సతీమణి బిహార్ జార్ఖండ్ ప్రత్యేక ప్రాంతీయ కమిటీ సభ్యురాలు దానమ్మ అలియాస్ పూనం, ఊరఫ్ రోజా మంగళవారం డిజిపి సి.వి ఆనంద్ ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా నరహరి పేరిట వున్న 25 లక్షల రూపాయల రివార్డు, దానమ్మ పేరిట వున్న 20 లక్షల రూపాయల రివార్డును డిజిపి ఆనంద్ వారికి అం దజేశారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ మావోయిస్టుల శకం ముగిసినా గ్రే హౌండ్స్, ఎస్‌ఐబి విభాగాలను రద్దు >>2

భగీరథ్‌కు 3 రోజుల

## పోలీసు కస్టడీ

నేటి నుంచి విచారణ



**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డ ఘటనలో అరెస్టయిన బండి భగీరథ్‌కు మూడు రోజుల పోలీసు కస్టడీ ఇస్తూ మల్కాజిగిరి పోక్సో కోర్టు మంగళవారం నాడు ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 10వ తేదీన పేట్ బషీరాబాద్ పోలీసు >>2



## అన్నదాతలు ముప్పుతిప్పలు!

వేగం పుంజుకోని ధాన్యం కొనుగోళ్లు

లారీల కొరత.. లోడింగ్‌లో జాప్యం

కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యం రాశులు

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ రైతులను ముప్పు తిప్పలు పెడుతోంది. పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకోవడానికి అవకాశం లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. వరి, మొక్కజొన్న దిగుబడులు కొనుగోలు కేంద్రాల్లోనే నెలరోజులకు పైగా ఉండడంతోకన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ధాన్యాన్ని సకాలంలో తూకంవేసి, లోడ్‌చేసి మిల్లులకు తరలించడంలో అధికారుల నిర్లక్ష్యం, లారీల కొరత రైతుల పాలిట శాపంగా మారింది. గన్నీ సంచులు, హమాలీలు, కాంటాలు లేక ఇబ్బంది పడ్డ రైతులు ప్రస్తుతం ధాన్యం కాంట పూర్తయినా లారీలు అందుబాటులో లేక నింపిన సంచులు కల్లాలే వద్దే ఉండడంతో తమ ధాన్యం మిల్లులకు ఎప్పుడు పోతుందని ఆశగా ఎదురు చూస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వరి పండించిన రైతులు మొక్కజొన్న పండించిన రైతులపరిస్థితి ఇప్పుడు దయనీయంగా ఉంది. కొన్ని గ్రామాల్లో రైతులు ప్రైవేట్ లారీలను తీసుకొని తాము పండించిన ధాన్యాన్ని లారీలకు రైతులుకిరాయిచెల్లించి మిల్లులకు చేరవేస్తున్నారు. దీంతో రైతులపై అదనపు బారం పడుతుంది. >>2



రాష్ట్రంలో ఎబోలా

## కేసుల్లేవు

మంత్రి దామోదర

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 26:** తెలంగాణ రాష్ట్రంలో ఎబోలా కేసులు నమోదు కాలేదని, ఎబోలా లక్షణాలు ఉన్న వ్యక్తులను కూడా ఇప్పటివరకు గుర్తించలేదని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఎబోలా విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా ఉందని మంత్రి స్పష్టం >>2

కర్మకాండ జరిపిన ఆడ బిడ్డలు మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్‌లో విషాదం

6

ఆస్తి ఇచ్చినా.. తల్లి అంత్యక్రియలకు రాని కొడుకు

ఆమె డ్రైవర్‌కు రూ. 2 లక్షలు లంచం ఇస్తుండగా పట్టుబడిన వైనం

భూమి నాలా కన్వర్షన్‌కు రూ.30 లక్షలు డిమాండ్

3

ఎసిబి వలలో శామీర్‌పేట తహసీల్దార్ సుచరిత



ఒటావోలో కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీతో భేటీ అయిన కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్

## చికిత్స పొందుతూ తప్పించుకున్న రిమాండ్ ఖైదీ

**సికింద్రాబాద్, మే 26, ప్రభాతవార్త:** సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రిమాండ్ ఖైదీ పరారయ్యాడు. చిలకలగూడ పోలీసుల కథనం ప్రకారం.. మొబైల్ ఫోన్ చోరీ కేసులో తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో అరెస్ట్ అయిన అమీర్ హుస్సేన్‌ను (25) పది రోజుల కిందట చంచల్‌గూడ జైలుకు రిమాండ్ చేశారు. జైలులో ఉన్న సమయంలో అతడు అందుబాటులో ఉన్న మేకులను మింగాడు. దీంతో ఆరోగ్యం విషమించడంతో చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న సమయంలో బాత్‌రూమ్‌కు వెళ్లిన అమీర్ హుస్సేన్ కిటికిలోంచి తప్పించుకున్నాడు. పరారైన విషయం గుర్తించిన ఆస్పత్రి వర్గాలు పోలీసులుకు సమాచారం అందించారు. చిలకలగూడ పోలీసులు కేసు నమోదు చేసుకుని గాంలింపు కోసం ప్రత్యేక బృందాలను గాలింపు కోసం రంగంలోకి దింపారు.

## వడదెబ్బకు 200 మంది బలి

>> నేపథ్యంలో వాతావరణశాఖ కీలక అప్‌డేట్ ఇచ్చింది. రెండు, మూడు రోజుల్లో రుతుపవనాలు చురుకుగా కదలనున్నాయని, ఇందుకు వాతావరణం సానుకూలంగా ఉందని పేర్కొంది. దక్షిణాది రాష్ట్రాల్లో రుతుపవన వర్షాలు కురుస్తాయని ఐంఎడి హెచ్చరించింది. వాస్తవానికి మే 26 నాటికే రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకాల్సి ఉన్నా వాతావరణ పరిస్థితుల వల్ల సాధ్యం కాలేదు. హిందూ మహాసముద్రం, బంగాళాఖాతంలో చకచకా కదిలిన రుతుపవనాలు.. శ్రీలంకలో సగం దూరం వచ్చాక ఒక్కసారిగా నిలిచిపోయాయి. ఇందుకు ఎల్‌నినో ప్రభావమే కారణమని నిపుణులు చెబుతున్నారు. నైరుతి కదలికకు మంగళవారం సానుకూల వాతావరణం ఏర్పడిన నేపథ్యంలో జూన్ 1 నాటికి కేరళను నైరుతి తాకే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. జూన్ 5 తర్వాత తెలంగాణను తొలకరి పలకరిస్తుందని చెబుతున్నారు.

## వెయ్యి కోట్ల భూముల స్కాం

>> చెప్పారు. అంతేకాదు ప్రొహిబిటరీ లిస్టు 22ఏలో పెట్టాలని ఆదేశించారు. ఇదే విషయం జనవరి 30, 2026 నాడు హైకోర్టుకు ఇచ్చిన అఫిడవిట్ లో పొందుపరిచారు. ఇది ప్రభుత్వ భూమి అని ఫ్రిబవరి 24, 2026 నాడు తహశీల్దార్ తేల్చారు. నాలుగు రోజుల తర్వాత ఫిబ్రవరి 28, 2026 నాడు ఈ భూమి ప్రైవేటు వ్యక్తులకు చెందుతుందని తహశీల్దార్ ఆర్డర్ పాస్ చేసిండు. నాలుగు రోజుల్లో ప్రభుత్వ భూమి ప్రైవేటు భూమి ఎలా అయ్యింది. అని ప్రశ్నించారు. రూ. 1000 కోట్ల స్కామ్ జరిగితే, తహసీల్దార్‌ను బదిలీ చేసి చేతులు దులిపేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెయ్యి కోట్ల రూపాయల విలువైన భూములు. ఇంత పెద్ద స్కాం జరిగితే అధికారులపై చర్యలు తీసుకోవడం లేదు. ఈ స్కాం గురించి పత్రికల్లో వస్తే, ఈ కేసులో కేవలం ఎమ్మార్వోను కలెక్టరేట్‌కు ట్రాన్స్ఫర్ చేసి ఊరుకున్నరు ఏసీబీ అధికారులు రైడ్ వెళ్లారు. ప్రభుత్వ పెద్దలు ఏం చెప్పారో ఏసీబీ వాపస్ వచ్చింది చిన్న ట్రాన్స్ ర్ తో సరిపెట్టారు, ముఖ్యమంత్రి అతి సన్నిహితుడు ఇందులో ఉన్నడు కాబట్టే ఏసీబీ వెనక్కి వచ్చింది, ఒత్తిడి కారణంగానే ఎమ్మార్వోను జస్ట్ ట్రాన్స్ఫర్ చేసారు. ఎలాంటి చర్యలు తీసుకోలేదు.ఎమ్మార్వో ను కాపాడటంలో ఉన్న పెద్దలు ఎవరు? అని ప్రశ్నించారు. భూ భారతిలో భూమి చేరాలంటే.. దరఖాస్తు పెట్టాలి, ఆర్డీవో దాన్ని అప్రూవ్ చేయాలని భూభారతి చట్టం చెబుతుంది. కానీ ఎమ్మార్వో భూ భారతిలో పెట్టాలని చెప్పగానే అది భూ భారతిలో ఎంట్రీ అయిపోయింది.170 ఎకరాలు ప్రభుత్వ భూమి పట్టా అని ఎలా ఎక్కించారు ప్రశ్నించారు. పత్రికల్లో రాగానే.. ఎమ్మార్వో ను కేవలం ట్రాన్ఫర్ చేసి భూమి మ్యుటేషన్ చేసుకున్నరు.ఎందుకు భూమిని వెనక్కి తీసుకోరు. ఎందుకు నిషేధిత జాబితాలో పెట్టరుటోటల్ పట్టా భూమిగా మార్చుకొని 170 ఎకరాలు ఎక్కించారు.వెయ్యి కోట్ల విలువైన భూమి వెనుక కలెక్టర్ ఉన్నడా, ప్రభుత్వ పెద్దలు ఉన్నరారాత్రి రాత్రి ఎట్లా ప్రైవేటు భూమి అయ్యిందిఎమ్మార్వో ఆర్డ్ ను సస్పెండ్ ఛేయాలి. సర్వీస్ నుంచి డిస్మిస్ చేయాలిహైకోర్టు ఆర్డర్ మీద అప్పీల్ వెల్లండి. ఆ బూమిని తిరగి నిశేధిత జాబితో పెట్టాలివందల వేల కోట్ల విలువైన ఆర్డీవో ఆర్డర్ దిక్కరించి పట్టా భూమి మార్చారుదీనిపై సిట్ లేదా సీఐడి విచారణ జరిపించాలి. కలెక్టర్, సీసీఎల్‌ఏ, ఉన్నతాధికారులు ఉన్నరా ఆరా తీయాలి. ప్రభుత్వ పెద్దలు బయటకు రావాలి.మీది నిజంగా ప్రజాపాలన అయితే, ఈ భూ కుంభకోణంలో భాగస్వామ్యం లేకపోతే, తప్పు చేయకపోతే మీ ప్రమేయం లేకపోతే తహశీల్దార్ ను వెంటనే డిస్మిస్ చేయండి, ప్రభుత్వ భూమిని కాపాడండి అని ప్రభుత్వానికి సూచించారు.

## ఎబోలా కేసుల్లేవు

>> చేశారు. రాష్ట్రంలోకి ఎబోలా ఎంటర్ అవకుండా ఎయిర్‌పోర్టులోనే పటిష్ట చర్యలు చేపట్టామని మంత్రి వెల్లడించారు. ప్రజారోగ్య రక్షణ కోసం అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నామని, ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ఆరోగ్య వ్యవస్థ సిద్ధంగా ఉందన్నారు. ఆఫ్రికాలోని కొన్ని దేశాల్లో ఎబోలా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో, ఎబోలా నివారణ, ముందస్తు జాగ్రత్తలు, సన్నద్ధతపై మంత్రి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవిందర్ నాయక్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్ర కుమార్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు రాష్ట్రంలో అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టినట్లు అధికారులు మంత్రికి తెలిపారు. ప్రధానంగా డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, సౌత్ సూడాన్ వంటి ఎబోలా బాధిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికులను శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలోనే స్క్రీనింగ్, థర్మల్ స్కానింగ్ చేస్తూ వారిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. విమానాశ్రయంలో డాక్టర్లు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, ఫీల్డ్ స్టాఫ్, పారామెడికల్ సిబ్బందితో ప్రత్యేక బృందం విధులు నిర్వహిస్తోందన్నారు. అత్యవసర పరిస్థితుల కోసం 108 అంబులెన్స్‌లను 24 గంటలపాటు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. గాంధీ హాస్పిటల్‌లో 10 పడకల ప్రత్యేక ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేశామన్నారు. జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ, డాక్టర్ సునీల్ కుమార్‌ను నోడల్ ఆఫీసర్‌గా నియమించామని తెలిపారు.

## రూ.2 పెంపు

>> ధరలు ఇప్పుడు కిలోకు రూ.91.70 చెల్లించాల్సి ఉండగా, గురుగ్రామ్‌లో ధరలు కిలోకు రూ.88.12కి పెరిగాయి. అజ్మీర్‌లో సిఎన్‌జి ధరలు కిలోకు రూ.92.44కి చేరాయి. శనివారం నాడు కిలోకు రూ.1 పెంపును ప్రకటించిన కొద్ది రోజులకే ఈ తాజా పెంపు చోటుచేసుకుంది. సిఎన్‌జి ధరలు పదేపదే పెరుగుతుండటం వల్ల, సిఎన్‌జితో నడిచే వాహనాల వినియోగదారులపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రజా రవాణా వ్యవస్థలు, టాక్సీలు, వాణిజ్య వాహనాలు ఈ ఇంధనంపైనే ఎక్కువగా ఆధారపడి ఉన్నాయి. నిర్వహణ ఖర్చులు పెరగడం వల్ల, చివరికి ప్రయాణికులకు ఛార్జీలు పెంచాల్సి వస్తుందని రవాణా నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అదే సమయంలో, ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు (ఒఎంసిలు) కూడా రెండు వారాల లోపే పెట్రోల్, డీజిల్ ధరలను నాలుగోసారి పెంచాయి. ప్రపంచ ఇంధన మార్కెట్లలో నెలకొన్న అస్థిరత, మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్తతల నడుమ ముడి చమురు సరఫరాపై పెరుగుతున్న ఆందోళనలే ఈ వరుస ధరల పెంపునకు కారణమని చెబుతున్నారు.

## పోలీసు కస్టడీ

>> స్టేషన్‌లో నమోదైన కేసులో వారం రోజుల తరువాత భగీరథ్‌ను పోలీసులు అరెస్టు చేయడం తెలిసిందే. భగీరథ్‌పై ఫోక్సోతో పాటు సాక్షుల ధ్వంసం చే సినందుకు సంబంధించిన మరో సెక్షన్‌ను జోడించారు. అప్పటి నుంచి చర్లపల్లి జైల్లో వున్న భగీరథ్‌ను ఫోక్సో కేసులో మరింతగా విచారించే దుకు వారం రోజుల కస్టడీ ఇవ్వాలని ఈ కేసును విచారిస్తున్న సిట్ బృందం కోర్టును కోరడం విదితమే. దీనిపై విచారించిన న్యాయమూర్తి మం గళవారం సాయంత్రం భగీరథ్‌ను పోలీసులు కోరినట్లు వారం రోజులు కాకుండా మూడు రోజుల కస్టడీ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవా రం నుంచి శుక్రవారం వరకు భగీరథ్‌ను సిట్ బృందం విచారించనుంది. భగీరథ్‌ను పేట్ బషీరాబాద్ లేదా మరో చోట విచారించే వీలుంది. ఈ కేసులో ఇప్పటికే మైనర్ బాలిక ఆమె తల్లి వాంగ్మూలం తీసుకున్న సిట్ అధికారులు దీంతో పాటు భగీరథ్‌కు సంబంధించి పది మంది స్నేహి తులు, సన్నిహితులను విచారించి అతని ప్రవర్తనకు సంబంధించిన వివరాలు సేకరించారు. భగీరథ్‌ను బుధవారం ఉదయం పది గంటల సమ యంలో చర్లపల్లి జైలు నుంచి సిట్ అధికారులు తమ కస్టడీలోకి తీసుకోనున్నారు. కస్టడీ విచారణ సమయంలో అవసరమయితే అతని స్నేహి తులు, బాధిత బాలిక, ఆమె తల్లిని ఒకచోట వుంచి విచారించే వీలుంది. కస్టడీలో వెలుగుచూసే విషయాల ఆధారంగా భగీరథ్‌పై కోర్టుకు సిట్ అధికారులు నివేదిక ఇవ్వనున్నారు.

### వారం - వర్జ్యం

27-05-2026, అధికజ్యేష్ఠ బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, మృగశిర కార్తె
ఏకాదశి ఉ.6.22
హస్త తె.5.56
వర్జ్యం : మ.2.40-సా.4.25
దు. ఉ.11.38-మ.12.30
శుభసమయం:ఉ.5.30-6.00
రాహుకాలం - మ.12.00-1.30

### వార్తాఫలం

**మేషం:** లేఖలు, సమావేశములు, సదస్సుల ద్వారా దూరపు మిత్రులను కలుస్తారు. క్రయ విక్రయాలలో లాభాలు. వస్త్రలాభం.

**వృషభం:** ఉద్యోగ ప్రయత్నములకు మీరు చేసే కృషి సానుకూల పడుతుంది. డాక్యుమెంట్స్‌లో అవసరమైన మార్పు చేస్తారు.

**మిథునం:** ఆధ్యాత్మిక విషయములలో చురుకుగా పాల్గొంటారు. మానసికోల్లాసమును కలిగి ఉంటారు. వాహనసౌఖ్యం.

**కర్కాటకం :** రాజకీయము, వృత్తి, విద్యావనులకు న్యాయవ్యవహారములకు సంబంధించిన విషయాలు సానుకూల పడతాయి.

**సింహం:** సన్నిహితులైన వారి మాటలను లెక్క జేయకుండా ధర్మబద్ధముగా మీ బాధ్యతలను నిర్వహిస్తారు. వస్త్రలాభం.

**కన్య :** ఏ ఆధారమునూ లేని వారికి ఓ ఆధారమును కల్పించే యత్నములను గోప్యముగా చేస్తారు. బంధువుల కలయిక.

**తుల :** ఋణ సంబంధమైన చికాకులు పోతాయి. కోర్టు వ్యవహారములు మూడు వంతులు మీకే అనుకూలంగా ఉంటుంది.

**వృశ్చికం:** గృహములోని ఖర్చులను తగ్గించుటకు చేసే యత్నములు బెడిచి కొట్టవచ్చును. కొత్తమిత్రులు పరిచయం అవుతారు.

**ధనుస్సు:** నిర్మాణాత్మకమైన నిర్ణయములను అమలు చేయుటకు తగిన వ్యక్తులు కలుస్తారు. అందువల్ల లాభపడతారు.

**మకరం:** ఆర్థిక ప్రణాళికలు, నూతనమైన రూపురేఖలను దిద్దుకుంటాయి. రావలసిన బకాయిలకు గట్టి హామీ లభిస్తుంది.

**కుంభం:** మీ ఏకాగ్రతకు భంగం జరుగు సమస్యల అన్నింటినీ స్వయముగా పర్యవేక్షించుట కోపమునకు కారణం అవుతుంది.

**మీనం :** వృత్తి యందు బాధ్యతలు అధికమగుట వలన శరీరము అలసటకు గురి అవుతుంది. స్పెక్యులేషన్‌కు దూరంగా వుండండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అనర్హులైన ఓటర్ల పేర్లను తొలగించేలా చర్యలు

### 'సర్' ప్రక్రియపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే26:** భారత ఎన్నికల సంఘం రాష్ట్రంలో త్వరలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అలాగే అనర్హులైన ఓటర్ల పేర్లను తొలగించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం బిఆర్‌కెఆర్ భవన్‌లో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర్ రెడ్డి, ఉప ప్రధాన ఎన్నికల అధికారి జి.ఎస్.చారిలతో ఆయన కలిసి ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిహెచ్‌ఎంసి కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. మను చౌదరి, సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్‌ఓలు) హాజరయ్యారు. ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణలో బూత్ స్థాయి అధికారులు (బిఎల్‌ఓ)ల కీలక పాత్ర పోషిస్తున్నందున వారికి తగిన శిక్షణ ఇవ్వాలని ఈఆర్‌ఓలకు సూచించారు. అలాగే బిఎల్‌ఓల పనివిధానంపై నిరంతరం సమీక్షి స్తూ, మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.అలాగే ఎత్తైన అపార్ట్‌మెంట్ భవనాలు, గేటెడ్ కమ్యూనిటీలపై ప్రత్యేక దృష్టి సారించి ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని ఈఆర్‌ఓలకు సూచించారు. పట్టణ ప్రాంతాల్లో, ముఖ్యంగా మురికివాడలలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ ప్రక్రియను మరింత సరళీతరం చేయడానికి ఎన్యూమరేషన్ ఫారాలు ఆంగ్లం, తెలుగు భాషాల్లో ఉంటాయని తెలిపారు. అలాగే విఐపి,వివిఐపి ఓటర్ల మ్యాపింగ్ సక్రమంగా జరిగేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణలో పాలుపంచుకున్న క్షేత్రస్థాయి సిబ్బందిని ప్రోత్సహించేందుకు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బిఎల్‌ఓకు బెస్ట్ బిఎల్‌ఓ అవార్డు అందజేయనున్నట్లు ప్రధాన ఎన్నికల అధికారి ప్రకటించారు.

# 20 బిలియన్ డాలర్లతో 'క్వాడ్' ప్రణాళిక

>> ఆస్ట్రేలియా, జపాన్, అమెరికాకు చెందిన విదేశాంగ మంత్రులు పాల్గొన్నారు. ఈ క్రమంలో ప్రపంచ ఇంధన పరివర్తన, ఉన్నత సాంకేతిక పరిశ్రమలకు కీలకమైన లిథియం, కోబాల్ట్, నికెల్, గ్రాఫైట్ వంటి అరుదైన ఖనిజాల లభ్యతకు సంబంధించి సరఫరా గొలుసులోని బలహీనతలు, పెరుగుతున్న భౌగోళిక రాజకీయ పోటీపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో క్వాడ్ క్రిటికల్ మినరల్స్ ఇనిషియేటివ్ ఫ్రేమ్‌వర్క్‌ను నాలుగు దేశాలు విడుదల చేశాయి. ఈ ఫ్రేమ్‌వర్క్ కింద క్వాడ్ భాగస్వాములు ఆర్థిక విధాన సాధనాలు, వ్యూహాత్మక పెట్టుబడులు ద్వారా సురక్షితమైన ఖనిజ మార్కెట్ల అభివృద్ధికి మద్దతు ఇవ్వాలని నిర్ణయించారు. ప్రభుత్వ మద్దతుగల ఆర్థిక యంత్రాంగాలు, ప్రైవేట్ రంగ భాగస్వామ్యం ద్వారా 20 బిలియన్ డాలర్ల వరకు సమీకరించాలనే ప్రతిపాదన ఈ చొరవలో ఒక ప్రధానాంశంగా ఉంది. రుణ సాయం, హామీలు, బీమా, ఈక్విటీ భాగస్వామ్యం, వ్యూహాత్మక ప్రాజెక్టుల కోసం వాణిజ్య ఆఫ్టేక్ ఏర్పాట్లు ఉండవచ్చని ఫ్రేమ్‌వర్క్ తెలియజేస్తోంది. క్వాడ్ నెక్సస్ ఉన్న ప్రాజెక్టులను గుర్తించి, వాటికి మద్దతు ఇవ్వాలని కూడా యోచిస్తున్నాయి.నియంత్రణా సమన్వయం, జాతీయ భద్రతా రక్షణ చర్యలకు కూడా అధిక ప్రాధాన్యం ఇస్తుంది. ఈ ఫేమ్‌వర్క్‌లో అనుమతులు, లైసెన్సింగ్ వ్యవస్థలను మెరుగుపరచడం, నియంత్రణ ప్రక్రియలను క్రమబద్ధీకరించడం, జియోగ్రాఫికల్ మ్యాపింగ్, వనరుల అంచనాలో సాంకేతిక నైపుణ్యాన్ని పంచుకోవడం వంటి విషయాలలో తాము సహకరించుకుంటామని క్వాడ్ సభ్యదేశాలు తెలిపాయి.

**క్రిటికల్‌మినరల్స్, రేర్‌ఎర్త్ రంగాల్లో ఇండో అమెరికా ఒప్పందం**

ఇండియా-అమెరికా మధ్య అరుదైన ఖనిజాలు, విలువైన లోహాల సరఫరాపై కీలక ఒప్పందం కుదిరింది. క్రిటికల్ మినరల్స్, రేర్ ఎర్త్ సప్లైలపై వ్యూహాత్మక ముందడుగు పడింది. ఈ విషయంలో ఇరు దేశాలు ఎలా ముందుకెళ్లాలి అనే అంశంపై ఒక ఫ్రేమ్‌వర్క్ కుదుర్చుకున్నాయి. ప్రస్తుతం ఢిల్లీలో క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం జరుగుతున్న సంగతి తెలిసిందే. అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియోతో భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్ జైశంకర్ సమావేశమయ్యారు. తాజాగా క్రిటికల్ మినరల్స్‌పై ఒక ప్రాథమిక ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం వల్ల చైనాపై ఆధారపడాల్సిన అవసరం తప్పుతుంది. అమెరికా, ఇండియా ఒకదానికి ఒకటి సహకరించుకుంటే పరస్పరం లబ్ధి పొందవచ్చు. ఆధునిక సాంకేతికత, క్లీన్ ఎనర్జీ, రక్షణరంగ ఉత్పత్తుల తయారీకి అవసరమైన ముడి సరుకు కోసం చైనాపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. ఈ ఒప్పందం ద్వారా మైనింగ్, ప్రాసెసింగ్, పెట్టుబడులు, రీసైక్లింగ్ వంటి వాటిలో ఇరు దేశాలు కలిసి పని చేస్తాయి. సాంకేతికతను పంచుకుంటాయి. భూమిలో అరుదుగా లభించే ఖనిజాలు, ఇతర ముడి పదార్థాలను క్రిటికల్ మినరల్స్, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ అంటారు. ఈ ముడి సరుకు ద్వారానే ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల్లో వాడే సెమీ కండక్టర్లు, ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీలు, సోలార్ ప్యానెళ్లు, టెలీ కమ్యూనికేషన్ ఎక్విప్‌మెంట్, ఫైటర్ జెట్లు, ఏఐ నిర్మాణ సామగ్రి వంటివి తయారు చేస్తారు. ప్రస్తుతం ప్రపంచం అంతా టెక్నాలజీపైనే ఆధారపడుతోంది. ఈ నేపథ్యంలో క్రిటికల్ మినరల్స్ చాలా ముఖ్యం. వీటి లభ్యతలో చైనా ముందుంది. ఈ మార్కెట్‌లో చైనా ఆధిపత్యం కొనసాగుతోంది. అందుకే చైనాకు చెక్ పెట్టేందుకు ఇండియా-అమెరికా పరస్పరం సహకరించుకోవడం అవసరం.



ఇండోర్‌లోని పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో మంగళవారం పాసింగ్ అవుట్ పరేడ్ చేస్తున్న 617 మంది కానిస్టేబుళ్లు

# నరహరి, దానమ్మ లొంగుబాటు

>> చేయబోమని తెలిపా రు. లొంగిపోయిన నక్సలైట్ల పునరా వాసం విషయంలో సర్కారు ప్రాధాన్యం ఇస్తున్నందున, దీనిపై ప్రతీ రెండు నెలలకోసారి తాను ప్రత్యేకం గా సమీక్షిస్తామని, మాజీ మావోయిస్టులుండే ప్రాంతాలను తాను పరిశీలిస్తానని, వారికి కావలసిన సౌకర్యాలను కల్పిస్తామని ఆయన తెలిపారు. అజ్ఞాతంలో వున్న మావోయిస్టు అగ్రనేత గణపతి సహా మిగిలిన 47 మంది కూడా లొంగిపోవాలని ఆయన కోరారు.
మావోయిస్టు పార్టీకి చెందిన మరో అగ్రనేత పసునూరి నరహరి తన భార్య దానమ్మతో కలిసి పోలీసులకు లొంగిపోయారు. వాస్తవానికి పది రోజుల క్రితమే వీరిద్దరు పోలీసులకు లొంగిపోయినా అనారోగ్యం కారణంగా వైద్యం తీసుకోవడంతో లొంగుబాటు ఆలస్యం అయ్యింది. కాగా వీ రి లొంగుబాటు డిజిపి కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం డిజిపి ఆనంద్ ఎదుట జరిగింది. వరంగల్‌లోని కాజీపేటకు చెందిన నరహ రి 64 ఏళ్ల వయస్సు కాగా విద్యార్థి దశలోనే రాడికల్స్ ఉద్యమంలో చేరి ఆ తరువాత నక్సలైటుగా మారారు. 1982లో ఉమ్మడి ఎపి నుంచి ఛత్తీస్‌ఘడ్‌కు వెళ్లి కుంట దళంలో చేరాడు. 1986లో దండకారణ్య దళంలో చేరాడు. 1988లో గుంటూరుకు చెందిన సహచర మహిళా మావోయిస్టు దానమ్మను వివాహం చేసుకున్నాడు. ఇదే సమయంలో మావోయిస్టు పార్టీ హైదరాబాద్ ఆర్గనైజర్‌గా పనిచేశాడు. దీని తరువాత బెం గళూరులో 1990 నుంచి 1997 వరకు మావోయిస్టు పార్టీ ఆయుధాల డంప్‌కు ఇంఛార్జిగా పనిచేశాడు. ఈ సమయంలో ఆయన సతీమణి కూ డా వెంట వుంది. 2000లో ఆర్‌సిఎంగా పదోన్నతి పొందాడు. అప్పటి నుంచి 2004 వరకు నాగ్‌పూర్‌లో పార్టీ సాంకేతిక విభాగం ఇంఛార్జి గానూ, కేంద్ర సాంకేతిక కమిటీకి కీలకంగానూ వున్నాడు. 2005లో ఝూర్కండ్‌కు బదిలీ అయ్యాడు. 2006లో పదోన్నతి పొంది బిహార్ ఝూర్కండ్ ప్రత్యేక ప్రాంతీయ కమిటీలో సభ్యుడుగా చేరి 2010 వరకు అక్కడ పనిచేశాడు. 2010లో ఇదే విభాగంలో సాంకేతిక బృందానికి నాయకత్వం వహించాడు. 2017లో తిరిగి బిహార్ ఝూర్కండ్ ప్రత్యేక ప్రాంతీయ కమిటీకి బదిలీ కాగా అక్కడే వివిధ హోదాల్లో వుంటూ 20 26లో కార్యదర్శిగా పదోన్నతి పొందాడు. ఆయుధాల తయారీలో నరహరికి అనుభవం వుంది. దీంతో పాటు మోర్టార్లు, రాకెట్ లాంఛర్లు, గ్రె నేడ్ల తయారీలోనూ నిపుణుడు. పార్టీలో కొత్త వారికి అనేకసార్లు శిక్షణ ఇచ్చాడు. కాగా నరహరి భార్య దనమ్మ ఎపిలోని గుంటూరు జిల్లా గా మాలపాడు నివాసి. మొదట్లో మావోయిస్టు పార్టీ సానుభూతిపరురాలుగా వున్న ఈమె 1988లో నరహరిని వివాహం చేసుకున్నాక పూర్తి స్థాయి మావోయిస్టుగా చేరారు. 2004లో నాగ్‌పూర్‌లో అరెస్టు కాగా 2011 వరకు జైల్లో వుండింది. ఆ తరువాత బెయిల్‌పై వచ్చి మళ్లీ పార్టీలో చేరి బిహార్ ఝూర్కండ్ కమిటీలో చేరింది. లొంగిపోయిన నరహరి దంపతులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన ఆర్థిక ప్రయోజనాలను అంద జేస్తామని డిజిపి ఆనంద్ ఈ సందర్భంగా తెలిపారు. 2024 నుంచి ఇప్పటి వరకు 822 మంది నక్సలైట్లు లొంగిపోగా వారి వద్ద నుంచి 334 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. మావోయిస్టులు లొంగిపోయిన తరువాత వారు గతంలో వాడిన ఆయుధాలు రహ స్య స్థావరాలలో వునట్లు సమాచారం వుందని, వీటికోసం గాలింటి స్వాధీనం చేసుకుంటామని ఆయన తెలిపారు. తాజాగా లొంగిపోయిన ఇద్ద రు పోగా దేశంలో అజ్ఞాతంలో వున్న నక్సలైట్ల సంఖ్య 47గా వుందని, ఇందులో తెలంగాణ నుంచి ముగ్గురు, ఎపి నుంచి ఒకరు వున్నారని ఆయన తెలిపారు.

**లొంగిపోయిన నక్సలైట్ల పునరావాసంపై రెండు నెలలకోసారి సమీక్ష**

ఇదిలావుండగా మావోయిస్టుల శకం ముగిసినా రాష్ట్ర పోలీసు విభాగంలో కీలకంగా వున్న గ్రే హౌండ్స్, ఎస్ఐబి విభాగాలు యధాతథంగా కొనసాగుతాయని డిజిపి ఆనంద్ తెలిపారు. ఈ నేపథ్యంలో తాను దీనిపై రెండు నెలలకు ఒకసారి ప్రత్యేకంగా సమీక్షిస్తానని, లొంగిపోయిన నక్సలైట్లు వుండే ప్రాంతాలను తాను స్థానిక అధికారులతో కలిసి సందర్శిస్తానని, వారితో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తానని ఆనంద్ తెలిపారు. ఛత్తీస్‌ఘడ్‌లో ఏర్పాటు చే స్తున్నట్లుగా తెలంగాణలో కూడా లొంగిపోయిన నక్సలైట్ల కోసం నైపుణ్య కేంద్రాన్ని నెలకొల్పుతామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో శాం తి భద్రతల డిజి మహేష్ భగవత్, నిఘా విభాగం అదనపు డిజి విజయ్ కుమార్, ఎస్ఐబి ఐజి కార్తికేయ తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాతలు ముప్పుతిప్పలు!

>> లారీలు సరఫరా చేస్తామన్న కాంట్రాక్టర్ లారీలను కల్లాల వద్దకు పంపించడంలో విఫలం కావడంతో రైతులు విలవిలలాడిపోతున్నారు. జిల్లాల కలెక్టర్లు ఈ విషయమై లారీ యజమానులకు అధికారులకు ఎన్నిసార్లు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, హెచ్చరికలు చేసిన ధాన్యం మిల్లులకు చేరకపోతుండడం గమనార్హం. ఈ నేపథ్యంలో ధాన్యం తరలించడంలో లోపం ఎక్కడుందో అధికారులు గుర్తించడం లేదని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. నెల రోజులకు పైగా తూకం, లోడింగ్‌లో అంతులేని జాప్యం నెలకొంటుండడంతో అధికారులు, మిల్లర్ల వైఖరికి నిరసనగా రైతులు రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితులు ఇప్పుడు రాష్ట్రంలో నెలకొన్నాయి. మండుటెండలో రోడ్డుపైన బైఠాయించి మరీ తమ ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేయాలని, తూకం వేసిన వెంటనే మిల్లులకు చేరవేయాలని రోడ్లపై బైఠాయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతులు ఎన్నో ఇబ్బందుల్లో ఉన్నా ఆయా జిల్లాల అధికార ఘనం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవారం, పది రోజుల్లో తొలకరి వర్షాలు కురుస్తాయని, అప్పటికీ ధాన్యం కొనుగోళ్లు పూర్తికాకపోతే కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యంతడిసి ముద్దవుతుందన్న ఆందోళన రైతులను వెంటాడుతోంది. ధాన్యం రైతుల మాదిరిగానే చేతికొచ్చిన పంటను అమ్ముకోవడానికి మక్క (మొక్కజొన్న) రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఆరుగాలం చెమటోడ్చి పండించిన పంటను మార్కెట్ యార్డులకు తీసుకొచ్చి నెల రోజులు గడుస్తున్నా కొనుగోళ్లు ముందుకు సాగకపోవడంతో రైతాంగం తీవ్ర ఆందోళనలో కూరుకుపోయింది. ప్రస్తుతం రాష్ట్రంలోని పలు ప్రధాన మార్కెట్ యార్డులన్నీ మక్కల కుప్పలతో నిండిపోయాయి. మక్క పంటనుతూకం (కాంటా) వేసే నాథుడే కరువయ్యాడని, గన్నీ బ్యాగుల కొరత మరో వైపు వేధిస్తోందని రైతులు వాపోతున్నారు. ఇక తూకం వేసిన మక్క బస్తాలను తరలించడానికి లారీలు రాకపోవడం కొనుగోళ్లకు శాపంగా మారింది. దీనికి తోడు హమాలీల కొరత కూడా తోడవడంతో కొనుగోళ్ల ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. బస్తాలు నింపి రోజులు గడుస్తున్నా లారీలు రాకపోవడంతో మార్కెట్లోనే పడిగాపులు కాయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం మొక్కజొన్నకు క్వింటాలుకు రూ. 2,400 మద్దతు ధర ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయి నిబంధనలు రైతులకు శాపంగా మారాయి. ఎకరాకు కేవలం 25 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయాలనే నిబంధన పెట్టడంతో, అంతకంటే ఎక్కువ పండినపంటను ఏం చేయాలో తెలియక రైతులు తలలు పట్టుకుంటున్నారు. మిగిలిన పంటను అమ్ముకోవడానికి మార్క్‌ఫెడ్ అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఈ తిప్పలు పడలేక కొందరు రైతులు తక్కువ ధరకైనా సరే ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుని నష్టపోతున్నారు.కాగా.. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయని ప్రభుత్వవర్గాలు చెబుతున్నాయి.
ఇందులో 94 శాతం (దాదాపు 49 లక్షల మెట్రిక్ టన్నులు) అప్పటికప్పుడే మిల్లులకు తరలించామని అధికారులు చెబుతున్నారు. గడిచిన నాలుగు రోజుల్లోనే రికార్డు స్థాయిలో 18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని చెబుతున్నారు. కొనుగోలు చేసిన ధాన్యం తాలూకు రైతుల ఖాతాల్లోకి రూ. 8,414 కోట్లు జమ చేసినట్లు పౌరసరఫరాలశాఖ చెబుతోంది. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించడానికి జిల్లాల్లో కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీలు పనిచేస్తున్నాయి. ధాన్యం కాంటా పెట్టడం, వెంటనే మిల్లులకు తరలించడం, ఆ వెంటనే ఆన్‌లైన్ ఎంట్రీ పూర్తి చేసి రైతుల ఖాతాల్లోకి డబ్బులు వేస్తున్నారు. ఇప్పటివరకు దాదాపు 7 లక్షల మంది రైతులకు రూ. 8,414 కోట్ల రూపాయలను ప్రభుత్వం నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేసింది. కొనుగోళ్ల కోసం 14 వేలకు పైగా వాహనాలు, 84 వేల మందికి పైగా హమాలీలను రంగంలోకి దించారు.

## ఖాతాల్లోకి పెన్షన్లు

>> లేదని అధికారులను హెచ్చరించారు. స్వంత ఆదాయంపై గ్రామపంచాయతీ స్వతంత్రతను నిర్వీర్యం చేస్తూ గత ప్రభుత్వం తొలగించిన నిబంధనను పునరుద్ధరించేందుకు అంగీకారం తెలిపారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం, 2018 లోని సెక్షన్ 70(3) ప్రతిపాదిత సవరణ ప్రకారం గ్రామ పంచాయతీ స్వంత ఆదాయాన్ని (ఓన్ సోర్సెస్ రెవెన్యూ) ట్రెజరీ ఖాతాలో కాకుండా బ్యాంకు ఖాతాలో జమ చేసే విధంగా సవరణ చేయాలని ఆదేశించారు. సిఎం వద్ద జరిగిన సమీక్షలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, సిఎం సెక్రటరీ మాణిక్‌రాజ్, పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్, కమిషనర్ డి.దవ్య ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 99 రోజుల ప్రణాళిక సక్సెస్

>> విక్రమార్క అధ్యక్షతన ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలతో కూడిన కేబినెట్ సబ్ కమిటి సమావేశం జరిగింది. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో ఇప్పటివరకు నిర్వహించిన ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల ప్రగతి అద్భుతంగా జరిగినట్లు పేర్కొంది. రాబోయే రోజుల్లో ప్రజా భాగస్వామ్యంతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. ఇందులో భాగంగా జూన్ 02 నుండి 12 వరకు ముఖ్యంగా పర్యావరణ వారోత్సవం, రోడ్డు భద్రత, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారం, మహిళాశిశు రక్షణ, గృహ నిర్మాణం, పర్యాటక ప్రోత్సాహం, పట్టణాభివృద్ధి, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను నిర్వహించాలని నిర్దేశం చేసింది. ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా, అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని మంత్రులు స్పష్టం చేశారు. అలాగే రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత కల్పించడమే ధ్యేయంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అర్హులైన ప్రతి ఒక్కరికీ వర్తింపజేయాలన్నదే సర్కార్ సంకల్పమని తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇల్లు కవర్ అయ్యేలా సమగ్ర గృహ స్థాయి డేటా సేకరణ జరపాలని, ఒకవేళ ఎవరైనా మిగిలిపోతే వారి కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించింది. ఈ పథకం ప్రయోజనాలు ప్రజల్లోకి తీసుకెళ్లేలా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపింది. అలాగే ఈ బీమా పథకానికి ఒక విశిష్టమైన లోగోను రూపకల్పన చేసి, సర్వే పూర్తయిన ప్రతి ఇంటికి ఈ వీటిని అతికించాలని పేర్కొంది. ఈ మేరకు అన్ని శాఖలు తమ సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిజిపి సి.వి ఆనంద్, స్పెషల్ చీఫ్ సెక్రటరీలు జయేష్ రంజన్, వికాస్ రాజు, నవీన్ మిత్తల్, వాణి ప్రసాద్, దాన కిషోర్, ప్రిన్సిపల్ సెక్రటరీలు సందీప్ కుమార్ సుల్తానీయా, గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో టెస్లా సంస్థ విస్తరణ

### రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో టెస్లా సంస్థ విస్తరణ ఐకు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా విస్తరణ ప్రణాళికల నేపథ్యంలో టెస్లా ఇండియా ప్రతినిధులు మంగళవారం రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్‌ని మినిస్టర్ క్వార్టర్స్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సమావేశంలో టెస్లా ఇండియా జనరల్ మేనేజర్ శరద్ అగర్వాల్, పబ్లిక్ పాలసీ అండ్ బిజినెస్ డెవలప్‌మెంట్ విభాగానికి చెందిన రజత్ పాల్గొన్నారు. సమావేశంలో టెస్లా సంస్థ అమలు చేస్తున్న డైరెక్ట్ టు కన్స్యూమర్ విధానం, సేల్స్, సర్వీస్, డెలివరీ కేంద్రాలు, సూపర్‌చార్జర్ మౌలిక వసతులు, తెలంగాణలో పూర్తి ఈవీ ఎకోసిస్టమ్ అభివృద్ధిపై చర్చించారు. రాష్ట్రంలో సుస్థిర రవాణా వ్యవస్థ బలోపేతానికి, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగ విస్తరణకు ఈ చర్యలు దోహదపడనున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## ప్రస్తుత పరిస్థితుల్లో సాయుధ పోరాటం కష్టం

### పార్టీ అనుమతితోనే లొంగుబాటు

### మావోయిస్టు అగ్రనేత నరహరి వెల్లడి

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** ప్రస్తుత పరిస్థితుల్లో సాయుధ పోరాటం చాలా కష్టమైనదని మావోయిస్టు పార్టీ బీహార్, జార్ఖండ్ ప్రత్యేక ప్రాంతీయ కమిటీ కార్యదర్శి పసునూరి నరహరి అలియాస్ విశ్వనాథ్ అలియాస్ సరళైదా అన్నారు. ఓవైపు నిర్బంధం మరోవైపు అగచాట్ల మధ్య పోరాటం చేయడం కష్టంగా మారిందని ఆయన తెలిపారు. మంగళవారం నాడు ఆయన తన సతీమణి బీహార్ ఝార్ఖండ్ ప్రత్యేక ప్రాంతీయ కమిటీ సభ్యురాలు దానమ్మ అలియాస్ పూనం, ఊరఫ్ రోజాతో కలిసి డిజిపి ఆనంద్ ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా నరహరి మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ సహ అనేక రాష్ట్రాల్లో సాయుధ పోరాటం పరంగా అనేక నష్టాలను చేకూర్చామని, తాము కూడా అనేక కష్టాలను చవిచూశామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కల్పించిన అవకాశాల కారణంగా తాను తన సతీమణితో కలిసి ప్రజాజీవితంలోకి వచ్చానని తెలిపారు. తన లొంగుబాటు గురించి ఝార్ఖండ్‌లో మావోయిస్టు పార్టీ బ్యూరో సభ్యుడు మిసిరి బెస్రాకు సమాచారం అందించానని, ఆయన అనుమతితోనే జనజీవన స్రవంతిలో కలుస్తున్నానని నరహరి తెలిపారు. సాయుధ పోరాటంలో చోటు చేసుకున్న ఇబ్బందులను దృష్టిలో వుంచుకుని ప్రజా జీవితంలోకి రావాలని పార్టీ అగ్రనేత గణపతిని కోరుతున్నానని నరహరి మీడియా సాక్షిగా వెల్లడించారు. తనతోపాటు తన సతీమణి లొంగుబాటుకు సహకరించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిజిపి ఆనంద్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.




సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

## నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో సాగునీటి రంగానికి ప్రాధాన్యత

### భూసేకరణ పనులను వారంలో పూర్తి చేయాలి: మంత్రి జూపల్లి కృష్ణారావు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 26 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో సాగునీటి రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. పాలమూరు- రంగారెడ్డి, వటేం 8వ ప్యాకేజ్ గెస్ట్ హౌస్‌లో నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో కొనసాగుతున్న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల కేఎల్ఐ, డిండి, ఉమామహేశ్వరం బాలెన్సింగ్ రిజర్వాయర్, అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్, మార్కండేయ రిజర్వాయర్, కర్ణేతాండ్రా బాలెన్సింగ్ రిజర్వాయర్‌లతో పాటు వివిధ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు, భూ సేకరణ పనుల పురోగతిపై మంత్రి జూపల్లి కృష్ణారావు సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో ప్రాజెక్టుల వారీగా జరుగుతున్న పనులు, భూ సేకరణ పురోగతిని అధికారులు మంత్రికి వివరించారు. ముఖ్యంగా కాలువల నిర్మాణం, రిజర్వాయర్ల అనుబంధ పనులు, పంప్‌హౌస్‌ల ఏర్పాటు, విద్యుత్ కనెక్షన్ల కల్పన వంటి అంశాలపై చర్చించారు. ఇంకా భూ సేకరణలో పెండింగ్‌లో ఉన్న కేసులు, రైతులకు చెల్లించాల్సిన పరిహారం వంటి అంశాలను కూడా మంత్రి సమీక్షించారు. ప్రాజెక్టుల పనులు ఆలస్యం కాకుండా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు.

## ఉచిత విద్యుత్, స్మార్ట్ మీటర్లు కొనసాగుతాయి

### అపోహలు, గందరగోళానికి గురికావద్దన్న ప్రభుత్వం

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** ప్రతిపక్షాలు ఎంతగా గగ్గోలు పెడుతున్నప్పటికీ రాష్ట్రంలో ఉచిత విద్యుత్, స్మార్ట్ మీటర్ల ప్రక్రియ కొనసాగుతుందని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందులో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అనేది రాష్ట్ర స్థాయి సబ్సిడీ అని, వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌తో సహా సంక్షేమ పథకాలను కొనసాగించడం ప్రభుత్వ విచక్షణాధికారం అని రాష్ట్ర సర్కార్ తేల్చిచెప్పింది. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో స్మార్ట్ మీటర్లు అమర్చినా, అమర్చకపోయినా ఈ రెండు పథకాలు కొనసాగుతాయని గట్టిగా చెబుతూ, రెండింటినీ కలిపి అనవసర గందరగోళం సృష్టిస్తామన్న వారి వాదనను తోసిపుచ్చింది. స్కామ్‌లకు పాల్పడి, భారీ నష్టాలతో పనిచేస్తే, అధిక టారిఫ్‌లు, నాసిరకమైన సేవల రూపంలో ఆ భారం చివరికి వినియోగదారులపై పడుతుందని తెలిపింది. అయితే తమ ప్రభుత్వం అటువంటి వాటికి అవకాశం ఇవ్వకుండా ఉచిత, నాణ్యమైన, నిరంతరాయంగా సరఫరా చేసేందుకే ప్రాధాన్యతనిస్తున్నట్లు వెల్లడించింది. క్వాలిటీ విద్యుత్ సరఫరాను అందించడానికి రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు ఆర్థికంగా పటిష్టంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని వివరించిది. అందుకే విద్యుత్ వినియోగంపై కచ్చితమైన డేటాను సేకరించడం, కచ్చితమైన బిల్లింగ్‌ను నిర్ధారించడం, పారదర్శకతను పాటించడం వంటి వాటి కోసం స్మార్ట్ మీటర్లు విద్యుత్ రంగంలో అవసరమైన సంస్కరణలని రాష్ట్ర ప్రభుత్వం నొక్కి చెబుతోంది. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు విషయంలో ప్రతిపక్ష నాయకుల విమ్మలకు సమాధానమిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, 2017 జనవరి 4న కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖతో ఉదయ్ ఒప్పందం కుదిరిందని ప్రభుత్వం తెలపింది. బీఆర్ఎస్ అధికారంలో అజయ్ మిశ్రా ఇంధన కార్యదర్శిగా ఉన్నప్పుడు డిస్కాంలు ఈ త్రైపాక్షిక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయని పేర్కొంది. కాగా పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్ మీటరింగ్ కోసం కూడా మీటరింగ్ లక్ష్యాలను 2017 ఒప్పందం ప్రకారమే నిర్దేశించారని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఆ ఒప్పందంలోనే స్మార్ట్ మీటర్ల గడువులను కూడా నిర్దేశించారని చెప్పారు. దీని ప్రకారం, నెలకు 500 యూనిట్లకు పైగా వినియోగించే వినియోగదారులకు డిసెంబర్ 31, 2018 నాటికి, 200 యూనిట్లకు పైగా వినియోగించే వారికి డిసెంబర్ 31, 2019 నాటికి స్మార్ట్ మీటర్లను అమర్చాల్సి ఉందని పేర్కొంది. ఈ గడువులను పాటించనప్పటికీ, అవి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అంగీకరించినవే తప్ప, ప్రస్తుత ప్రభుత్వం విధించిన కొత్త షరతులు కావని విద్యుత్ శాఖ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

# కృష్ణా నదిపై కొత్త బ్యారేజీ

### తెలంగాణ-కర్ణాటక సరిహద్దుల్లో నిర్మాణం

### రూ.500 కోట్లతో ఉమ్మడి ప్రాజెక్ట్‌కు కసరత్తు

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** తెలంగాణ-కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుల్లో కృష్ణా నదిపై భారీ ప్రాజెక్టుకు అడుగులు పడుతున్నాయి. జూరాల ప్రాజెక్టుకు ఎగువన, ఇరు రాష్ట్రాలకు ఉపయోగపడేలా ఒక సరికొత్త బ్యారేజీ కమ్ బ్రిడ్జ్ (వంతెనతో కూడిన బ్యారేజీ) నిర్మించాలని ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు యోచిస్తున్నాయి. తెలంగాణలోని నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గ పరిధిలోని కొల్లాపూర్, కర్ణాటకలోని రాయచూర్ జిల్లా కోర్తకుంట గ్రామాల మధ్య ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఈ బ్యారేజీ నిర్మాణానికి దాదాపు రూ.500 కోట్లు ఖర్చవుతుందని సాగునీటి రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు.

ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 2 టీఎంసీల నీటిని నిల్వ చేయవచ్చని తెలుస్తోంది. ఈ బ్యారేజీ అందుబాటులోకి వస్తే మక్తల్ నియోజకవర్గంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో తాగునీరు, సాగునీటి ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉంది.

ఈ బ్యారేజీ కేవలం నీటిని నిల్వ చేసే బ్యారేజీ మాత్రమే కాకుండా వంతెనను కూడా నిర్మించనున్నారు. దాంతో తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మధ్య రవాణా వ్యవస్థ మరింత సులువు కానుంది. ప్రస్తుతం ఇరు రాష్ట్రాల సరిహద్దు దాటడానికి పడుతున్న ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోవడమే కాకుండా ప్రయాణ సమయం కూడా చాలా వరకు కలిసివస్తుంది. ఈ ప్రతిపాదిత ప్రాజెక్టుపై తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కర్ణాటక నీటిపారుదలశాఖ మంత్రి బోసరాజు ఇప్పటికే ప్రత్యేకంగా భేటీ అయి ప్రాథమిక చర్చలు జరిపారు. ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఇరు రాష్ట్రాల ఇంజనీర్లతో కూడిన జాయింట్ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ ఉమ్మడి కమిటీ ఇచ్చే సాంకేతిక నివేదిక ఆధారంగా ప్రాజెక్టుపై ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు త్వరలోనే ఒక తుది నిర్ణయానికి రానున్నాయి.

# ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను తక్షణమే అమలుచేయాలి

### లంబాడాలను అన్ని విధాలుగా మోసం చేసిన పార్టీ కాంగ్రెస్

### మహాధర్నాలో మాజీమంత్రి హరీశ్‌రావు




లంబాడాల హక్కుల పోరాట సమితి మహాధర్నాలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్ (ధర్నాచౌక్), మే 26, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను తక్షణమే అమలుచేయాలని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో లంబాడాల హక్కుల పోరాట సమితి, రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముడావత్ రాంబాల్ నాయక్ అధ్యక్షతన చలో హైదరాబాద్ పేరుతో జరిగిన మహాధర్నా కార్యక్రమానికి హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ రాకముందు కాంగ్రెస్ హయాంలో లంబాడాల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో తండాలను పంచాయతీలుగా చేయాలని అనేక పోరాటాలు చేశారని, అయినప్పటికీ, కాంగ్రెస్ పార్టీ స్పందించలేదని ఆయన గుర్తు చేశారు. టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత 3,100 తండాలను పంచాయతీలుగా మార్చి, ఎస్టీలకు రాజకీయవాటా కల్పించిన ఘనత కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ హయాంలో అన్ని సంక్షేమ పథకాలు అమలుచేశామని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత లంబాడాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

చేవెళ్ల డిక్లరేషన్‌లో చెప్పిన ఏ ఒక్క హామీ కూడా అమలుచేయకపోగా, 50వేల ఎకరాల ఎస్సీ, ఎస్టీ భూములను గుంజుకున్న ఘనత ఈ ప్రభుత్వానికే దక్కు తుందని ధ్వజమెత్తారు. పోడు భూములకు పట్టాలిస్తామని చెప్పి ఒక్క పట్టా కూడా ఇవ్వ లేదని, ఎస్సీ ఎస్టీ బ్యాక్‌లాక్ పోస్టులు భర్తీ చేస్తామని ఒక్క పోస్ట్ భర్తీ చేయలేదని, కళ్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం పేరుతో ఆడబిడ్డలను మోసం చేశారని ఆరోపించారు. ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ ప్రకటించింది ఖర్గేగారే కాబట్టి దానిని అమలుచేయించే బాధ్యత కూడా ఆయనదేనని, లేదంటే నాలుగు రైళ్లల్లో ఢిల్లీకి వచ్చి, ఖర్గే ఇంటిముందే ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఎస్సీ ఎస్టీలను అన్ని విధాలుగా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని త్వరలో రాజకీయ సమాధి చేయటం ఖాయమని హెచ్చరించారు. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ ఎస్టీల అభివృద్ధి కేసీఆర్ పాలనలోనే జరిగిందని, మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్‌ను నమ్మి, ఓట్లు వేస్తే, అన్ని రకాలుగా మోసం చేసిందని ఆరోపించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, సుదర్శన్‌రెడ్డి, ఎస్టీ కార్పోరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, నగేష్ ముదిరాజ్, బాల్‌రాజ్‌యాదవ్, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పైలట్ రోహిత్‌రెడ్డి డ్రగ్స్ కేసులో కీలక పరిణామం

### డ్రగ్స్ పెడ్లర్లు రాకేశ్‌వర్మ, అభిషేక్‌సింగ్‌ను విచారించిన సిట్.. పరారైన క్లింటన్ కోసం గాలింపు

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన బిఆర్ఎస్ మాజీ ఎంఎల్ఎ పైలట్ రోహిత్ రెడ్డి డ్రగ్స్ పార్టీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో పరారీలో వుండి కోర్టు నుంచి అరెస్టు కాకుండా ఊరట పొందిన డ్రగ్స్ పెడ్లర్లు రాకేష్ వర్మ, అభిషేక్ సింగ్‌లను సిట్ అధికారులు తాజాగా విచారించి వారి నుంచి డ్రగ్స్ పార్టీకి సంబంధించి కీలక సమాచారం సేకరించారు. మరోవైపు ఈ కేసులో రెండు నెలలకు పైగా పరారీలో వున్న మరో స్మగ్లర్ క్లింటన్ కోసం గాలింపు కొనసాగుతోంది. గత మార్చి నెల 14వ తేదీన శివార్లలోని మొయినాబాద్ మండలం అజీజ్ నగర్‌లో గల రోహిత్ రెడ్డి ఫాం హౌస్‌లో వెలుగు చూసిన డ్రగ్స్ పార్టీ తెలంగాణతో పాటు ఎపిలోనూ సంచలనం రేపింది. ఈ కేసులో రోహిత్ రెడ్డితో పాటు అతని సోదరుడు రితేష్ రెడ్డి, ఢిల్లీ రియల్టర్ నమిత్ శర్మ, ఏలూరు ఎంపి పుట్టా మహేష్ యాదవ్ సహా 11 మంది వుండగా ఈగల్ పోలీసులు ఈ పార్టీని రట్టు చేయడం తెలిసిందే. సందర్భంగా రోహిత్ రెడ్డితో పాటు అతని సోదరుడు రితేష్ రెడ్డి, ఢిల్లీ రియల్టర్ నమిత్ శర్మ, ఏలూరు ఎంపి పుట్టా మహేష్ యాదవ్ సహా తొమ్మిది మంది డ్రగ్స్ సేవించి పట్టుబడడం విదితమే.

ఇదే సమయంలో పోలీసులపై కాల్పులు జరిపినందుకు రోహిత్ రెడ్డితో పాటు అతని సోదరుడు రితేష్ రెడ్డి, ఢిల్లీ రియల్టర్ నమిత్ శర్మలను పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. రితేష్ రెడ్డికి చెందిన లైసెన్స్ రివాల్వర్‌ను రియల్టర్ నమిత్ శర్మ తీసుకుని రోహిత్ రెడ్డి ఆదేశాల మేరకు కాల్పులు జరిపాడని తేలగా ఇందుకుగానూ ముగ్గురు అరెస్టయ్యారు. డ్రగ్స్ సేవించిన మిగతా ఆరుగురు స్టేషన్ బెయిల్‌పై విడుదల య్యారు. ఈ కేసు విచారణకు సర్కారు చేవెళ్ల డిసిపి యోగేష్ గౌతం నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేయగా ఇందులో భాగంగా రోహిత్ రెడ్డి సహా అతని సోదరుడు రితేష్ రెడ్డి, నమిత్ శర్మలను విచారించారు. ఇందులో కొందరు డ్రగ్స్ స్మగ్లర్లు పరారీలో వున్నారు. వీరిలో రాకేష్ వర్మ, అభిషేక్ సింగ్‌లు హైకోర్టు నుంచి ఊరట పొంది సిట్ ఎదుట హాజరై డ్రగ్స్ పార్టీకి సంబంధించి వివరాలు అందించారు.

తాము ఎక్కడ నుంచి కొకైన్ కొనుగోలు చేసింది...? ఎవరికి ఇచ్చింది...? అనే వివరాలను వారు సిట్‌కు అందించారు. కాగా ఇదే కేసులో గోవాకు చెందిన క్లింటన్ అనే మరో స్మగ్లర్ పరారీలో వున్నాడు. ఇతను డ్రగ్స్ పార్టీలో ఎండిఎంఎ సరఫరా చేసినట్లు తేలింది.

# విద్యుత్ సంస్థల్లో పోస్టుల భర్తీకి సుప్రీం నో

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** తెలంగాణలోని వివిధ విద్యుత్ సంస్థలలో ఇంజనీర్ల నియామకం కోసం రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కో జారీ చేసిన నోటిఫికేషన్‌ను సుప్రీం కోర్టు సమర్థించింది. జెన్కో జారీ చేసిన నోటిఫికేషన్‌లో భాగంగా భర్తీ చేయకుండా మిగిలిపోయిన 42 సహాయ విద్యుత్ ఇంజనీర్ (ఏఈ) పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ కొందరు అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ అంశంపై విచారణ జరిపిన అనంతరం, జస్టిస్ పంకజ్ మిథాల్ మరియు జస్టిస్ ఓజువి భాటిలతో కూడిన ధర్మాసనం తన తీర్పును వెల్లడించింది. కాగా 2015 సెప్టెంబర్ 23న, రాష్ట్రంలోని వివిధ విద్యుత్ ఉత్పత్తి సంస్థలలో 856 సహాయ ఇంజనీర్ పోస్టుల భర్తీకి జెన్కో ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. అందుకు గాను నవంబర్ 14న అర్హత పరీక్షను నిర్వహించింది. ఆ తర్వాత, 2016 ఫిబ్రవరి 17న, 690 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు జారీ చేసింది. మిగిలిన పోస్టులను మెరిట్ జాబితా ఆధారంగా భర్తీ చేస్తామని అప్పట్లో పేర్కొన్నారు.

2017లో, నియామకాల రెండవ దశలో భాగంగా, 73 మంది అభ్యర్థులు నియమితులయ్యారు. అయితే, నోటిఫికేషన్‌లో మొదట పేర్కొన్న సహాయ విద్యుత్ ఇంజనీర్ పోస్టులలో 42 పోస్టులు భర్తీ కాకుండా మిగిలిపోయాయి.

ఈ ఖాళీలను భర్తీ చేయాలని అర్హులైన అభ్యర్థులు జెన్కో యాజమాన్యాన్ని కోరారు. 2018లో తమ విజ్ఞప్తితో హైకోర్టును ఆశ్రయించగా, 2024 అక్టోబర్ 24న ఏకసభ్య ధర్మాసనం అభ్యర్థులకు అనుకూలంగా తీర్పు నిస్తూ, ఆ పోస్టులను భర్తీ చేయాలని ఆదేశించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ, ఈ అంశాన్ని డివిజన్ బెంచ్ ముందుకు తీసుకువెళ్లగా, అక్కడ కూడా తీర్పు మరోసారి అభ్యర్థులకే అనుకూలంగా వచ్చింది.

# ఎసిబి వలలో శామీర్‌పేట తహసీల్దార్ సుచరిత

### ఆమె డ్రైవర్‌కు రూ. 2 లక్షలు లంచం ఇస్తుండగా పట్టుబడిన వైనం

### భూమి నాలా కన్వర్షన్‌కు రూ.30లక్షలు డిమాండ్



ఎసిబి అధికారులకు పట్టుబడిన శామీర్‌పేట మండల తహసీల్దార్ సుచరిత, డ్రైవర్ నాగరాజు

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), మే 26, ప్రభాతవార్త:** శామీర్‌పేట మండల తహసీల్దార్ సుచరిత ఎసిబి అధికారులకు పట్టుబడ్డారు. మండల తహసీల్దార్ కార్యాలయం బయట కారు వద్ద ఉన్న ఆమె డ్రైవర్ నాగరాజుకు బాధితులు వచ్చి తహసీల్దార్ సుచరితకు ఇవ్వటానికి 2 లక్షల రూపాయలు లంచం ఇస్తుండగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. ఆ వెంటనే తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న తహసీల్దార్ సుచరిత వద్దకు డ్రైవర్‌ను, ఆ డబ్బులతో వెళ్లి పట్టుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఎసిబి అధికారులు విచ్చేసి తహసీల్దార్, డ్రైవర్ లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. నాలా కన్వర్షన్ కోసం తహసీల్దార్ 30లక్షల రూపాయలు డిమాండ్ చేయగా ముందుగా 2లక్షల రూపాయలు లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు పట్టుబడ్డారు. రంగారెడ్డి రేంజ్ ఎసిబి డిఎస్‌పి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ శామీర్‌పేట మండలంలోని అలియాబాద్‌కు చెందిన భూమి సుమారు 30ఎకరాలు నాలా కన్వర్షన్ కోసం తహసీల్దార్ కార్యాలయంలో ధరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయంలో నాలా కన్వర్షన్ చేయటానికి తహసీల్దార్ సుచరిత ఒక ఎకరాకు లక్ష రూపాయల చొప్పున లంచం 30లక్షల రూపాయలు నాలా కన్వర్షన్ చేయటానికి డిమాండ్ చేసినట్లు తెలిపారు. మండల కార్యాలయం వద్ద కారు డ్రైవర్ నాగరాజు ఉండగా తహసీల్దార్ సుచరితకు ఇవ్వటానికి బాధితులు 2లక్షల రూపాయలు ఆమె డ్రైవర్ నాగరాజుకు ఇస్తుండగా ఎసిబి అధికారులు నిఘా పెట్టి వలపన్ని పట్టుకోవటం జరిగిందన్నారు. ఎసిబి అధికారులు కార్యాలయంలో తహసీల్దార్ సుచరితను, డ్రైవర్ నాగరాజును అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. విచారణ పూర్తి తరువాత తహసీల్దార్ సుచరితను, డ్రైవర్ నాగరాజులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపనున్నట్లు సమాచారం. తహసీల్దార్ కార్యాలయంలో విచారణ కొనసాగించారు. ఎసిబి అధికారులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# యుఎస్ రీపర్ డ్రోన్ కూల్చివేసాం

### ఎఫ్-35 యుద్ధ విమానంపైనా దాడి చేసాం

### కాల్పులు విరమణ ఉల్లంఘిస్తే ప్రతీకారం తప్పదు: మొజ్తాబా హెచ్చరిక

**టెహ్రాన్, మే 26:** అమెరికాకు చెందిన ఎంక్యూ9 రీపర్ డ్రోన్‌ను కూల్చివేసినట్లు ఇరాన్ వెల్లడించింది. తమ గగనతలంలోకి ప్రవేశించిన అమెరికా ఆర్‌క్యూ4 డ్రోన్, ఎఫ్35 యుద్ధ విమానంపై కూడా కాల్పులు జరిపినట్లు తెలిపింది. టెహ్రాన్‌లోని పలు ప్రాంతాలపై అమెరికా తీవ్రమైన దాడులు చేసిన క్రమంలో వాటిని తిప్పికొట్టినట్లు పేర్కొన్నది. అమెరికా చేసే ఏ కాల్పుల విరమణ ఉల్లంఘనకైనా ప్రతీకారం తీర్చుకునే చట్టబద్ధమైన హక్కు తమకు ఉందని ఐఆర్‌జీసీ వెల్లడించింది. ట్రంప్ సైనిక చర్యను తిరిగి ప్రారంభిస్తే పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలు, సైనిక బలగాలపై మరిన్ని ఆశ్చర్యకరమైన దాడులు చేస్తామని హెచ్చరించింది. ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ అమెరికాకు తీవ్ర హెచ్చరికలు చేశారు. శాంతి ఒప్పందంపై చర్చలు జరుగుతుండగా అమెరికా దాడులు చేయడాన్ని ఏ మాత్రం సహించబోమని అన్నారు. దీనికి ప్రతీకారం తీర్చుకుంటామని, ఇకపై పశ్చిమాసియాలో అమెరికా బేస్‌లకు ఎక్కడా సురక్షిత ప్రదేశం ఉండదని హెచ్చరించారు. అమెరికా, ఇజ్రాయెల్‌లను నాశనం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. తన తండ్రి, ఇరాన్ సర్వోన్నత నాయకుడు అయతుల్లా ఖమేనీ మరణం తర్వాత కూడా తాము ఏమాత్రం వెనక్కి తగ్గకుండా దేశం కోసం పోరాడుతున్నామని పేర్కొన్నారు. ఇరాన్‌పై తాము ఉద్దేశపూర్వకంగా దాడి చేయలేదని, ఆత్మరక్షణ కోసమే దాడులు చేశామని అమెరికా అధికారులు పేర్కొన్నారు. సముద్రంలో మందుపాతరలు పరిచేందుకు యత్నిస్తున్న బోట్లను, ఇరాన్ క్షిపణి ప్రయోగ లాంచ్‌ప్యాడ్లను లక్ష్యంగా చేసుకొని దాడులు చేశామని తెలిపారు. తమ దాడిలో బందర్ అబ్బాస్ పోర్టులోని నేవీ బేస్ కూడా ధ్వంసమైనట్లు చెప్పారు.

## నగరాన్ని పంచుకుతింటున్న కాంగ్రెస్, బిఆర్ఎస్, మజ్లిస్ పార్టీలు

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ధ్వజం

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గతంలో పాలించిన బిఆర్ఎస్, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలు రెండూ కలిసి ఎంఐఎం (మజ్లిస్) పార్టీ కనుసన్నల్లో నడుస్తూ హైదరాబాద్ నగర ప్రజలను తీవ్రంగా మోసం చేస్తున్నాయని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కూకట్‌పల్లిలో మీడియాతో మాట్లాడిన ఆయన, నగరంలోని ప్రధాన సమస్యలను ప్రస్తావిస్తూ అటు కాంగ్రెస్, ఇటు బిఆర్ఎస్ పార్టీల తీరును ఎండగట్టారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో గరీబోళ్లను నిలువునా ముంచితే, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు అంటూ అదే తరహాలో ప్రజలను నమ్మించి వంచిస్తోందని మండిపడ్డారు.

గత ప్రభుత్వం కట్టిన కొన్ని అరకొర ఇళ్లనే ఇప్పుడు చూపించుకుంటూ కాలక్షేపం చేస్తున్నారన్నారు. నివేదికల పేరుతో కాలయాపన చేస్తూ, రెండు పార్టీలు కూడా హైదరాబాద్ నగరంలోని పేద ప్రజలకు తీవ్ర అన్యాయం చేశాయని ఆరోపించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిని విభజించి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తీసుకురావాలనే ఆలోచన కేవలం మజ్లిస్ పార్టీ ప్రయోజనాల కోసమేనని స్పష్టం చేశారు.

మూడు భాగాలుగా విడగొడితే తప్ప మజ్లిస్ గెలవలేని పరిస్థితి ఉందని, అందుకే వారికి జిహెచ్‌ఎంసిని అశాస్త్రీయంగా మూడు భాగాలుగా విభజించారని, అందులో ఒక భాగాన్ని దారాదత్తం చేయడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిద్ధమైందని విమర్శించారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి జిల్లాల విభజనలో ఒకే అసెంబ్లీ నియోజకవర్గం మూడు జిల్లాల్లోకి పోయేలా గందరగోళం సృష్టించారని, ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందన్నారు.

అధికారులను మ్యాప్ అడిగితే వారి వద్ద ఎలాంటి స్పష్టత లేదని, ఎక్కడ ఏ సరిహద్దు వస్తుందో తెలియకుండానే నగరాన్ని ముక్కలు చేయడానికి కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. నగరంలో తాగునీటి సరఫరా వ్యవస్థ పూర్తిగా పడకేసిందని రాంచందర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. రోహిణి కార్తె ముగుస్తున్నా, జూన్ 12న వానాకాలం ముంచుకొస్తున్నా ప్రభుత్వం ఇప్పటివరకు నీటి ఎద్దడిని నివారించలేకపోయిందన్నారు. మూడు, నాలుగు రోజులకు ఒకసారి కూడా నీళ్లు రాక ప్రజలు ట్యాంకర్లపై ఆధారపడుతున్నారని, జలమండలి తీవ్రంగా వైఫల్యం చెందిందని విమర్శించారు.

## డిజిపిని కలిసిన ప్రొఫెసర్ నాగేశ్వర్

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** మాజీ ఎంఎల్‌సి, రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ నాగేశ్వర్ మంగళవారం సాయంత్రం డిజిపి సి.వి ఆనంద్‌ను కలిశారు. సామాజిక మాధ్యమాల్లో తనపై జరుగుతున్న దుష్ప్రచారంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన డిజిపిని కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలను మరుసటి రోజే ఉపసంహరించున్నానని తెలిపారు. అయినా కూడా తనపై ట్రోలింగ్ జరగడం బాధాకరమని ఆయన వాపోయారు. ఇందుకు గానూ తనపై ఎపిలో నమోదైన కేసులకు సంబంధించి అక్కడి పోలీసుల నుంచి ఎలాంటి నోటీసులు అందలేదని ఆయన తెలిపారు. మరో వైపు పవన్ కల్యాణ్‌పై చేసిన వ్యాఖ్యల కారణంగా నాగేశ్వర్‌పై ఎపిలో నమోదైన కేసులకు సంబంధించి ఆయనను అరెస్టు చేసేందుకు అక్కడి పోలీసులు మంగళవారం ఉదయం హైదరాబాద్‌కు వచ్చారని వార్తలు చక్కర్లు కొట్టాయి. దీంతో ఆయన నివాసం వద్ద ఉద్రిక్తలు చోటుచేసుకున్నాయి. అయితే ఇదంతా అబద్ధమని ఎపి సర్కారు ఖండించడంతో పరిస్థితులు సద్దుమణిగాయి.


**హీరో హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్**

HeroHousing Finance

సంప్రదించు చిరునామా: 3-1-364, అంబేద్కర్ రోడ్, క్రిస్టియన్ కాలనీ, ICICI బ్యాంక్ ఎదురుగా, కోర్టు సర్కిల్ వద్ద, కరీంనగర్, తెలంగాణ-505002.
రిజిస్టర్డ్ ఆఫీస్: 09, కమ్యూనిటీ సెంటర్, బసంత్ లోక్, వసంత్ విహార్, న్యూఢిల్లీ-110057,
ఫోన్: 011 49267000, టోల్ ఫ్రీ నం: 1800 212 8800, ఇ-మెయిల్: customer.care@herohfl.com
వెబ్‌సైట్: www.herohousingfinance.com | CIN: U65192DL2016PLC30148

**స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)**

(సెక్యూరిటీ ఇంట్రస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 యొక్క నిబంధన 8 (1)తో చదువబడే అనుబంధం-IV ప్రకారం)

ఇది ఇలా ఉండగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ చట్టం, 2002 మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు 2002 యొక్క నిబంధన 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించబడిన అధికారాలను వినియోగిస్తూ హీరో హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి అయిన క్రింది సంతకందారుడు రుణగ్రహీతలను రుణ బాకీ సొమ్మును సదరు నోటీస్ యొక్క తేదీ నుండి 60 రోజులలో తిరిగి చెల్లించవలసినదిగా పిలుపునిస్తూ డిమాండ్ నోటీసు జారీ చేసారు.

సెక్యూర్డ్ ఆస్తులు తిరిగి పొందడానికి లభ్యమయ్యే సమయానికి సంబంధించి చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) యొక్క ఏర్పాట్లను రుణగ్రహీత దృష్టికి తీసుకురావడమైనది.

| రుణ ఖాతా నం. | అప్పుదార్(లు) యొక్క పేరు/చట్టవారసుడు(లు) చట్టప్రతినిధి(లు) | డిమాండ్ నోటీస్ తేదీ/ డిమాండ్ నోటీస్ ప్రకారం మొత్తం | స్వాధీనం యొక్క తేదీ (నిర్మాణాత్మకం/ భౌతికం) |
|---|---|---|---|
| UGKARMS 0000020723 | శ్రీనివాస కిరాణం మరియు జనరల్ స్టోర్స్ మరియు మిని sbi సర్వీస్ పాయింట్, రజిత ఇల్లందుల, శ్రీనివాస ఇల్లందుల, ఇల్లందుల కనుకువ్వ | 25-02-2026, రూ.8,60,983/- 16-ఫిబ్రవరి-2026 నాటికి బకాయి | 22.05.2026 (సింబాలిక్‌గా) |

తేది : 27.05.2026,
ప్రదేశం : సిద్దిపేట
సం/- అధీకృత అధికారి
హీరో హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరఫున

వార్త

జీవితంలో విజయం సాధించడానికి మనిషికి తెలివితేటలు ఉండి అవకాశాలు వచ్చినంత మాత్రాన చాలదు. ఏకాగ్రత, లక్ష్యశుద్ధి అవసరం.

- సి.డబ్ల్యు. వెండైట్

# ఎబోలా చేరేదెటకో?

ప్రకృతిలో సమతుల్యత కోల్పోయినప్పుడు మాత్రమే సకల ప్రాణాంతక వ్యాధులు మానవాళిని పట్టి పీడిస్తాయి. ఇంతక్రితమే ఈ విషయాన్ని కోవిడ్ మహమ్మారి ప్రత్యక్ష నరకాన్ని చూపించి వెళ్ళింది. ఎన్నో ప్రాణాలను బలికొంది.అది మనకొక గుణపాఠం. ఇప్పుడు మళ్లీ కొన్ని కరోనా వేరియంట్లు,హంటా వైరస్,ఎబోలా.. ఇలా అన్నీ వరుసగా తన చక్రాన్నితిప్పి చూపిస్తున్నాయి. ఒక పక్క నుంచి 'ఎబోలా' అనే ప్రాణాంతక వైరస్ తరుముకొస్తుండగా మరోపక్క వాటి నుండి ఉపశమనం కోసం ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆపసోపాలు పడుతోంది. మొన్నటి కరోనా, నిన్నటి హంటా వైరస్, ప్రస్తుతం ఎబోలా వైరస్ ప్రజల్ని భయభ్రాంతులను చేసేందుకు వ్యాప్తి చెందినవేనని అక్షరాలా రుజువైంది. కరోనా అప్పుడూ ఉంది. వేరే వేరియంట్ రూపంలో ఇప్పుడూ ఉంది. ఎప్పుడూ ఉంటుందనే స్థాయికి జనాందోళనకు గురిచేస్తోంది. కరోనా ఉధృతికి చాలా ఎక్కువ మందే చనిపోయారు. కోవిడ్ దశలో కొందరైతే, అది తగ్గినయమై ఊపిరి పీల్చుకున్నాక మరో రూపంలో వచ్చి కాలసర్పమై కాటేసి వెళ్లిపోయింది. ఒకసారి కోవిడ్ సోకితే దాని వైరస్‌శరీరంలోనే ఉండిపోయి,మృత కోవిడ్ కణాలు సజీవమై జీవం పోసుకుంటాయి. దాని పర్యవసానంగా ఇతరత్రా అనారోగ్యాలు కలిగినప్పుడు నిద్రాణమై ఉన్న వైరస్ ప్రాణాంతకంగా పరిణమిస్తుంది. ఇవి చరిత్ర చెప్పే నిజాలు. ఇప్పుడు వెలుగుచూసిన 'ఎబోలా' ఇంత క్రితం చాలా సార్లు చుట్టం చూపుగా ప్రపంచ దేశాల్ని పలుకరించి వెళ్లిందే. తాజాగా కేవలం రెండు, మూడు దేశాల వరకూ పరిమితమైంది. కాగా ప్రపంచ పర్యాటకం బాగా వ్యాప్తి చెందిన తరుణంలో కాంగో, ఉగాండా, సూడాన్ దేశాలను దాటి ఎవరూ ఎక్కడికీ వెళ్లకుండా ఎబోలాకు కళ్లెం వేసేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఉన్నట్టుండి ఆరోగ్య ఎమర్జెన్సీ విధించింది. 'బండి బుగ్యో వైరస్' వేరియంట్ స్ట్రెయిన్ వల్లకలిగే ఈ వ్యాధిని ఎక్కడికక్కడ అంతం చేయాలని 'హూ' సంస్థ తలపెట్టింది. కానీ మాటలేకానీ నిధులిచ్చిన దాఖలాలు లేవు. ఇంతవరకు భారత్ లో అలాంటి వైరస్ వ్యాప్తి ఏదీ జరుగలేదు. కాస్సేపు హమ్మయ్య! అని ఊపిరి పీల్చుకున్నా ఎందుకైనా మంచిదన్న ఊహతో ఖండాంతర ఆరోగ్య భద్రతల రీత్యా ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిని విధించింది. అందుకే ఆ దేశాలనుంచి ఇతర దేశాలకు ఎవరినీ అనుమతించడం లేదు. ఇతర దేశాలనుంచి సూడాన్ దేశాలకు ఎవరినీ వెళ్లనివ్వడం లేదు. పూర్తి స్థాయి 'పర్యాటక నిషేధం' కొనసాగుతోంది. ఈ వ్యాధిని 'వైరల్ హేమరేజ్ జ్వరం'గా పేర్కొంటారు. ఎమర్జెన్సీ అంటూ హడావిడి చేసిన ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ వ్యాధి నివారణకు నిర్దిష్ట వైద్య పద్ధతులను నిర్దేశించినట్లు లేదు. ఎబోలా వైరస్‌ముఖ్యంగా ఆఫ్రికా దేశాలలో పలుమార్లు మహమ్మారిగా మారి ప్రజలను భయకంపితుల్ని చేస్తోంది. ఈ వైరస్‌కు వ్యాక్సిన్లు అందుబాటులోలేవు. కాంగో,ఉగాండా దేశాల్లో ఎబోలా వైరస్ వేగంగా వ్యాపిస్తోందన్న నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆదివారం అంతర్జాతీయ ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. ఇప్పటి వరకు 310 పైగా అనుమానిత కేసులు, 91 మరణాలు నమోదైనట్లు డబ్ల్యూహెచ్‌ఓ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనామ్ గెబ్రియేసస్ వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితి కొవిడ్ 19 లాంటి మహమ్మారి కాదని డబ్ల్యూహెచ్‌ఓ స్పష్టం చేసింది. అంతర్జాతీయ సరిహద్దులను మూసివేయాల్సిన అవసరం లేదనీ సూచించింది. ఈ అరుదైన వైరస్‌కు ఇప్పటివరకు ఎలాంటి చికిత్సలు లేదా వ్యాక్సిన్లు లేవు. కాంగో, ఉగాండాల్లో గతంలోనూ ఎబోలా వ్యాపించింది. అయితే కొత్తగా బుండిబుగ్యో వేరియంట్ వెలుగు చూడటం ఆందోళన కలిగిస్తోంది. ఇదే వేరియంట్ తొలిసారి 2007-2008లో ఉగాండాలో కనిపించింది. అప్పట్లో ఈ వైరస్ బారినపడి 37మంది ప్రాణాలు కోల్పోయారు. రెండోసారి 2012లో కాంగోలోని ఇసిరోలో 29 మంది మరణించారు.ఎబోలా వైరస్‌మొదటగా 1976లో ఆఫ్రికాలోని కాంగో ప్రాంతంలో గుర్తించారు. ఆ ప్రాంతంలో ప్రవహించే"ఎబోలా"నది పేరునే ఈ వైరస్‌కు పెట్టారు. ఈవైరస్ ప్రధానంగా అడవి జంతువుల నుంచి మనుషులకు వ్యాపిస్తుంది.ముఖ్యంగా గబ్బిలాలు, కోతులు వంటి జంతువులు దీని వాహకులుగా భావిస్తున్నారు. ఒకసారి మనుషుల్లోకి ప్రవేశించిన తర్వాత, రోగి రక్తం, శరీర ద్రవాలు,వస్తువుల ద్వారా ఇతరులకు వ్యాపిస్తుంది. ఆధునిక వైద్యశాస్త్రం ఎంత అభివృద్ధి చెందినా,ఎబోలా వంటి వైరస్‌లు మానవజాతికి ఇంకా సవాలుగానే ఉన్నాయి. ఎబోలా లక్షణాలు ప్రారంభంలో సాధారణ జ్వరంలా కనిపిస్తాయి. అధిక జ్వరం, తలనొప్పి,బలహీనత, కండరాల నొప్పులు మొదలవుతాయి. తర్వాత వాంతులు, విరేచనాలు, అంతర్గత రక్తస్రావం వంటి తీవ్ర లక్షణాలు కనిపిస్తాయి. చికిత్స ఆలస్యం అయితే మరణం సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ వైరస్ వ్యాప్తి చెందే వేగం.మరణాల శాతం ప్రపంచ ఆరోగ్య సంస్థలను అప్రమత్తం చేసింది. ఇది సాధారణ జ్వరంలా ప్రారంభమైనప్పటికీ,ఈవైరస్ చాలాత్వరగా, సులభంగా వ్యాపిస్తుంది. తీవ్రమైన రక్తస్రావం, అవయవాల వైఫల్యం, చివరకు మరణానికి దారితీసే ప్రమాదకర అంటువ్యాధి. దేశమంతా 'ఎబోలా' వైరస్‌పట్ల భయాందోళనలు చెందుతున్న దాని వ్యాప్తి నిరోధకతలో ఇంకా వెనుకడుగులో ఉన్నారు. కారణం కాంగో ప్రభుత్వానికి నిధుల కొరత, మెడికల్ ఎమర్జెన్సీకి నిధులు కేటాయించుకోకపోతే వచ్చే సమస్య ఎలా ఉంటుందో అదే పరిస్థితి ఇతర దేశాలకు ఎదురైతే ఎంత సతమతమవుతారో తెలుస్తుంది. అందుకే వ్యాధి నివారణ కన్నా నిరోధకత మేలు.



నీలో ఉన్న శక్తిని నీవు తెలుసుకున్నప్పుడే గమ్యం చేరగలవు. కనుక ముందు నీ గురించి నీవే పరిశోధించుకో.

రామకృష్ణ పరమహంస



మనిషికి మనసును మించిన మహాశత్రువు వేరొకరు లేరు. అందుకే మనస్సును జయిస్తే ప్రపంచాన్ని జయించవచ్చును.

గురునానక్

## ప్రజావాక్కు



### అంతరాయం లేని విద్యుత్ అందించాలి

ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా నిలిచిన ఆక్వా రంగాన్ని ఆదుకోవడం అత్యవసరంగా మారింది. దేశ విదేశీ మార్పిడి ఆదాయంలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ రంగం ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. అంతర్జాతీయ మార్కెట్లలో రొయ్యలు, చేపలధరలు పతనం కావడం, రవాణా ఖర్చులు విపరీతంగా పెరగడం వల్ల రైతులు కోట్లలో నష్టపోతున్నారు. విద్యుత్ రాయితీల కోత, నాణ్యమైన విద్యుత్ సరఫరా లేకపోవడం వల్ల నిర్వహణ ఖర్చులు మరింత పెరిగాయి. ఆక్వా ప్రాసెసింగ్ కంపెనీలు, మధ్యవర్తుల సిండికేట్‌వల్ల రైతులకు గిట్టుబాటుధర లభించడం లేదు. ఈ రంగాన్ని రక్షించడానికి ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలి. విద్యుత్ రాయితీలను పునరుద్ధరించి, అంతరాయం లేని విద్యుత్ అందించాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### కనీస వేతనాలు పెంచాలి

విద్యుత్ శాఖలో గత రెండు దశాబ్దాలుగా ఎందరో విద్యావంతులు ప్రభుత్వం తమను పర్మినెంట్ చేస్తుందనే ఆశతో మీటర్ రీడింగ్ పనులు చేస్తూ వున్నారు.వారికి ఇప్పటికీ ఎదుగూ బొదుగూ లేకుండా కేవలం నెలకి పది వేల రూపాయలే ఇస్తున్నారట. వారు రోజుకు 8గంటలు పైగా డ్యూటీలు చేస్తున్నారు. సెలవులుకూడా తక్కువ. పదివేల రూపాయలతో లక్ష రూపాయల జీతం పొందే పర్మినెంట్ ఉద్యోగితో సమానంగా ఫుల్ టైం డ్యూటీలు చేస్తున్నారు. పెరిగిపోతున్న ధరలు, ద్రవ్యోల్బణంతో పదివేల రూపాయలు సరిపోవు. మరోవైపు విద్యుత్ సంస్థ ఖాళీల్ని భర్తీ చేయకా, ప్రభుత్వాలేమో రిటైర్మెంట్‌కి డబ్బు లేదని రిటైర్మెంట్ వయసు పెంచుతుంటే పేద నిరుద్యోగులకి తీరని అన్యాయం జరిగి, వారిలో అసంతృప్తి పెరిగిపోతుంది.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

### చదువు అవసరం

స్వయం సహాయక సంఘాలలో ప్రతి మహిళా సభ్యులకు చదువు, అక్షరజ్ఞానం అవసరం. వేలి ముద్రలు నివారించాలి. ప్రతి నెల పొదుపులు జమ చేయడం బ్యాంక్‌లో వేయడం, పుస్తకాలు రాయడం, అప్పులు ఇవ్వడం చేయాలి. ఈ కార్యక్రమం నిర్వహణ చేయడం కోసం స్పెషల్ ఆఫీసర్‌లను నియమించడం అవసరం. మహిళా హక్కులకోసం తెలుసు కోవడం కోసం చదువు అవసరం.

- కదురు శ్రీనివాస్, వరంగల్

### లోకాయుక్తను నియమించండి

కొత్త లోకాయుక్తను నియమించేందుకు దరఖాస్తులు కోరడం, వాటిని పరిశీలించేందుకు ఒక కమిటీ ఏర్పాటు చేశారు. సంతోషం. ఇన్నాళ్లు పర్మినెంట్ లోకాయుక్త లేకుండా ఇంచార్జ్‌తోనే గడుపుతూ వచ్చింది ప్రభుత్వం. ఇప్పుడైనా త్వరగా తేల్చండి. ప్రజా సమస్యల మీద పూర్తి అవగాహన ఉండే వ్యక్తిని ఎన్నుకోండి. లోకాయుక్త కార్యాలయం విజయవాడలో రాష్ట్ర మధ్యలో ఉన్నది కాబట్టి అన్ని జిల్లాలవారికి అనుకూలంగా ఉంటుంది. గతంలో లోకాయుక్తగా సుభాషణ రెడ్డి ఉన్నపుడు కక్షిదారులు భయంలేకుండా లోకాయుక్త కోర్టులో సమాధానం చెప్పేవారు. ఆయన నవ్వుతూ అడిగే వారు. అలా ఉండాలి జడ్జి అన్నవారు. తరువాత పరిస్థితి మారిపోయింది.ఎందుకంటే లోకాయుక్తలో కేసు వేయాలంటే భయంగా ఉంటుంది. కనీసం ఈసారి వచ్చే లోకాయుక్త గారు అయినా అలా ఎక్కువగా వాయిదాలు వెయ్యకుండా త్వరగా తేల్చే విధంగా ఉండాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### రక్త సంబంధాలను కాపాడుదాం

నేడు సమాజంలో రక్త సంబంధాలు రోజురోజుకు కనుమరుగవుతున్నాయి. అన్నదమ్ముల మధ్యఆస్తి పంపకాల గొడవలు, అక్కదమ్ముల మధ్య డబ్బుల గొడవలు. ఆస్తి కోసం, డబ్బుల కోసం కనీసం మా అన్న, మా అక్క, మా చెల్లి, కదా అనే సంబంధ బాంధవ్యాలను దూరం చేసుకుంటున్న కుటుంబాలు ఎన్నో చూస్తున్నాం. మానవ సంబంధాలకంటే కూడా ఆస్తులకు, డబ్బులకు విలువనిస్తున్న సమాజం ఎటువైపు వెళుతుందనే ఆలోచన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### అధికార దాసులు

స్వాతంత్ర్యం కోసం దేశ నాయకులు పోరాటాలు చేస్తున్న కాలంలో ఒక సినిమా షూటింగ్ విరామ సమయంలో నాటి దేశ పరిస్థితుల గురించి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టాలని నాయకులు పడుతున్న కష్టాలు, పోరాటాల గురించి మాట్లాడుకుంటు సినిమాలకు స్వస్తి పలికి తాము కూడా స్వాతంత్ర్య పోరాటాల్లో పాలు పంచుకోవాలనే నిర్ణయానికి వచ్చారు. ఆ సినిమాలో నటిస్తున్న నటీ నటులు ఆ సమయంలో అక్కడే ఉన్న ఎన్టీఆర్ వారి మాటలను ఖండిస్తూ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చి పెట్టాలని దేశ నాయకులు ఎంతో మంది పోరాడుతున్నారు కదా!మనం కూడా ఎందుకు? ఎవరు చేసే పనులు వారు చేయాలి? లేకుంటే ఇబ్బంది పడతాం.

-శాస్త్రి, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# చమురు ఆవిర్లతో జనం ఉక్కిరిబిక్కిరి

*21శతాబ్దంలో ఆర్థిక సార్వభౌమాధికారం కోసం అగ్రాధిపత్యం వహించాలని అర్రులు చాస్తున్న దేశాధినేతలకు ఆశాభంగం కలగక మానదు. ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ముకుతాడు వేయటానికి ఆ దేశ నాయకులు రాజకీయ విభేదాలను మరిచిపోయి బహుముఖంగా ప్రయత్నాలు మొదలుపెట్టారు. చిన్న దేశం అభివృద్ధి పథంలో నడుస్తున్నదని తలపోసిన ఇజ్రాయెల్ దూరదృష్టి గల నాయకులు కరవవటంతో వెర్రిపోకడలు, ట్రంప్ అండ చూసుకొని వేస్తున్నది కానీ ఆటకట్టు ట్రంప్‌కూ నెతన్యాహుకూ ఒకేసారి సంభవించినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. తెగిందాకా గుంజటం ఇరాన్‌కు శ్రేయస్కరం కాదు. పరిస్థితుల పరిష్కారంతోపాటు విశాల దృక్పథంతో వ్యవహరిస్తే ప్రపంచ శాంతికి దోహదపడిన దేశంగా పేరు తెచ్చుకుంటుంది. రష్యా, చైనా, భారత్ దేశాల సంయమనంతో సరైన పరిష్కార మార్గాలు ప్రపంచ శాంతికి కనుగొనగలు గుతే సుస్థిరత సాధించగలం.*



రావులపాటి సీతారాం రావు

నాలుగోసారి పెట్రోలు, డీజిల్ ధరలు పెరిగిన తర్వాత అవాక్కయిన వాడకందారులు రాబోయే విపత్తును ఊహించటమే కాదు ప్రస్తుతం అనుభవిస్తూనే, కష్టకాలం ముందున్నది, బయటపడటం ఎలా అన్న ఆలోచనలో పడ్డారుగృహస్థులు. ముఖ్యంగా ఆడవారు గ్యాస్ లేకపోతే మళ్లీ కుంపట్ల, నిప్పుల పొయ్యిలతో గడపాల్సిందేనా అని తలలు పట్టుకుంటున్నారు. ఎలక్ట్రిక్ పరికరాలతో అవసరాలు తీర్చుకుందామంటే ఇప్పటికే కరెంట్ ధర ఉట్టికెక్కింది. అన్ని రకాల ఇబ్బందులకు కారణం అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ అని నానా మాటలు అంటున్నారు. అసలు దేశాల నాయకులు ఎందుకు ఇంత స్వార్థపూరితంగా వ్యవహరిస్తున్నారు అన్న ప్రశ్నకు జవాబు దొరకటం లేదు. పూర్వం హిట్లర్, ముస్సోలినీ లాంటి వాళ్లు నియంతలుగా మారి చివరకు పరాజితులుగా మిగిలిన సంగతి చరిత్ర పదే పదే గుర్తు చేస్తున్నా ఈ అధునాతన యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తమది చేసుకోవాలని ప్రతి దేశమూ అర్రులు చాస్తున్నా, అలాంటి ప్రయోజనకరమైన కార్యక్రమాలు తలపెట్టకుండా, యుద్ధాలు ముఖాముఖి తలపడి కురుక్షేత్రం లాంటి ప్రదేశంలో ప్రత్యక్షంగా చేయకుండా డ్రోనులతో ఆధునిక ఆయుధాలతో తలపడ్తున్న ఈ పిరికి నాయకులకు బుద్ధి చెప్పే రోజు రాకమానదు. ఎగరకు ఎగరకు కోడిపిల్లా ఎన్నాళ్లకైనా బిసిమిల్లా' అన్న సామెత ఈ మధ్య ఎవరో గుర్తు చేసి అంతిమంగా స్వార్థంతో అందర్నీ శాసించే నాయకులకు అదే గతి పడుతుందని చెప్తుంటే సామెత నవ్వు తెప్పించినా, అలాగే జరగాలని బాధితులు భావించటంతో ఏమాత్రం తప్పులేదేమో భారత దేశపు ఆర్థిక పరిస్థితి ఈ వైపరీత్య ధోరణులు ఇలాగే కొనసాగుతే కిందకు దిగజారక తప్పదు. మనం సాధించిన నాలుగో, అయిదో ర్యాంక్ ఆర్థికంగా ఎప్పుడో కోల్పోయాము. ముందు ముందు అడుగంటే దౌర్భాగ్య పరిస్థితి మనం ఆర్థిక పురోగమనానికి దాపురించటం నిజంగా దురదృష్టకరం. క్రూడాయిల్ ధరల పెరుగుదల వల్ల అనేక రకాల మార్గాల్లో ఆర్థిక సంపదా, బలం బీటలు వారక తప్పదు. క్రూడాయిల్ ధరలు ఎక్కువ ధరలు పెట్టి దిగుమతులు చేసుకోవడం వల్ల రూపాయి మారకం పడిపోవటంతోపాటు, ద్రవ్యోల్బణం వల్ల శరాఘాతంలా తగలకమానవు. హార్మూజ్ జలసంధి దిగ్బంధంతో సప్లయి విధానం పూర్తిగా చిన్నాభిన్నం అయింది. ఎల్‌పిజి, ఫ్యూయెల్ ఒత్తిడి విపరీతంగా పెరగక తప్పదు. షిప్పింగ్ ఇన్సూరెన్స్ ఖర్చు దేశాలకు మోయలేని రీతిలో పెరుగుతుంది. అమెరికా రష్యా మీద పెట్టిన ఆంక్షలతో క్రూడ్ ఆయిల్ దిగుమతులు ఇబ్బందుల్లో పడ్డాయి. సరఫరా, భారతదేశం లాంటి దేశాలకు డోలాయమాన పరిస్థితిలో ఉంది. అంతేకాదు ఈ పరిస్థితుల వల్ల దిగుమతి ధరలు తప్పక పెరుగుతాయి. కార్గో డిలే వల్ల స్టాక్ మేనేజ్‌మెంట్ అవకతవకలతో కష్టాలు మరింతగా భరించక తప్పదు. క్లుప్తంగా క్రూడాయిల్ సప్లయిలో వచ్చే ఇబ్బందులతో మన దేశానికే కాదు ఇతర దేశాల ఆర్థిక పరిస్థితులు కూడా అవకతవకలుగా మారక తప్పదు. పురోగతి



బదులు ఆర్థిక తిరోగమనం మొదలయ్యి అంతకుముందు సంభవించిన రెండు ప్రపంచ యుద్ధాల భయానక వాతావరణం తిరిగి రిపీట్ అవుతుందే అన్న భయం ఆర్థిక నిపుణులను, దౌత్య శిఖామణులను అప్పుడే వేధించడం మొదలయింది. అయినా సరే అమెరికా, ఇరాన్, ఇజ్రాయిల్ దేశాల అధినేతలు అన్నిహెచ్చరికలను పెడచెవిన పెట్టితాము పట్టిన కుందేలుకి మూడేకాళ్లు అన్న ధోరణిలో వ్యవహరించడం చరిత్ర భవిష్యత్తును చూడగలిగితే క్షమించదు. భారత దేశానికి సంబంధించినంతవరకూ రష్యాతోపాటు ఖతార్ దేశాలు అందించే ఆయిల్ కుంటుపడితే ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కోక తప్పదు. కేవలం మనం, మనదేశం మన కష్టనష్టాల మాట అటుంచి ప్రపంచ పరిస్థితి గమనించినా ఒకేమారు సంభవించే ఈ పరిణామాలు తట్టుకోగలదా? ద్రవ్యోల్బణం హద్దులు దాటదా? సప్లయి చేసిన ఆయిల్ లాంటి సరుకులు సరిగ్గా రక్షణ లేకుండా సంబంధిత దేశాలకు చేరగలవా? ముఖ్యంగా ఆసియాలోని దేశాలు ఆర్థిక అభద్రతను చాలా కాలం ఎదుర్కోక తప్పదా? ఇలాంటి భయ సందేహాలు దాదాపు అన్ని దేశాల ప్రజలను ప్రపంచాన్ని ఇబ్బందులపాలు చేసిన దేశాలతోసహా భీతిల్లేట్లు చేస్తున్న మాట వాస్తవం. భారతదేశపు క్రూడాయిల్ దిగుమతులు దాదాపు 90శాతం ఉంటాయి. నిజానికి దిగుమతి దారులలో ఆయిల్ విషయంలో మనదేశానిది మూడవ అగ్రస్థానం. అంతేకాదు త్వరిత గతిన ఎనర్జీ వాడకంతో ఆర్థికాభివృద్ధి సాధించటంలో ప్రపంచంలోనే అగ్రగామి ఉన్నాం. ఆయిల్ దిగుమతులు ఆగిపోతే, ఎనర్జీ వాడకాలు తగ్గిపోతే ఆర్థికాభివృద్ధి అధోగతిలో పడటం ఖాయం. ఈ విధమైన మార్పువల్ల మనదేశం రచించిన ఆర్థిక ప్రణాళికలు వృథాగా మారి ఆర్థిక ప్రగతి కుంటుపడుతుంది. ఎప్పుడు మళ్లీ పుంజుకోగలమో ఈ పరిస్థితులలో చెప్పటం కష్టం. విశాలమైన అవగాహనతో మనం ప్రణాళికలు వేసుకున్నాం. ముందు కాలాలకు సరిపోయేంతగా ఎనర్జీ సెక్యూరిటీతో ఆర్థిక ప్రగతిని సాధించి, దేశంలోని ఆర్థికఅసమానతలు తొలగించాలన్న ధ్యేయంతో పనిచేస్తుంటే రాజకీయ ఉన్మాదుల స్వార్థపూరిత అహంకార చర్యలతో ఈ దిక్కుమాలిన పరిస్థితిని ఎదుర్కోవాల్సిన దురదృష్టం వచ్చింది. ముందు ముందు భౌతిక, రాజకీయ పరిస్థితుల పరిణామాలతో ఆర్థిక స్థితిగతులు ప్రపంచవ్యాప్తంగా క్షీణించటమేకాకుండా అన్నిరకాల విభజించబడ్డ సమాజాన్ని, బీదతనాన్ని కొన్ని దేశాలు పూర్తిగా కనుమరుగు కావటాన్ని చూడాల్సిన పరిస్థితి ఈ కాలం వారికి దాపురిస్తుందేమో అన్న భీతావహ అంచనా కొందరి ప్రపంచ దేశాల అగ్రనాయకుల హ్రస్వదృష్టి, ధ్యేయాలవల్ల అనుభవజ్ఞులకు కలుగుతున్నది. 21శతాబ్దంలో ఆర్థిక సార్వభౌమాధికారం కోసం అగ్రాధిపత్యం వహించాలని అర్రులుచాస్తున్న దేశాధినేతలకు ఆశాభంగం కలగక మానదు. ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ముకుతాడు వేయటానికి ఆ దేశ నాయకులు రాజకీయ విభేదాలను మరిచిపోయి బహుముఖంగా ప్రయత్నాలు మొదలుపెట్టారు. చిన్న దేశం అభివృద్ధి పథంలో నడుస్తున్నదని తలపోసిన ఇజ్రాయెల్ దూరదృష్టి గల నాయకులు కరవవటంతో వెర్రిపోకడలు, ట్రంప్ అండ చూసుకొని వేస్తున్నది కానీ ఆటకట్టు ట్రంప్‌కూ నెతన్యాహుకూ ఒకేసారి సంభవించినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. తెగిందాకా గుంజటం ఇరాన్‌కు శ్రేయస్కరం కాదు. పరిస్థితుల పరిష్కారంతోపాటు విశాల దృక్పథంతో వ్యవహరిస్తే ప్రపంచ శాంతికి దోహదపడిన దేశంగా పేరు తెచ్చుకుంటుంది.రష్యా, చైనా,భారత్ దేశాల సంయమనంతో సరైన పరిష్కార మార్గాలు ప్రపంచ శాంతికి కనుగొనగలు గుతే సుస్థిరత సాధించగలం. ●

# కులాల అభ్యున్నతికి రిజర్వేషన్ల పెంపు అవసరమేనా?

దాడిశెట్టి శ్యామ్ కుమార్

భారత దేశంలో షెడ్యూల్ కులాలు షెడ్యూల్ తెగలు వెనుకబడిన తరగతులు మైనార్టీలు ఇతరులకు సంబంధించి జనాభాను అంచనా వేయడానికి కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలు చాలాసార్లు కుల ప్రాతిపదికన సర్వేలను జరపడం జరిగింది.అయితే రాజకీయ ఆర్థిక సామాజిక రంగాల్లో చాలావరకు వెనుకబాటు కలిగి ఉంటున్నాయి అనే భావనతో బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ ఇతర కులాల్లోని ఆర్థిక స్థితిగతులు అనుకూలంగా లేని సామాజిక వర్గాలు అన్ని రంగాల్లో సరైన భాగస్వామ్యం కావాలని డిమాండ్ చేస్తున్న సందర్భాలు అడపాదడపా గోచరిస్తుంటాయి. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన కులగణన సర్వే ఆధారంగా బీసీ కులాలు అత్యధిక శాతం ఉండడం ఒక ఎత్తు అయితే ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం బీసీ రిజర్వేషన్ నలభై రెండుశాతాన్ని పెంచుతామన్న తీరు మరోఎత్తు అయింది. ఈ క్రమంలో బీసీ రిజర్వేషన్ పెంపు విషయమై ప్రభుత్వం సానుకూల విధానంతో ప్రత్యేకంగా బీసీ రిజర్వేషన్ బిల్లుపై రాజకీయాలకు అతీతంగా సాధ్యమైనంతగా కార్యాచరణ తీసుకున్నప్పటికీ కారణాలేవైనా చట్టపరమైన విధాన అమలు ఇంకా ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో బీసీ వాదం చాపకింద నీరులా విస్తరిస్తున్నతీరు బీసీ సామాజిక వర్గాల్లో స్పృహను కలిగిస్తున్నదా అనే రీతిలో ప్రధానంగా అన్ని రాజకీయ పార్టీల్లోని నాయకులు బీసీల సాధికారత రిజర్వేషన్ల పెంపు అమలు తీరుపై భిన్న వాదనలు వినిపిస్తుండడం విశేషం. అయితే ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనుకున్న రీతిలోనే కులాల సంఖ్యను తెలియ చేసినప్పటికీ, ఆయా కులాల ప్రాతిపదికన రిజర్వేషన్ల పెంపు ప్రక్రియకు రాజకీయాలకు అతీతంగా చట్టబద్ధత కోసం బిల్లుకు ఆమోదానికి ప్రయత్నాలు మరింత వేగవంతం చేయాలని విభిన్న సామాజిక వర్గాలు కోరుకోవడంలో అతిశయోక్తి లేదు. చట్టసభల్లో బీసీ జనాభా ప్రాతిపదికన ఉండవలసిన రిజర్వేషన్లు తగినంతగా లేకపోవడం వల్ల ఇతరుల ఉన్నత సామాజిక వర్గాల ప్రాతినిధ్యం ప్రభుత్వంలో ఎంతో కొంత ఎక్కువ ఉంటుందనే అభిప్రాయాలు ఉన్నప్పటికీ,కుల ప్రాతిపదికన కొంత తక్కువ జనాభా ఉన్నటువంటి ఉన్నత సామాజిక వర్గాల వారికే వివిధ రాజకీయ పార్టీలు ఎన్నికల్లో ఎక్కువగా సీట్లను కేటాయిం



చడం జరిగినప్పుడు తద్వారా ఉన్నత వర్గాల వారే రాజ్యాధికారంలో ఎక్కువగా నిలదొక్కుకునే అవకాశం లేకపోలేదనే సంశయం వివిధ సామాజిక వర్గాల్లో లేకపోలేదు. అంతే కాకుండా ఎక్కువ ఓటర్లు ఉన్న వెనుకబడిన తరగతులకు జనాభా ప్రాతిపదికన అన్ని రంగాల్లో సరిపడా రిజర్వేషన్లు కల్పిస్తే వెనుకబడిన తరగతుల సామాజిక వర్గాల భాగస్వామ్యం,ఆర్థిక రాజకీయ సామాజిక అంశాల్లో స్పష్టంగా గోచరించడమే కాకుండా ఆ వర్గాల అభివృద్ధికి దోహదపడుతుందనే వాదనలు వినపడుతున్నాయి. స్వాతంత్ర్యానంతరం జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో విభిన్న ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినా ఎక్కువశాతం ముఖ్యమైన మంత్రి పదవులను ఉన్నత వర్గానికి చెందిన వారే నిర్వహించినట్టు గణాంకాలు చెప్తుంటాయి.దానికి ప్రధానంగా చట్టసభల్లో బీసీ ఎస్సీ, ఎస్టీ మైనార్టీ లలో తగినంత నాయకత్వం లేకపోవడమే కావచ్చుఅనే భిన్న అభిప్రాయాలు తరచు వ్యక్తం అవుతుంటాయి.పెరుగుతున్న సామాజిక వర్గాల రిజర్వేషన్ల పెంపు విషయమై అడపదడపా కొన్ని రాజకీయ పార్టీలు అంతర్గతంగా పునరాలోచనలో పడుతున్నాయా అనే రీతిలోరిజర్వేషన్ల పెంపుకై సానుకూలంగా రాజకీయ పార్టీలు స్పందిస్తున్నాప్పటికి, రిజర్వేషన్ల పెంపు ప్రక్రియ రాజ్యాంగ పరమైన విధానంతోముడిపడి ఉండడం వల్ల ప్రక్రియను సజావుగా నిస్వార్థంగా చేపట్టవలసిన ఆవశ్యకత అన్ని రాజకీయ పార్టీలకు ఉంటుందేమో. రిజర్వేషన్ల పెంపుప్రక్రియ నిర్ణయాత్మకంగా ఉంటుందో లేదో అనే సంశయం బీసీవర్గాల్లో ఉన్నప్పటికి రిజర్వేషన్ పెంపుబిల్లును పార్లమెంటులో ఆమోదంపొందాల్సిన అవసరం ఉంటుంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా భారత దేశ రిజిస్ట్రర్ జనరల్, జనాభా గణన కమిషనర్ నిర్వహిస్తు న్నజనాభా లెక్కల్లో కుల గణన కూడా అందులో భాగంగా చేర్చాల్సి ఉంటే బాగుంటుందనే భిన్న వాదనలు కూడా తెరపైకి వస్తున్నాయి. కులాల ప్రాతిపదికనే ప్రభుత్వాలు ఆయా వర్గాల అభ్యున్నతికి, ఆర్థిక రాజకీయ సామాజిక సాధికారత అవసరాల దృష్ట్యా కావలసిన అవసరాలు అవకాశాలు లాంటివి జనాభా కులగణన ప్రాతిపదికనే నిర్ణయం తీసుకోవడానికి అవకాశం ఉంటుందా అనే సంశయం సామాజిక వర్గాల్లో లేకపోలేదు. ఏది ఏమైనప్పటికీ జనాభా ప్రాతిపదిక అంచనా ప్రకారం అధిక శాతం ఉన్న వెనుకబడిన తరగతుల కులాలకు రిజర్వేషన్ల పెంపు చట్టపరమైన విధానాల రూపకల్పనతో సాధ్యమైతే విద్యా, ఉపాధి, రాజకీయ, ఆర్థిక, సామాజిక, తదితర అన్ని రంగాల్లో కొంత వరకు ప్రయోజనాలను పొందగలరేమో. ●

# ఎరువుల పరిశ్రమల ఏర్పాటే పరిష్కారం

బొల్లిముంత సాంబశివరావు

తెలుగు రాష్ట్రాల్లో త్వరలో ఖరీఫ్ సేద్యం ప్రారంభం అవుతుంది.నేటి సేద్యానికి ఎరువులు అత్యంత కీలకం. ఎరువుల వినియోగం లేకుండా దిగుబడులు రాని పరిస్థితి. సస్యవిప్లవం ప్రారంభం పేరుతో, అధిక దిగుబడుల కోసమంటూ రసాయనిక ఎరువుల దిగుమతి ప్రారంభమైంది. రసాయనిక ఎరువుల వాడకం ఫలితంగా భూమి గుల్లబారి సారంకోల్పోయి రసాయనిక ఎరువుల వినియోగం లేకుండా దిగుబడి రాని పరిస్థితులను దేశ వ్యవసాయరంగం ఎదుర్కొంటున్నది. సేద్యం ఎరువులపై ఆధారపడటం, వాటి ధరలు నిరంతరం పెరుగుతూ ఉండటం వల్ల రైతాంగ సేద్యపు ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయి. గత సంవత్సర ఖరీఫ్ సీజన్ నుంచి నేటి ఖరీఫ్ సీజన్ వరకు మూడుసార్లు ఎరువుల ధరలు పెరిగాయి.గత ఖరీఫ్ నుండి నేటి వరకు రూ.300 నుండి రూ.700వరకు ఎరువుల ధరలు పెరిగాయి. ఈ పెరుగుదల వల్ల ఎకరా సేద్యంపై వెయ్యి రూపాయలపైగా రైతుకు అదనపుఖర్చు అవుతుంది. దేశంలో ఎరువుల ఉత్పత్తికి అవసరమైన ముడిసరుకులను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాము. నేడు ఎరువుల ఉత్పత్తి ఏకంగా 24.6 శాతం క్షీణించింది. ఇరాన్‌పై అమెరికా చేస్తున్న యుద్ధం వల్ల ఇంధన సరఫరాకు ఆటంకం ఏర్పడి ఉత్పత్తిపై ప్రభావం చూపుతున్నదని అధికార వర్గాలు ఉత్పత్తి తగ్గడాన్ని సమర్థించుకుంటున్నారు. 1992కి ముందు ఎరువుల ధరలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించేది. ప్రపంచ బ్యాంకు సూచనల మేరకు, ధరల నిర్ణయం నుంచి కేంద్రప్రభుత్వం తప్పుకుని, మిల్లు యజమానులకే ఎరువుల ధరల నిర్ణయం అప్పగించింది.ఆవిధంగా ఎరువులరంగాన్ని, ప్రైవేట్ రంగానికి అప్పగించింది. ఎరువుల యజమానులకు లాభాలే ముఖ్యం కాబట్టి ప్రతిసంవత్సరం ఎరువుల ధరలు పెంచుతూ,రైతులపై భారం మోపుతూ, లాభాలు మూటగట్టుకుంటున్నారు. 2010కి ముందు అన్ని ఎరువులపైనా సబ్సిడీ ఒకేవిధంగా ఉండేది. అమెరికా కనుసన్నల్లో ఉన్న ప్రపంచ బ్యాంకు ఎరువుల సబ్సిడీ భారాన్ని తగ్గించుకోమని కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చిన సలహా మేరకు, ఇచ్చే సబ్సిడీ తగ్గించుకోవడానికి 2010 ఏప్రిల్ నుంచి పోషక విలువలను బట్టి ఎరువుల సబ్సిడీని ప్రకటిస్తున్నది. ఇది రైతాంగంపై భారం మోపడమే. తన భూకామందులకు పెద్దఎత్తున అమెరికా సబ్సిడీలు ఇస్తూ, కేంద్ర ప్రభుత్వాన్ని సబ్సిడీలు తగ్గించుకోమని చెప్పడం, దాన్ని మోడీప్రభుత్వం అమలు జరపడం, కేంద్రప్రభుత్వంపై అమెరికా ఆధిపత్యాన్ని తెలుపుతున్నది. 2025-26 సంవత్సరం సవరించిన బడ్జెట్లో ఎరువుల సబ్సిడీకి,86,460 కోట్లు కేటాయిస్తే, 2026-27 బడ్జెట్లో 1.67లక్షల కోట్లు మాత్రమే కేటాయించింది.దాదాపు 19 వేల కోట్లు తక్కువ. గత ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్



సీజన్‌కి 37,216కోట్లు కేటాయించగా,ఈ ఆర్థిక సంవత్సరం 41,534 కోట్ల సబ్సిడీని ఆమోదించింది. ఖరీఫ్ సీజన్ కన్నా, రబీ సీజన్కి ఎక్కువ విడుదల కావాల్సి ఉంది. ఏ ఆర్థిక సంవత్సరంలో కూడా బడ్జెట్లో కేటాయించిన సబ్సిడీ మొత్తాన్ని రైతులకు ఇవ్వలేదు. భారతదేశంలో ఎరువులపై ఇచ్చే సబ్సిడీనే, రైతాంగానికి అందే ప్రధాన సబ్సిడీ. ఇది కూడా అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాల కంటే చాలా తక్కువ. దీన్లో కూడా కేంద్రప్రభుత్వం కోతపెడుతూ వస్తున్నది. ఎరువులపై రైతాంగానికి ఇస్తున్న కొద్దిపాటి సబ్సిడీనే భారంగా భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం, బడా పారిశ్రామికవేత్తల, బహుళజాతి సంస్థలకు వివిధరూపాల్లో పెద్దఎత్తున రాయితీలు ఇస్తూ ఉంది. 2015-24 మధ్య కాలంలో కార్పొరేట్ సంస్థలకు రూ.9.26లక్షల కోట్లను పాతబకాయిలుగా ప్రకటించింది. 2020-24 మధ్య కాలంలోనే 3,67,261 కోట్లబకాయిలను పారుబకాయిలుగా ప్రకటించింది. ప్రస్తుతం బడాపారిశ్రామిక వేత్తల పారు బకాయిల ప్రకటన 13లక్షల కోట్లకు పైగా ఉంది. పెద్దఎత్తున పారిశ్రామిక వేత్తలు బ్యాంకులకు ఇవ్వాల్సిన అప్పులను పారుబకాయిలుగా ప్రకటిస్తూ, దేశానికి అన్నంపెట్టే రైతులు అప్పుల ఊబిలోఉన్నా,వారి అప్పులు రద్దుచేయడానికి కేంద్ర ప్రభుత్వం, బ్యాంకులు ససేమిరా అంటున్నాయి. అప్పులు రాబట్టుకోవడానికి రైతుల ఇళ్లను,ఆస్తులను జప్తుచేస్తున్నాయి. వీటిని గమనిస్తే బ్యాంకులు ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తున్నది అర్థం అవుతుంది. ప్రతిఖరీఫ్, రబీ సీజన్లో ఎరువులకు కొరత లేదని, ఎరువుల నిల్వలు పుష్కలంగా ఉన్నాయని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఊదరకొడుతూ ఉన్నాయి. ఆచరణలో యేటా తీవ్రమైన ఎరువుల కొరత ఏర్పడుతూనే ఉంది. ముఖ్యంగా యూరియా కొరత రైతులను వెన్నాడుతూ ఉంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ కొరత తీవ్రంగా ఉంది. తెలుగు రాష్ట్రాలకు రావాల్సిన ఎరువుల కోటా సకాలంలో కేంద్రంనుంచి రాబట్టుకోవడంలో చంద్రబాబు,రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు విఫలం అయ్యాయి. సస్యవిప్లవం పేరుతో గత ప్రభుత్వాలు మోడీ నాయకత్వాన ఉన్న ఎన్డీఎ ప్రభుత్వం రసాయనిక ఎరువుల దిగుమతిని పెద్దఎత్తున ప్రోత్సహించాయి. ఇప్పుడు ఎరువుల వాడకం తగ్గించమని కేంద్రం రైతులకు హితబోధచేస్తున్నది. ఎరువులు వినియోగించకపోతే దిగుబడులు రావు. దిగుబడులు రాకపోతే నష్టాలు ఎక్కువై రైతాంగ సంక్షోభం తీవ్రరూపం దాల్చుతుంది. అంతేకాకుండా రైతాంగం సేద్యం నుంచి వైదొలిగే పరిస్థితి ఏర్పడి ఆహార సంక్షోభానికి దారితీస్తుంది.కేంద్రం దీన్నే కోరుకుంటుందా! రసాయనిక ఎరువుల స్థానంలో నేలను సారవంతంగా ఉంచే ఎరువుల ఉత్పత్తి దేశంలో జరగాలి. విదేశీ ఎరువుల దిగుమతిని పరిమితం చేయాలి. అలాంటి విధానాలు కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదు. దేశంలో కొత్త ఎరువుల పరిశ్రమలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, వివిధప్రాంతాల భూసారానికి అనుగుణమైన ఎరువుల ఉత్పత్తి చేయాలని, ఎరువుల దిగుమతిని పరిమితం చేయాలని, పెరిగిన ఎరువుల ధరలు తగ్గించాలని, ఎరువుల సబ్సిడీ పెంచాలని రైతాంగం ఉద్యమించాలి. ●

# కర్ణాటక నాయకత్వంలో నేడో, రేపో మార్పు?

## రాజ్యసభకు సిద్దరామయ్య, ముఖ్యమంత్రిగా డికెకు ఛాన్స్!



**న్యూఢిల్లీ, మే 26:** కర్ణాటకలోని కాంగ్రెస్ పరిస్థితి, రానున్న రాజ్యసభ, ఎమ్మెల్సీ ఎన్నికలపైనే చర్చించామని, హైకమాండ అధిష్టానం మంగళవారంనాడు జరిపిన ఉన్నత స్థాయి సమావేశంలో నాయకత్వ మార్పిడి అంటూ ఏదీ ప్రత్యేక చర్చ లేదని ఎఐసిసి నాయకుడు ఎంపి కెసివేణుగోపాల్ స్పష్టం చేసినప్పటికీ కర్ణాటకలో నాయకత్వ మార్పిడి జరుగుతోందన్న ప్రచారం తగ్గలేదు. రాహుల్‌సమక్షంలో జరిగిన సుదీర్ఘ చర్చల్లో డిప్యూటి సిఎం శివకుమార్ సిద్ద రామయ్యను రాజ్యసభకు పంపించాలన్న ప్రతిపాదన తీసుకురావడంతో రాహుల్‌సైతం సుముఖత వ్యక్తంచేసినట్లు సమాచారం. మీరు కొత్తవారికి అవకాశం ఇవ్వాలని సిద్ధరామయ్యకు సైతం సూచించడంతో సిద్ధరామయ్య సీఎం పదవినుంచి వైదొలిగి రాజ్యసభకు వెళతారన్న వార్తలు గుప్పుమన్నాయి. ఢిల్లీస్తాయిలో జరిగిన చర్చల్లో ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, నాయకులు కెసి వేణుగోపాల్, రణదీప్‌సూర్జే వాలాలు ఇరువురితో సుదీర్ఘ చర్చలుజరిపారు. తొలుత కెసి వేణుగోపాల్ ఎలాంటి చర్చలు సీఎం మార్పు ప్రస్తావన లేదని స్పష్టంచేయడంతో కర్ణాటక డిప్యూటిసిఎం డికె వర్గీయులకు నిరాశకలిగింది. రాజధానిలోజ రిగిన భేటీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, కర్ణాటక ఇన్‌చార్జి రణ్‌దీప్ సూర్జేవాలాలుఈ సమావేశంలో పాల్గొన్నారు. భేటీ తర్వాత కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ, కర్ణాటకలో అధికార మార్పిడికి సంబంధించిన అంశంపై సమావేశంలో ఎలాంటి చర్చా జరగలేదన్నారు. త్వరలో జరుగనున్న కర్ణాటక రాజ్యసభ ఎన్నికలు, ఎమ్మెల్సీ ఎన్నికలపైనే సమావేశంలో చర్చ జరిగినట్టు చెప్పారు. కర్ణాటకలో నాయకత్వ మార్పు ఊహాగానాల్లో ఎలాంటి వాస్తవం లేదు. ఈ సమావేశంలో కేవలం ఎన్నికలకు సంబంధించిన అంశాలే చర్చించాం. కర్ణాటక నుంచి రాజ్యసభ ఎన్నికలు, కౌన్సిల్ ఎన్నికల్లో అనుసరించాల్సి న వ్యూహాలను చర్చించామని చెప్పారు. చర్చలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, కర్ణాటక ఇన్‌చార్జి, తాను పాల్గొన్నట్టు తెలిపారు. ఇతర రాష్ట్రాలతో పాటు కర్ణాటక నుంచి కూడా రాజ్యసభ సీట్ల ఎన్నికలను ప్రకటించారని, దానిపైనే ఈరోజు చర్చించామని, తక్కినవన్నీ ఊహాగానాలేనని వివరించారు. కాంగ్రెస్ 2023లో కర్ణాటకలో అధికారం చేపట్టినప్పటి నుంచి శివకుమార్‌కు పదోన్నతిపై పలుమార్లు ఆయన వర్గం నేతలు డిమాండ్ చేస్తూ వచ్చారు. అధికారం పంపకాలపై ముఖ్యమంత్రి ఎన్నికకు ముందే ఒక అవగాహన ఉందని నేతలు చెబుతున్నారు. అయితే సిద్ధరామయ్య ఆ వాదనలను తోసిపుచ్చారు. ఐదేళ్లూ తాను అధికారంలో ఉంటానని, అయితే పార్టీ నిర్ణయానికి తాను, శివకుమార్ కట్టుబడి ఉంటామని పలుమార్లు చెప్పారు. ఈ నేపథ్యంలో సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లను ఢిల్లీకి రమ్మని పార్టీ అగ్రనాయకత్వం పిలవడంతో నాయకత్వ మార్పిడి అంశం మరోసారి ప్రచారంలోకి వచ్చింది. రాష్టంలో మూడు రాజ్యసభ స్థానాలకు, తొమ్మిది శాసనమండలి స్థానాలకు ఎన్నికలు జరగ నున్నాయి. రాజ్యసభ నామినేషన్ల దాఖలుకు జూన్ 8 చివరి తేదీ కావడం వల్ల అభ్యర్థుల ఎంపికపై కూడా ఢిల్లీలో కసరత్తు చేయనున్నట్లు తెలుస్తోంది. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం సగం పదవీకాలం పూర్తి చేసుకున్న తరుణంలో డీకే శివకుమార్ అనుచరులు సీఎం పదవి కోసం ఒత్తిడి పెంచుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మంగళవారం జరిగిన భేటీలో కేవలం ఎన్నికలు, అభ్యర్థుల ఎంపికపైనే చర్చలుజరిగినట్లుస్పష్టత రావడంతో కర్ణాటకలో నాయకత్వ మార్పు అంటూ ఏదీలేదని తేల్చేసారు. అయితే రాత్రిపొద్దుపోయాక సమీకరణాలు ఒక్కసారిగా మారిపోయాయని, సిద్ధరామయ్య సిఎం పదవినుంచి గురువారం వైదొలుగుతారన్న ప్రచారం వ్యాప్తిలోకి వచ్చింది. గడచిన ఏడాది కాలంగా అటు డికె వర్గం, ఇటు సిద్దువర్గం నాయకత్వంపై ఎవరిస్థాయిలో వారు పట్టుబడుతున్న సంగతి తెలిసిందే. సిద్ధరామ య్యను లేదా డికెను ఢిల్లీకి రమ్మనపుడల్లా నాయకత్వ మార్పుపై చర్చించేందుకు రమ్మన్నట్లుగా రాష్ట్ర కేడర్‌లో ఊహాగానాలు చెలరేగాయి. దీనితో నాయకత్వ మార్పు అనివార్యమని తేల్చారు. ఢిల్లీ వేదికగా జరిగిన విస్తృత చర్చల్లో ఎట్టకేలకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజీనామాకు అంగికరించినట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

# అన్నాడిఎంకెలో ముదురుతున్న ముసలం

## మరో ఎమ్మెల్యే పార్టీకి రాజీనామా



**చెన్నై, మే 26:** తమిళనాడులో అన్నాడీఎంకేలో అంతర్గత సంక్షోభం మరింత ముదురుతోంది. పార్టీలో నెలకొన్నఅంతర్గత విభేదాలతో ఎమ్మెల్యేల రాజీనామాల పర్వం కొనసాగుతోంది. తాజాగా మంగళవారం నాడు మాజీ మంత్రి, అంబసముద్రం ఎమ్మెల్యే ఈసక్కి సుబ్బయ్య తన పదవికి రాజీనామా చేశారు. ఆయన అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్టీ నుంచి తప్పుకున్న నాలుగో ఎమ్మెల్యే కావడం గమనార్హం. సుబ్బయ్య త్వరలోనే అధికార తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీలో చేరతారని ప్రచారం జరుగుతోంది. స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌ను కలిసి సుబ్బయ్య తన రాజీనామా లేఖను సమర్పించారు. తొలుత ఆయన టైప్ చేసిన లేఖను ఇవ్వగా స్పీకర్ నిరాకరించారు. స్వదస్తూరితో రాసిన లేఖను ఇవ్వాలని సూచించారు. దీంతో సుబ్బయ్య వెంటనే చేతితో రాసి రాజీనామా లేఖను అందించగా, దానిని స్పీకర్ ఆమోదించారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏఐఏడీఎంకేలో విభేదాలు తారాస్థాయికి చేరాయి. పార్టీ ప్రధాన కార్యదర్శి పళనిస్వామి, సీనియర్ నేత సీవీ షణ్ముగం వర్గాలుగా నేతలు విడిపోయారు. అసెంబ్లీలో జరిగిన విశ్వాస పరీక్ష సమయంలో షణ్ముగం వర్గం టీవీకే ప్రభుత్వానికి మద్దతు పలకగా, ఈపీఎస్ వర్గం తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ ఘటనతో పార్టీలో సంక్షోభం మొదలైంది. సుబ్బయ్య రాజీనామాకు ఒకరోజు ముందే ముగ్గురు ఏఐఏడీఎంకే ఎమ్మెల్యేలు పార్టీని వీడారు. ధరపురం ఎమ్మెల్యే సత్యభామ, పెరుందురై ఎమ్మెల్యే జయకుమార్, మధురాంతకం ఎమ్మెల్యే మరగతం కుమారవేల్ తమ పదవులకు రాజీనామా చేసి, టీవీకే సీనియర్ నేత ఆధవ్ అర్జున సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఈసక్కి సుబ్బయ్యకు రాజకీయంగా మంచి పట్టుంది. ఆయన 2011, 2021 ఎన్నికల్లోనూ గెలిచారు. గతంలో జయలలిత కేబినెట్‌లో మంత్రిగా కూడా పనిచేశారు. ఇంతటి సీనియర్ నేత పార్టీని వీడటంతో, మరికొందరు ఎమ్మెల్యేలు కూడా ఇదే బాట పట్టవచ్చనే ఊహాగానాలు తమిళ రాజకీయాల్లో జోరందుకున్నాయి.

# ఐదు దేశాల్లో భారత్ డ్రైవింగ్‌లైసెన్స్ చెల్లుబాటు!

**న్యూఢిల్లీ, మే 26:** భారత ప్రభుత్వం జారీచేసే డ్రైవింగ్ లైసెన్స్‌తోనే ఐదు దేశాల్లో నిరభ్యంతరంగా వాహనాలు నడుపుకోవచ్చు. మనకు పొరుగున ఉన్న అందమైన దేశం భూటాన్. భారతీయ డ్రైవింగ్ లైసెన్స్ ఉంటే చాలు ఇక్కడి ఘాట్ రోడ్లపై హ్యాపీగా ప్రయాణించొచ్చు. సొంత వాహనంతో ఇక్కడ దాదాపు ఒక సంవత్సరం పాటు డ్రైవ్ చేయడానికి అనుమతి ఉంటుంది. అయితే వాహన పత్రాలు, రిజిస్ట్రేషన్‌ను అక్కడి చెక్ పోస్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. దీనికోసం దాదాపు రూ. 4,490 చెల్లించాలి. వ స్విట్జర్లాండ్‌లో కూడా మన భారతీయ డ్రైవింగ్ లైసెన్స్‌కు గుర్తింపు ఉంది. లైసెన్స్ ఇంగ్లీషులో ఉంటే చాలు దాన్ని చూపించి అక్కడ కారును అద్దెకు తీసుకోవచ్చు. ఒక సంవత్సరం పాటు వాహనాలను నడిపేందుకు అనుమతి ఇస్తారు. కెనడాలోకూడా సుదీర్ఘమైన హైవేలపై రోడ్ ట్రిప్స్ చేయడానికి భారతీయ లైసెన్స్ సరిపోతుంది. కాలపరిమితి మీరు ఉండే ప్రావిన్స్‌పై ఆధారపడి ఉంటుంది. ఒంటారియో ప్రావిన్స్‌లో ఉంటే మూడు నెలల కంటే తక్కువ కాలానికి ఎలాంటి అదనపు పత్రాలు లేకుండా భారతీయ లైసెన్స్‌తోనే డ్రైవ్ చేయొచ్చు. అంతకంటే ఎక్కువ కాలం ఉండాలనుకుంటే మాత్రం ఇంటర్నేషనల్ డ్రైవింగ్ పర్మిట్ అవసరం. ఆస్ట్రేలియాలోకూడా ఇంగ్లీషులో ఉన్న చెల్లుబాటు అయ్యే భారతీయ డ్రైవింగ్ లైసెన్స్ ఉంటే చాలు. న్యూ సౌత్ వేల్స్, క్వీన్స్‌లాండ్, సౌత్ ఆస్ట్రేలియా, కాపిటల్ టెరిటరీ వంటి ప్రాంతాల్లో భారతీయ లైసెన్స్‌తో డ్రైవింగ్ చేయడానికి అనుమతి ఇస్తారు.



# నేడు ఢిల్లీకి తమిళ సిఎం విజయ్

> **ప్రధానిమోడీతోపాటు పలువురు కేంద్ర మంత్రులతోనూ భేటీ**
>
> **కర్ణాటక నిర్మించే మేకధాతు ప్రాజెక్టుపై అభ్యంతరాలు**

**చెన్నై, మే 26:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ బుధవారం ఢిల్లీకి వెళ్తున్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి ఢిల్లీకి వెళ్తున్నారు. మూడు రోజుల పాటు ఢిల్లీలో పర్యటించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధాని మోడీతో భేటీ తర్వాత వివిధ కేంద్రమంత్రులను కూడా కలవాలని విజయ్ నిర్ణయించారు. ఇక మోడీతో సమావేశంలో పలు కీలక అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది. ప్రధానంగా కర్ణాటకతో ఉన్న మేకధాతు డ్యాం వివాదాన్ని తీసుకెళ్లే అవకాశం ఉంది. ఈ వివాదంపై ఇప్పటికే ప్రధానికి సీఎం విజయ్ లేఖ రాశారు. కావేరి నదిపై మేకధాతు డ్యాం నిర్మించాలని కర్ణాటక ప్రతిపాదనలు చేసింది. ప్రస్తుతం తమిళనాడు కర్ణాటక మధ్య మేకధాతు డ్యాం. వివాదం సృష్టిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ అంశాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లే ఛాన్సుంది. అలాగే శ్రీలంక జలాల సమీపంలో తమిళనాడు మత్స్యకారులపై జరుగుతున్న దాడులు, నిర్బంధాలు, కీలక అభివృద్ధి ప్రాజెక్టుల కోసం కేంద్ర సహాయాన్ని విజయ్ కోరనున్నట్లు సమాచారం. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌ను కలిసి భారత్‌శ్రీలంకల మధ్య దీర్ఘకాలంగా దౌత్య, రాజకీయ సమస్యగా ఉన్న మత్స్యకారుల సమస్యను ప్రస్తావించే అవకాశం ఉంది. ముఖ్యంగా రామనాథపురం, నాగపట్టణం వంటి తీరప్రాంత జిల్లాల మత్స్యకారులు తరచుగా పాల్క్ జలసంధి సమీపంలోని జలాల్లోకి వెళ్తుం టారు. అక్కడ సముద్ర సరిహద్దుల వివాదాల కారణంగా గత కొన్నేళ్లుగా శ్రీలంక అధికారులు మత్స్యకారులను అరెస్టు చేయడం, నిర్బంది ంచడం, పడవలను స్వాధీనం చేసుకోవడం వంటివి చేస్తున్నారు. ఈ సమస్య తమిళనాడులో పదేపదే నిరసనలకు దారితీసింది. నిర్బంధంలో ఉన్న మత్స్యకారులను విడుదల చేయించాలని, శాశ్వత దౌత్య పరిష్కారం కనుగొనాలని వరుస రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రాన్ని కోరాయి. ఇటీవలి సంవత్సరాల్లో ఉద్రిక్తతలను తగ్గించే లక్ష్యంతో భారత్‌శ్రీలంక చర్చలు జరిపినప్పటికీ, ఎప్పటికప్పుడు సంఘటనలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ఇదే అంశాన్ని ప్రధానంగా విజయ్ ప్రధానిమోడీవద్ద లేవనెత్తనున్నారు.

అలాగే కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లను కూడా కలిసే అవకాశాలు ఉన్నాయి.

ఈ సందర్భంగా రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు, సంక్షేమం, ఇతర అభివృద్ధి కార్యక్రమాల కోసం కేంద్రం నుంచి అధిక సహాయం కోరుతూ విజయ్ ప్రతిపాదనలు సమర్పించే అవకాశం ఉంది.

# వెంటనే మీదేశానికి వెళ్లిపోండి.. వేగంగా పారిపోవాల్సిందే!

## బెంగాల్ సిఎం సువేందు అధికారి బంగ్లా అక్రమ నివాసితులకు హెచ్చరికలు

**కోల్‌కత్తా, మే 26:** బంగ్లాదేశీ అక్రమ వలసదారులపై చర్యలు ముమ్మరం చేస్తూ పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారి వార్నింగ్ ఇచ్చారు. బంగ్లాదేశీ చొరబాటుదారుల్ని హెచ్చరిస్తూ వేగంగా పారిపోండి. వారిని జైలులో ఉంచి పోషించడం మాకు ఇష్టం లేదు. వారిని జైలులో ఉంచి, తిండి పెట్టి మన డబ్బుల్ని ఎందుకు వృధా చేయాలని అన్నారు. బెంగాల్ వ్యాప్తంగా అక్రమ వలసదారుల్ని పారద్రోలే ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటికే చాలా మంది బంగ్లాదేశీయులు సొంత దేశం వెళ్లడానికి సరిహద్దుల వద్దకు చేరుకుంటున్నారు. మరోవైపు, ప్రభుత్వం చొరబాటుదారుల్ని గుర్తించి, నిర్బంధించడానికి ప్రత్యేక సెంటర్లను ఏర్పాటు చేస్తోంది. వీరి గుర్తింపు నిర్ధారించిన తర్వాత వీరిని బంగ్లాదేశ్ పంపనున్నారు. అక్రమంగా ఉంటున్న బంగ్లాదేశీయుల్ని, రోహింగ్యాలను గుర్తించాలని ప్రభుత్వం అధికారుల్ని ఆదేశించింది. ఈ విషయంపై బెంగాల్‌లోని అన్ని జిల్లాల కలెక్టర్లకు సీఎం సువేందు అధికారి లిఖితపూర్వక ఆదేశాలు, మార్గదర్శకాలు జారీ చేశారు. నిర్బంధ కేంద్రాల కోసం అనువైన ప్రదేశాలను గుర్తించి, వీలైనంత త్వరగా చర్యలు ప్రారంభించాలని జిల్లా యంత్రాంగాలను ప్రభుత్వం ఆదేశించింది. సీఎం నుంచి వస్తున్న హెచ్చరికలతో ఉత్తర 24 పరగణాలు, మాల్దా జిల్లాల్లోని సరిహద్దు వద్దకు బంగ్లాదేశీయులు చేరుకుంటున్నారు. చొరబాటుదారుల్ని అడ్డుకోవడం బీజేపీ ఎన్నికల హామీల్లో ప్రధానంగా ఉంది. ఇప్పుడు సువేందు సర్కార్ చర్యలకు ఉపక్రమించింది. ఎన్నికలప్పుడు హామీ ఇచ్చిన విధంగానే బెంగాల్‌లోని బంగ్లాదేశీ అక్రమ వలసదారుల పై సువేందు అధికారి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. అక్రమంగా భారత్‌లో ఉంటున్న బంగ్లాదేశీయులను వారి స్వదేశానికి పంపేయడానికి చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం ఉన్న విదేశీయుల చట్టానికి లోబడే తాము ఈ చర్యలు తీసుకుంటున్నట్లు బెంగాల్ సీఎం చెప్పారు. భారత్ నుంచి తమ పౌరులను తిరిగి స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు బంగ్లాదేశ్ ఇప్పటికే చెప్పిందని, వారిని తిరిగి తీసుకువెళ్లడం అక్కడి ప్రభుత్వ బాధ్యత అని సువేందు అన్నారు. చొరబాటుదారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని జైల్లో పెట్టొద్దని పోలీసులను ఆదేశించినట్లు తెలిపారు.

# నాప్‌కిన్‌లు, టాయిలెట్లు లేవని చదువు మానేయొద్దు

- బాలికలకు సుప్రీంకోర్టు సూచన
- కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు

**న్యూఢిల్లీ, మే 26:** పాఠశాలల్లో, కళాశాలల్లో శానిటరీ నాప్‌కిన్‌లు, ప్రత్యేక టాయిలెట్లు లేవనే కారణంతో బాలికలను చదువు మానేలా బలవంతం చేయకూడదని సుప్రీంకోర్టు పేర్కొంది. జనవరి 30న ఇచ్చిన తన ఉత్తర్వును పూర్తిగా అమలు చేయాలని కోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ విషయంపై ప్రతి మూడు నెలలకు ఒకసారి పురోగతిని పర్యవేక్షిస్తామని కూడా భారత సుప్రీంకోర్టు తెలిపింది. ప్రతి త్రైమాసికానికి ఒక పురోగతి నివేదికను సమర్పించాలని కేంద్రాన్ని కోరింది. ఇది దేశంలోని మహిళలు, బాలికల ప్రయోజనాలకు సంబంధించినది. ఈ తీర్పును సక్రమంగా వినియోగించుకుని, దాని ప్రయోజనాలు గరిష్ట సంఖ్యలో బాలికా విద్యార్థులకు చేరేలా చూడాలని జస్టిస్ జె.బి. పర్దివాలా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం కేంద్రం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ అర్చన పాఠక్ దేవ్‌కు సూచించింది. దీనికి ప్రతిస్పందనగా, జనవరి 30 నాటి తీర్పు తర్వాత అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఈ దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేయబడ్డాయని కేంద్ర ప్రభుత్వం కోర్టుకు తెలియజేసింది. అన్ని రాష్ట్రాల నుండి క్రమం తప్పకుండా డేటా సేకరిస్తున్నారా అని ధర్మాసనం ప్రశ్నించింది. గత రెండు నుంచి రెండున్నర నెలల నుండి డేటాను సేకరించినట్లు కేంద్రం తెలిపింది.

# సంక్షిప్తంగా..

## విదేశీయులు కీవ్‌ను వీడి వెళ్లండి: రష్యా హెచ్చరికలు

**బీజింగ్, మే 26:** రష్యా-ఉక్రెయిన్ మధ్య నాలుగేళ్లుగా యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఇటీవల ఉక్రయిన్‌పై శక్తిమంతమైన హైపర్ సోనిక్ బాలిస్టిక్ క్షిపణి 'ఒరెష్నిక్' సహా పలు క్షిపణలు, వందల డ్రోన్లతో విరుచుకుపడిన రష్యా.. రాజధాని నగరం కీవ్‌పై మున్ముందు భారీ దాడులు ఉంటాయని సంకేతాలు ఇచ్చింది. అధ్యక్షుడు జెలెన్‌స్కీ విధాన నిర్ణయాల్లో కీలకమైన భవనాలు, రక్షణరంగ పరిశ్రమలు, కమాండ్ సెంటర్లు, డ్రోన్ తయారీ కేంద్రాలు లక్ష్యంగా దాడులు ఉధృతం చేస్తామని హెచ్చరించింది.

వెంటనే విదేశీ దౌత్యవేత్తలు, పౌరులు నగరాన్ని వీడాలని రష్యా తన హెచ్చరికల్లో పేర్కొంది.

రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో సోమవారం ఫోన్‌లో మాట్లాడుకున్నారు.

## వైట్‌హౌస్‌లో ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ ఒంటరి?

**వాషింగ్టన్, మే 26:** వైట్‌హౌస్‌లో మారుతున్న పరిస్థితుల కారణంగా కీలక విదేశాంగ విధాన నిర్ణయాలకు అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ దూరంగా ఉంటున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో 2028లో జరగనున్న అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే ప్రణాళికలను కూడా వాన్స్ వెనక్కి తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది ఇటీవల ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తాను భవిష్యత్తు అధ్యక్ష అభ్యర్థిని కాదని, ప్రస్తుత ఉపాధ్యక్షుడినని వ్యాఖ్యానించడంతో ఈ వార్తలకు మరింత బలం చేకూరినట్లయింది. అయితే 2028 అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం కొంతకాలంగా వాన్స్‌కు మార్కో రూబియోతో తెర వెనుక రహస్య పోటీ జరుగుతోందని మీడియా వర్గాలు వెల్లడించాయి.

## గోవధ నిషేధంపై సుప్రీంలో పిటిషన్

**న్యూఢిల్లీ, మే 26:** బక్రీద్ పండుగకు ముందు గోవధ నిరోధక చట్టాల అమలు కోరుతూ దాఖలైన పిటిషన్‌ను అత్యవసరంగా విచారణకు స్వీకరించడానికి సుప్రీంకోర్టు మంగళవారం నిరాకరించింది. ఈ విషయాన్ని అత్యవసరమైనదిగా పరిగణించడానికి భారత ప్రధాన న్యాయమూర్తి నిరాకరించారు. న్యాయవాది బరున్ కుమార్ సిన్హా ఈ విషయాన్ని అత్యవసరంగా విచారణకు స్వీకరించాలని అభ్యర్థించారు. గోవధ నిరోధక చట్టాలను అమలు చేయాలని ఈ పిటిషన్‌లో కోరారని, మే 28న బక్రీద్ పండుగ రావడమే దీనికి అత్యవసరమని ఆయన అన్నారు. "తాము విచారణ కోరుతున్నాము, తద్వారా మీ గౌరవనీయ న్యాయమూర్తులు ఒప్పించబడితే, ఒక మధ్యంతర ఉత్తర్వు జారీ చేయవచ్చు," అని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌ను చివరి నిమిషంలో దాఖలు చేశారని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు.

## సెప్టిక్‌ట్యాంక్ విషవాయువులు పీల్చి ఆరుగురు మృతి

కలహండి, మే 26: నిర్మాణంలో ఉన్న సెప్టిక్ ట్యాంకులో దిగిన ఆరుగురు వ్యక్తులు ఊపిరాడక ప్రాణాలు కోల్పోయారు. ఒడిశా రాష్ట్రం కలహండి జిల్లా లో మంగళవారం ఉదయం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. కలహండి జిల్లా మదన్‌పూర్‌రాంపూర్ బ్లాక్ పరిధిలోని గౌడ కర్లాంకుంట గ్రామంలోగల ఓ ఇంట్లో కొత్తగా సెప్టిక్ ట్యాంకును నిర్మిస్తున్నారు. ఇప్పటికే సెంట్రింగ్ కొట్టి స్లాబ్ వేయగా మంగళవారం ఉదయం సెంట్రింగ్ సామాగ్రిని బయటకు తెచ్చేందుకు ఓ సెంట్రింగ్ మేస్త్రీ లోపలికి వెళ్లాడు. అతడు లోపలున్న విషవాయువులు పీల్చుకుని ఊపిరాడక స్పృహ తప్పిపడిపోయాడు. అతడిని కాపాడేందుకు మరో ఇద్దరు మేస్త్రీలు, ఇద్దరు కూలీలులోపలికి వెళ్లారు.

వారి వెంటనే ఆ ఇంటి యజమాని నిమైపాల్, అతడి కుమారుడు ఆకాశ్ పాల్ కూడా సెప్టిక్ ట్యాంకులోకి దిగారు.

అందరూ స్పృహ తప్పి అందులోనే పడిపోయారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు.

## 16వ సారి పెరోల్ పొందిన డేరాసచ్చాసౌదా బాబా..

**రోహతక్, మే 26:** వివాదాస్పద డేరా సచ్చా సౌదా అధినేత, అత్యాచార కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు హరియాణా ప్రభుత్వం 30 రోజుల పెరోల్ మంజూరు చేసింది. దీంతో ఆయన రోహ్‌తక్‌లోని సునారియా జైలు బ్యారక్ నుంచి ఈ ఉదయం 6:30 గంటల ప్రాంతంలో భారీ పోలీసు భద్రత మధ్య విడుదలయ్యారు.

జైలు నిబంధనల ప్రకారం ఒక క్యాలెండర్ ఏడాదిలో ఖైదీకి 70 రోజుల పెరోల్, 21 రోజుల ఫర్లోఫ్ పొందే హక్కు ఉంటుంది. ఈ ఏడాది



ఇప్పటికే జనవరిలో 40 రోజుల పెరోల్ పొందిన రామ్ రహీమ్, తాజా నిర్ణయంతో తన వార్షిక పెరోల్ కోటాను పూర్తిగా వినియోగించుకున్నట్లయింది. ఆయన జూన్ 24న తిరిగి జైలుకు చేరుకోవాల్సి ఉంటుంది.

# ప్రధానిమోడీతో కేరళం సిఎం సతీశన్ భేటీ



**న్యూఢిల్లీ,మే 26:** కేరళ నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వి.డి. సతీశన్ మంగళవారం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడీతో తొలిసారి సమావేశమయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి ఘన విజయం సాధించిన తర్వాత కేంద్ర ప్రభుత్వంతో సత్సంబంధాలు నెలకొల్పుకునే దిశగా ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. ప్రధాని కార్యాలయంలో సుమారు 20 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులకు కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరుతూ సీఎం సతీశన్ ప్రధానికి ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సమావేశంలో కేరళ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ. జయతిలక్ కూడా పాల్గొన్నారు. దశాబ్ద కాలం పాటు అధికారంలో ఉన్న పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్‌ను ఓడించి యూడీఎఫ్ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే ఈ భేటీ జరగడం రాజకీయంగా ఆసక్తి రేపింది. మౌలికసదుపాయాల కల్పన, ఆర్థిక సహాయం, పెండింగ్‌లో ఉన్న రైల్వే, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వంటి అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. అయితే, భేటీ అనంతరం బయటకు వచ్చిన సతీశన్ చర్చల వివరాలను వెల్లడించలేదు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఢిల్లీ వచ్చిన ఆయన, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, హోంమంత్రి అమిత్ షా, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌లతో కూడా సమావేశం కానున్నారు.

# అబ్రహాం ఒప్పందంలో చేరే ప్రశ్నేలేదు.. పాకిస్థాన్ విధానాలకే ఇజ్రాయెల్ విరుద్ధం!

**ఇస్లామాబాద్, మే 26:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకొచ్చిన అబ్రహాం ఒప్పందం ప్రతిపాదనను పాకిస్థాన్ తిరస్కరించింది. ఇజ్రాయెల్‌తో సంబంధాలను సాధారణీకరించుకోవాలంటూ ట్రంప్ చేసిన విజ్ఞప్తిని తాము ఏమాత్రం అంగీకరించబోమని స్పష్టం చేసింది. ఇరాన్‌తో కుదుర్చుకోబోయే శాంతి ఒప్పందంలో భాగంగా సౌదీ అరేబియా, ఖతార్, టర్కీ, ఈజిప్ట్, జోర్డాన్‌తో పాటు పాకిస్థాన్ కూడా అబ్రహాం ఒప్పందంపై సంతకం చేయడం తప్పనిసరి అని ట్రంప్ సోషల్ మీడియా వేదికగా పేర్కొనడంతో ఈ వివాదం షురూ అయింది. ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై పాక్ రక్షణ మంత్రి ఖవాజా ముహమ్మద్ ఆసిఫ్ ఘాటుగా స్పందించారు. మా దేశ ప్రాథమిక సిద్ధాంతాలు, ఆదర్శాలకు విరుద్ధంగా ఉండే ఎలాంటి ఒప్పందాల్లోనూ పాక్ భాగస్వామి కాబోదు. ఒక్క రోజు కూడా మాట మీద నిలబడని, నమ్మకద్రోహానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన ఇజ్రాయెల్‌తో మేం కలిసి కూర్చోవడం అసాధ్యం అని ఆయన తేల్చి చెప్పారు. తమ దేశ అధికారిక విధానం ప్రకారం ఇజ్రాయెల్‌ను ఒక దేశంగా గుర్తించే ప్రసక్తే లేదని తెలిపారు. ట్రంప్ తన ట్రూత్ సోషల్ పోస్ట్‌లోఇ రాన్‌తో అమెరికా జరుపుతున్న చర్చలు ఒక కొలిక్కి వస్తున్నాయని, ఈ చారిత్రాత్మక ఒప్పందంలో భాగం కావాలంటే ముస్లిం దేశాలన్నీ ఇజ్రాయెల్‌తో సత్సంబంధాలు పెట్టుకోవాల్సిందేనని షరతు పెట్టారు. దీనిపై పాకిస్థాన్ ప్రభుత్వ వర్గాలు మండిపడుతున్నాయి. ఇరాన్‌తో దౌత్యపరమైన చర్చలకు, అబ్రహాం ఒప్పందానికి ఎలాంటి సంబంధం లేదని, ఎవరో ఒత్తిడి తెచ్చారని లొంగిపోయే పరిస్థితిలో పాక్ లేదని ఆ వర్గాలు స్పష్టం చేశాయి. సౌదీ అరేబియా కూడా ట్రంప్ ప్రతిపాదనను తోసిపుచ్చింది. స్వతంత్ర పాలస్తీనా దేశ ఏర్పాటుకు సంబంధించి స్పష్టమైన, శాశ్వతమైన మార్గం సుగమం అయ్యే వరకు ఇజ్రాయెల్‌తో చేతులు కలిపేది లేదని సౌదీ పేర్కొంది. గాజాపై ఇజ్రాయెల్ జరుపుతున్న సైనిక దాడుల పట్ల ముస్లిం దేశాల ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్న తరుణంలో ఈ అబ్రహాం ఒప్పందాన్ని విస్తరించాలనే ట్రంప్ ఆశలకు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లయింది.

ఇజ్రాయెల్, అరబ్ దేశాల మధ్య దశాబ్దాలుగా ఉన్న శత్రుత్వాన్ని ముగించి దౌత్య, ఆర్థిక, రక్షణ సంబంధాలను మెరుగుపరిచేందుకు 2020లో ట్రంప్ ఆధ్వర్యంలో ఈ అబ్రహాం ఎకార్డ్స్ ప్రారంభం అయింది.

### పాక్‌లో ఆసిమ్‌మునీర్‌దే పాలనపై పట్టు!

# ట్రంప్ 'ట్రూత్' మీడియా పోస్టుతో స్పష్టత

**ఇస్లామాబాద్, మే 26:** పాకిస్థాన్ పీఠంపై అసలైన పట్టు ఎవరిదన్న దశాబ్దాల నాటి ప్రశ్నకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా పోస్ట్‌తో అనుకోకుండానే సమాధానమిచ్చారు. ఇరాన్ యుద్ధం ముగిసిన తర్వాత ముస్లిం మెజారిటీ దేశాలన్నీ అబ్రహాం అకార్డ్స్ అంటే ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాల ఒప్పందం లో చేరాలని కోరుతూ ట్రంప్ ట్రూత్ సోషల్ వేదికగా ఒక సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు. ఈ క్రమంలో తాను మాట్లాడిన ప్రపంచ దేశాల అధినేతల పేర్లను ఆయన ప్రస్తావించారు. అయితే, మిగతా దేశాల అధికారిక దేశాధినేతల పేర్లను పేర్కొన్న ట్రంప్ పాకిస్థాన్ విషయానికి వచ్చేసరికి మాత్రం ఆ దేశ ఎన్నికైన ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ పేరును పూర్తిగా పక్కనబెట్టి, ఆర్మీ చీఫ్ సయ్యద్ అసిమ్ మునీర్ పేరును చేర్చడం అంతర్జాతీయంగా తీవ్ర చర్చకు దారితీసింది. సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్, యూఏఈ అధ్యక్షుడు మహమ్మద్ బిన్ జాయెద్, టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్, ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫత్తా అల్ సిసిల పేర్లను వారి అధికారిక హోదాలతో సహా ప్రస్తావించిన ట్రంప్ పాక్ ప్రధానిని మాత్రం విస్మరించారు. ఇది దౌత్యపరమైన పొరపాటు కంటే కూడా పాకిస్తాన్‌లో ఎన్నికైన ప్రభుత్వం కంటే సైనిక స్థాపనకే విదేశాంగ, జాతీయ భద్రతా అంశాల్లో అత్యధిక పట్టు ఉందనే వాస్తవాన్ని స్పష్టం చేస్తోంది. ఇటీవల కాలంలో ఇరాన్, ఆఫ్ఘనిస్థాన్ సంక్షోభాలు, అమెరికాతో సంబంధాల విషయంలో ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ పాత్రే కీలకంగా మారింది. ఇటీవలే పాకిస్థాన్ సహా పలు అరబ్ దేశాల నేతలతో ట్రంప్ జరిపిన ఉన్నత స్థాయి కాన్ఫరెన్స్ కాల్‌లో ఇజ్రాయెల్‌ను గుర్తించాలనే ప్రతిపాదన రాగా పాక్ వైపు నుంచి పూర్తి నిశ్శబ్దం వ్యక్తమైనట్లు అంతర్జాతీయ మీడియా సంస్థ ఆక్సియోస్ నివే దించింది. పాలస్తీనా స్వతంత్ర దేశం కాకుండా ఇజ్రాయెల్‌తో సంబంధాలు పెట్టుకుంటే పాకిస్థాన్ తీవ్రమైన అంతర్గత రాజకీయ సంక్షోభం, ప్రజాగ్రహం వ్యక్తమయ్యే ప్రమాదం ఉంది. అటు ట్రంప్ ప్రతిపాదనను తీవ్రంగా తిరస్కరించి అమెరికాతో ఆర్థిక, దౌత్యసంబంధాలను చెడ గొట్టుకోలేదు, ఇజ్రాయెల్‌ను గుర్తించి దేశంలో అలజడిని సృష్టించుకోలేక ఇరకాటంలో పడింది.



సఖి ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి సీతక్క, దానం నాగేందర్, అనీల్‌కుమార్‌యాదవ్, గద్వాల్ విజయలక్ష్మి తదితరులు.

# మహిళాభ్యున్నతితోనే తెలంగాణ పురోభివృద్ధి

## సఖి వన్‌స్టాప్ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి సీతక్క

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), మే 26, ప్రభాతవార్త:** మహిళాభ్యున్నతితోనే తెలంగాణ పురోభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి సీతక్క అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నంబరు 12లోని మిథిలానగర్‌లో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన సఖి వన్ స్టాప్ కేంద్రాన్ని మంగళవారం మంత్రి సీతక్క, రాజ్య సభ సభ్యుడు అనీల్‌కుమార్‌యాదవ్, స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి అవ కాశాల కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే మహిళలకు సురక్షితమైన వసతి కల్పించేందుకు ప్రభుత్వం వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లను ఏర్పాటు చేస్తుందన్నారు. మహిళల అభ్యున్నతిని జీర్ణించుకోలేని ప్రతిపక్షాలకు మహిళలే తగిన బుద్ధి చెబుతారన్నారు. వడ్డీలేని రుణాలు, రైసు మిల్లులు, పెట్రోల్ పంపులు, మహిళా సూపర్ మార్కెట్లు తదితర ఉపాధి అవకాశాలను మహిళా సంఘాలకు కల్పిస్తు న్నామన్నారు. ఒకప్పుడు ఖర్చు కోసం ఆధారపడే మహిళలు ఇప్పుడు ఇంటి ఖర్చులను భరించే స్థాయికే కాకుండా పిల్లల చదువులు, నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి చేరారన్నారు. మహిళా సంఘాల నేతృత్వంలో ఏర్పాటుచేసిన సోలార్ ప్లాంట్‌లను ఖమ్మం జల్లా మధిర నియోజకవర్గంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతులతో బుధవారం ప్రారంభిస్తామన్నారు. జూన్ 5న ముఖ్య మంత్రి మహిళలకు ఆర్టీసీ బస్సులు అందిస్తారన్నారు. జూన్ 2న ఇందిరమ్మ ఇళ్లు రెండోదళను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ ఛైర్మన్ గద్వాల్ విజయలక్ష్మితోపాటు స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితారాంచంద్రన్, డైరెక్టర్ శృతిఓజా తదితరులు పాల్గొన్నారు.

# ప్రొ. నాగేశ్వర్‌ను అరెస్టు చేస్తే తీవ్రపరిణామాలు

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ హెచ్చరిక

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ కె నాగేశ్వర్‌ను అరెస్టు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ హెచ్చరించారు. రాజకీయ విశ్లేషకులు, జర్నలిస్టు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫె సర్ కె. నాగేశ్వర్‌పై అక్రమంగా కేసు నమోదు చేసి, అరెస్ట్ చేయడానికి ఆంధ్ర ప్రదేశ్ పోలీసులు ప్రయత్నించడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుం దన్నారు. ఎపి పోలీసులు చేస్తున్న ఈ అక్రమ అరెస్ట్ ప్రయత్నాలను ప్రభుత్వం తక్షణమే అడ్డుకోవాలని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిజిపి వెంటనే జోక్యం చేసుకుని నాగేశ్వర్‌కు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ విశ్లేషకులుగా నాగేశ్వర్ సమాజంలో జరిగే పరిణామాలను, తమకు ఉన్న సమాచారాన్ని బట్టి విశ్లేషించడం, ప్రజాబాహుళ్యంలో చర్చలు చేయడం సహజమైన విషయ మన్నారు. ప్రశ్నించే గొంతుకైన నాగేశ్వర్‌నను అరెస్ట్ చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని జాన్‌వెస్లీ హెచ్చరించారు. నాలుగు దశాబ్దాలుగా సామాజిక, రాజ కీయ అంశాలపై నిష్పక్షపాతంగా, ప్రజా స్వామ్య దృక్పథంతో అభిప్రాయాలను వ్యక్తంచేస్తూ వస్తున్న విశ్లేషకుడు ప్రొఫెసర్ కె.నాగేశ్వర్‌పై ఆంధ్రప్రదేశ్‌లో నమోదైన కేసుల ఆధారంగా అరెస్టు చేయాలనే ప్రయత్నాలు జరుగుతున్నా యన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని, ఈ చర్యలను ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది.

# అక్రమంగా ప్రజా రవాణా చేస్తున్న ఇతర రాష్ట్ర టాక్సీ వాహనాలపై చర్యలు తీసుకోవాలి

## తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అక్రమంగా ప్రజా రవాణా చేస్తున్న ఇతర రాష్ట్ర టాక్సీ వాహనాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్(టిజిపిడబ్ల్యుయు) డిమాండ్ చేసింది. క్యాబ్ ధరల సవరణ కోరుతూ జూన్ మొదటి వారంలో రాష్ట్రవ్యాప్త బ్రేక్‌డౌన్ స్ట్రైక్ చేపట్టనున్నట్టు జేటీసీ ఎం. చంద్రశేఖర్ గౌడ్, అదనపు కార్మిక కమిషనర్ డాక్టర్ ఇ. గంగాధర్‌ని కలిసిన టిజిపిడబ్ల్యుయు ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. తెలంగాణలోని ఓలా, ఉబెర్, రాపిడో వంటి యాప్ ఆధారిత ప్లాట్‌ఫామ్‌లలో పనిచేస్తున్న క్యాబ్ డ్రైవర్లు నిరంతరం పెరుగుతున్న ఇంధన ధరలు, వాహన నిర్వహణ ఖర్చులు, పెరిగిన జీవన వ్యయం కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు టిజిపిడబ్ల్యుయు వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు షేక్ సలావుద్దీన్, జనరల్ సెక్రటరీ సీహెచ్ స్వామీ, ట్రెజరర్ కె ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల వాహనాల అక్రమ రవాణా, వైట్ ప్లేట్ (ప్రైవేట్) వాహనాల వినియోగంపై ఖచ్చితమైన సమాచారంతో కూడిన నివేదికను రవాణా శాఖ అధికారులకు సమర్పిస్తామన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తున్న అగ్రిగేటర్ సంస్థలకు, ఐటీ కంపెనీలకు తక్షణమే రవాణా శాఖ ద్వారా మెమోలు (నోటీసులు) జారీ చేయాలని, ఇతర రాష్ట్రాల వాహనాలపై కఠినమైన నిఘా పెట్టి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కోరారు. రాష్ట్రంలోని యాప్ ఆధారిత డ్రైవర్ల జీవనోపాధి, సంక్షేమాన్ని పరిరక్షించేందుకు తక్షణ జోక్యం చేసుకోవాలని కోరారు. క్యాబ్ ఛార్జీలు, డ్రైవర్లకు కిలోమీటర్‌కు చెల్లించే రేట్లను వెంటనే పెంచాలని, యాప్ ఆధారిత డ్రైవర్లందరికీ సంక్షేమ రక్షణతో పాటు న్యాయమైన పని పరిస్థితులు కల్పించాలని కోరారు.

# ఇక పాలమూరు పనుల భూసేకరణ వేగం

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** తెలంగాణ సర్కార్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు పుంజుకోనున్నాయి. వీలైనంత త్వరగా ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలన్న పట్టుదలతో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. అయితే అడుగడుగునా భూసేకరణ (ల్యాండ్ అక్విజిషన్) సమస్య ఎదురవుతుండడంతో చెక్ పెట్టేందుకు సిద్ధమైంది. ఎప్పటికప్పుడు సమీక్షలు జరుపుతూ, పెండింగ్ పనులను పరుగులు పెట్టించేందుకు స్పెషల్ ఫోకస్ పెట్టింది. ప్రాజెక్టుకు సంబంధించిన మెయిన్ కెనాల్స్ (ప్రధాన కాలువలు), పంప్ హౌస్‌లు, ఇతర కీలక నిర్మాణాలకు అవసరమైన భూమి దొరక్కపోవడం వల్లే పనులు ఆలస్యమవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. భూసేకరణ ప్రక్రియ సజావుగా సాగకపోవడంతోనే ప్రాజెక్టు అనుకున్న సమయానికి ముందుకు సాగలేదు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం తాజాగా జరిగిన కేబినెట్ భేటీలో దీనికి శాశ్వత పరిష్కారం చూపింది. భూమి కోల్పోతున్న రైతులను ఆదుకునేందుకు, వారికి నచ్చజెప్పి భూములు సేకరించేందుకు సర్కార్ రూ.587 కోట్ల భారీ నిధులను కేటాయించింది. ఈ నిధులతో భూములు ఇచ్చిన రైతులకు నష్టపరిహారం అందించడంతోపాటు వారికి పునరావాసం కల్పించడం, అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో అధికారులు ఇప్పుడు భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయడంపై దృష్టి సారించారు. భూసేకరణ విషయంలో రైతన్నలకు ఎలాంటి నష్టం జరగనివ్వొద్దని సీఎం అధికారులను ఖరాఖండిగా ఆదేశించారు. భూములు ఇచ్చే వారితో బలవంతం కాకుండా చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. అవసరమైతే రైతులతో ఒకటి రెండు సార్లు సమావేశమై, వారికి ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరించి, సరైన పరిహారం ఇచ్చి భూములు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. మొత్తానికి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేసి, ఆయా ప్రాంతాల రైతుల సాగునీటి కలలను నిజం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా ముందుకు కదులుతోంది.

# కోర్టు తీర్పు మేరకే పెద్దషాపూర్ భూముల విషయంలో తదుపరి నిర్ణయం

## స్పష్టం చేసిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా పెద్ద షాపూర్ భూముల విషయం హైకోర్టు పరిధిలో ఉన్నందున ఈఏడాది ఫిబ్రవరి 28న వెలువరించిన ఉత్తర్వులను రద్దు చేసే విషయంలో చట్ట ప్రకారం కోర్టు వెకేషన్ పూర్తయిన వెంటనే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి స్పష్టం చేశారు. పెద్ద షాపూర్ భూముల విషయంలో భారీగా అక్రమాలు జరిగాయన్న మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపణలపై మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ భూముల వివరాలను భూభారతి పోర్టల్‌లో ఎటువంటి మార్పులు చేయలేదన్నారు. జూన్ 12న పెద్ద షాపూర్ భూములపై కోర్టు విచారనుందని చెప్పారు. అప్పటి వరకు కోర్టు ఆదేశాల మేరకు భూములపై యథాతథ స్థితి కొనసాగుతుందని, శంషాబాద్ తహసిల్దార్ ఎటువంటి అనుమతులు , మ్యూటేషన్లు చేయరని తేల్చి చెప్పారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పెద్దశాపూర్ గ్రామం పరిధిలోని సర్వే నంబర్లు 172 నుండి 182 వరకు మొత్తం 170 గుంటల భూమి ఉందని పేర్కొన్నారు.

ఈ భూములు తొలుత పట్టా భూములుగా నమోదు అయ్యాయని, ఆ తర్వాత రాజేంద్రనగర్ డివిజన్‌ల్యాండ్ రిఫార్మ్స్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు ప్రస్తుతం 22ఏలో నమోదు అయ్యాయని వివరించారు. అయితే మహ్మద్‌యూసుఫుద్దీన్ ఖాన్‌తోపాటు మరో నలుగురు వ్యక్తులు హైకోర్టులో కేసు వేయడంతో కోర్టు ఆదేశాల మేరకు కక్షిదారులు అన్ని ఆధారాలు సమర్పించడంతో ఆయా సర్వే నంబర్లు 172 నుండి 183 వరకు ఉన్న 94.28 గుంటల భూమికి యజమానులుగా ప్రకటించామని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం ఒంకా కారియర్స్ మూవర్స్ సంస్థ కోర్టును ఆశ్రయించిందని, స్టేటస్ కో ఉన్న భూములను మినహాయించి మిగతా భూములపై పిటిషనర్ల పేర్లను మ్యుటేషన్ చేసి పట్టాదారు పుస్తకాలను జారి చేయాలని కోర్టు ఆదేశించిందన్నారు. ఆ తర్వాత మరోసారి తదుపరి ఆదేశాలు అందే వరకు ఆ భూములపై యథాతథ స్థితి కొనసాగించాలని, మ్యుటేషన్లు చేయొద్దని కోర్టు మరో ఉత్తర్వులు జారి చేసిందని వివరించారు. ప్రస్తుతం ఈ కేసు జూన్ 12న విచారణకు రానుందని, విచారణలో కోర్టు ఆదేశాల మేరకే నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

# రోడ్డు ప్రమాదంలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ఆర్టీసీ భరోసా

## ఉచిత ప్రమాదబీమా ద్వారా ఒక్కో కుటుంబానికి రూ. కోటి ఆర్థిక సహాయం

## చెక్కులను అందజేసిన సంస్థ ఎండి నాగిరెడ్డి




**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు యూనియన్ బ్యాంక్ సహకారంతో టీజీఎస్‌ఆర్‌టీసీ భరోసాకల్పిస్తూ, ఉచిత ప్రమాద బీమా ద్వారా ఒక్కో కుటుంబానికి రూ. కోటి ఆర్థిక సహాయం అందించనుంది. రోడ్డు ప్రమాదంలో విషాదం అలుముకున్న కుటుంబాలకు యూనియన్ బ్యాంక్ సహకారంతో ఆర్‌టీసీ అండగా నిలుస్తోంది. వివిధ సమయాల్లో విధి వంచించి అకాల మృత్యువు వెంటాడిన ఇద్దరు డ్రైవర్ల కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని అందించి భరోసా కల్పించింది. పికెట్, పరిగి డిపోలకు చెందిన డ్రైవర్లు సుధాకర్, శ్రీనివాసరెడ్డిలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఇంటికి పెద్ద దిక్కు మృతి చెందడంతో బాధిత డ్రైవర్ల కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆపద సమయంలో యూబీఐ (యూనియన్ బ్యాంక్) సూపర్ శాలరీ సేవింగ్ అకౌంట్ బాధిత కుటుంబాలకు అక్కరకొచ్చింది. సంస్థలోని ఉద్యోగులందరూ వారు నివసిస్తున్న ప్రాంతాల్లోని యూనియన్ బ్యాంక్ బ్రాంచీల్లో సంస్థ సూచించిన ఖాతాను తెరిచి రూపే కార్డులను తీసుకున్నారు. ఈ ఖాతా ద్వారా ఉచిత ప్రమాద బీమా సౌకర్యం ఉండటంతో ఉద్యోగులకు ఎంతో ఆర్థిక ప్రయోజనం చేకూరుతోంది. ఈ మేరకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు బాధిత కుటుంబాలు ఒక్కొక్కరికి రూ. కోటి విలువైన చెక్కులను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.రవీంద్రబాబు, రీజనల్ హెడ్ డి. వెంకటేశ్వర్లుతో కలిసి టీజీఎస్ ఆర్‌టీసీ వీసీ అండ్ ఎండీ వై.నాగిరెడ్డి మంగళవారం బస్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. ఎండీ నాగిరెడ్డి మాట్లాడుతూ, వేరు వేరు సమయాలలో జరిగిన ఈ రోడ్డు ప్రమాద ఘటనలో పికెట్ , పరిగి డిపోలకు చెందిన ఇద్దరు డ్రైవర్లు మరణించడం విచారకరమన్నారు. తమ తప్పు ఏమీ లేకపోయినా రోడ్డు ప్రమాదంలో డ్రైవర్స్ అకాల మరణం చెందటం దురదృష్టకరమన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి సంస్థ అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు ఆయన గుర్తు చేశారు. పోషణలో పెద్ద దిక్కు కోల్పోయిన కుటుంబ సభ్యులకు సంస్థ అండగా నిలుస్తుందని, ఆత్మ స్థైర్యం, ధైర్యం కోల్పోకుండా ఉండేందుకు బాధిత కుటుంబానికి ఉచిత ప్రమాద బీమా సౌకర్యం ఎంతో ఉపకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈడీ సిహెచ్.వెంకన్న, ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్ప, సీపీఎం ఉషాదేవి, యూబీఐ అధికారులు పాల్గొన్నారు.

# అప్పీల్ జాప్యంపై బరోడా బ్యాంక్ పిటిషన్ కొట్టివేత

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త :** అప్పీల్ దాఖలు చేయడంలో జరిగిన జాప్యాన్ని మన్నించడానికి నిరాకరిస్తూ డెట్ రికవరీ ట్రిబ్యునల్ (డీఆర్‌ఏటీ) ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ బ్యాంక్ ఆఫ్ బరోడా దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. వేలం కొనుగోలుదారుడి బిడ్ మొత్తాన్ని వడ్డీతో సహా తిరిగి చెల్లించాలన్న హైదరాబాద్‌లోని డెట్ రికవరీ ట్రిబ్యునల్ నిర్ణయంపై అప్పీలు దాఖలు చేయడంలో జరిగిన జాప్యాన్ని మన్నించడానికి కోల్‌కతాలోని డెట్ రికవరీ అప్పీలేట్ ట్రిబ్యునల్ నిరాకరించడాన్ని సవాలు చేస్తూ బ్యాంక్ ఆఫ్ బరోడా తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్ వేసింది. ఏప్రిల్ 29, 2024 నుండి ఎనిమిది వారాల లోపు డెట్ రికవరీ అప్పీలేట్ ట్రిబ్యునల్ ముందు అప్పీలు దాఖలు చేయాలంటూ హైకోర్టు గతంలో జారీ చేసిన ఆదేశాన్ని పాటించడంలో బ్యాంక్ విఫలమైందని హైకోర్టు డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. అయితే, బ్యాంక్ డిసెంబర్ 10, 2024న మాత్రమే ట్రిబ్యునల్‌ను ఆశ్రయించిందని, దీనివల్ల 224 రోజుల జాప్యం జరిగిందని కోర్టు పేర్కొంది. హైదరాబాద్‌లోని డెట్ రికవరీ ట్రిబ్యునల్ ఒక వేలం కొనుగోలుదారుడు జమ చేసిన రూ.4.64 కోట్లను, దానికి ఐదు శాతం సాధారణ వడ్డీని కలిపి తిరిగి చెల్లించాలని బ్యాంక్ ఆఫ్ బరోడాను ఆదేశించిన తర్వాత ఈ వివాదం తలెత్తింది. అప్పీలు చేసుకునే వెసులుబాటు కల్పించేందుకు హైకోర్టు గతంలో బ్యాంకుకు తాత్కాలిక ఉపశమనం కల్పించినప్పటికీ, నిర్దేశిత గడువులోగా బ్యాంక్ తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైందని బెంచ్ వ్యాఖ్యానించింది. సంస్థాగత ప్రక్రియలు, హైదరాబాద్ మరియు కోల్‌కతా కార్యాలయాల మధ్య ఫైళ్ల బదిలీ, న్యాయవాదుల వైఫల్యాల వల్లే జాప్యం జరిగిందని బ్యాంక్ ఇచ్చిన వివరణను తిరస్కరించిన కోర్టు, లిమిటేషన్ చట్టంలోని సెక్షన్ 5 ప్రకారం ఇవి సముచిత కారణాలు కిందకు రావని జస్టిస్ మోషుమి భట్టాచార్య, జస్టిస్ గాడి ప్రవీణ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం, తీర్పునిచ్చింది.

# ఆస్తి ఇచ్చినా అంత్యక్రియలకు రాలేదు..

## తల్లిని కడసారి చూడడానికి రాని కొడుకు

## చివరికి కర్మకాండ జరిపిన ఆడబిడ్డలు

## మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలో ఘటన



అంత్యక్రియలు నిర్వహిస్తున్న కూతుళ్లు, ఇన్‌సెట్- కొమ్ము చంద్రమ్మ (ఫైల్)

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 26, ప్రభాతవార్త:** కన్నతల్లిని కడసారి కూడా చూడడానికి ఆ కొడుకు రాలేదు.. తల్లి పేరు మీద ఉన్న పొలాన్ని తన పేరు చేయించుకున్నాడు.. అయినా అమ్మ మీద కనీసం జాలి కలగలేదు.. అమ్మ ఇక లేదు అన్న విషయాన్ని రక్తం పంచుకుని పుట్టిన తోబుట్టువులు చెప్పినా కడసారి చూపుకు కూడా నోచుకోలేదు.. ఇక చేసేదేమీ లేక కన్న బిడ్డలే అంత్యక్రియల తంతు చేసిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్‌లో చోటు చేసుకున్నది. కొమ్ము చంద్రమ్మ, కొమ్ము జంగయ్య దంపతులు నాగర్ కర్నూల్ జిల్లా పోతిరెడ్డిపల్లి వాసులు. వీరికి ముగ్గురు సంతానం. పెద్ద కుమార్తె నిమ్మల అన్నపూర్ణమ్మ, ఒక కుమారుడు కొమ్ము మల్లేష్, చిన్న కుమార్తె డి.వసంత ఉన్నారు. 14 ఏళ్ల కిందటే ఇంటి పెద్ద కొమ్ము జంగయ్య మరణించాడు. తదనంతరం చంద్రమ్మ తాను జీవితాంతం కష్ట పడి, ఆస్తిని పోగుచేసి తన సంతానానికి అంద జేయాలని కోరుకున్నది. ఈ క్రమంలో తన పేరా ఉన్న 12 ఎకరాల పొలంలో బిడ్డల పేరు మీద ఒక్కో ఎకరా చొప్పున రిజిస్ట్రేషన్ చేసి, 9 ఎకరాల పొలాన్ని తన కుమారుడు కొమ్ము మల్లేష్ పేరు మీద చేసింది. ఇంత చేసిన కుమారుడు కోడలు నుంచి తన బాధలు తప్పలేదు. తనను వేధిస్తున్నారంటూ ఇప్పటికే తిమ్మాజిపేట పోలీస్ స్టేషన్లో కేసు కూడా నమోదు అయినట్లు సమాచారం. తన కుమారుడు పట్టించుకోకపోవడంతో గత కొంతకాలంగా భూత్పూర్ లో నివాసం ఉంటున్నది. కుమారుడు పట్టించుకోకపోవడంతో అన్ని తామై బిడ్డలే చూసు కుంటున్నారు. చేదోడు వాదోడుగా ఉంటూ అవస రమైనప్పుడల్లా వైద్య సేవలు కూడా అందిస్తూ వచ్చారు. తల్లి అనారోగ్యం పాలైన కూడా ఏ ఒక్క రోజు వచ్చి చూసిన పా పాన పోలేదని బిడ్డలు ఆరోపిస్తున్నారు. ఆస్తిని పొంది కూడా కనీసం తల్లి బాగోగులు చూడలేదని స్థానికులు చెబుతున్నారు. అంతిమయాత్రకు రాలే.. చంద్రమ్మ సోమవారం ఉదయం నాలుగు గంటలకు తనువు చాలించింది. విషయం తెలుసుకున్న కుమార్తెలు అంతిమ యాత్ర తంతును వారే కొనసాగించారు. పెద్ద కుమార్తె అన్నపూర్ణమ్మ భూత్పూర్ రెండో వార్డు కౌన్సిలర్ గా ఉన్నారు. ఆమెనే ముందు నడిచి కార్యక్రమం అంతా పూర్తి చేశారు. ఆస్తి తగాదాలతో కన్న తల్లిదండ్రులకు కొరివి పెట్టని కొడుకులను చూసాం కానీ ఆస్తిలో భాగం తీసుకొని కూడా కనీసం అంతిమయాత్ర కు కూడా రాలేదని, కన్నతల్లిని కడసారి చూడడానికి కూడా రాలేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ విషయాన్ని తాము ప్రజావాణిలో కలెక్టర్ కు ఫిర్యాదు చేయనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# విద్యార్థులు, తల్లిదండ్రుల వ్యక్తిగత వివరాలు, మొబైల్ నంబర్లను ఎవరికీ ఇవ్వొద్దు

## అలా ఇస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవు

## అన్ని విద్యాసంస్థల యాజమాన్యాలకు పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ ఆదేశం

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులు వారి తల్లిదండ్రులకు సంబంధించిన వ్యక్తిగత వివరాలను ఇతరులు ఎవరికి ఇవ్వరాదని పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. అందుకు సంబంధించిన ప్రొసీడింగ్ ఆర్.సి. నెం. 59/పి.ఎస్.1/స్పెషల్./2026ను జారీ చేశారు. రాష్ట్రంలోని పాఠశాల విద్య జేడీ, డీఈవోలు, ప్రభుత్వ, స్థానిక సంస్థ, ఎయిడెడ్, ప్రైవేట్ సంస్థల ప్రధానో పాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ ఎవరు కూడా విద్యార్థుల మొబైల్ నంబర్లు, తల్లి దండ్రులు, సంరక్షకుల మొబైల్ నంబర్లు, ఇతర వ్యక్తిగత సమాచారం, విద్యా ర్థులకు సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ ప్రైవేట్ వ్యక్తులు, ప్రైవేట్ ఏజెన్సీలు,సంస్థలు, అనధికార వ్యక్తులతో పంచు కోరాదని, బహిర్గతం చేయరాదని స్పష్టం చేశారు. అధికారులు అందరూ అటువంటి సున్ని తమైన సమాచారం అత్యంత గోప్యంగా ఉంచాలన్నారు. అధికారులు ఆయా వివరాలను నిర్దేశించిన నియమ నిబంధనలకు అనుగుణంగా అధికారిక విద్యా ప్రయోజనం కోసం మాత్రమే ఉపయోగించాలని సూచించారు. విద్యా ర్థులు, తల్లిదండ్రుల డేటాను బహిర్గతం చేయడం, దుర్వినియోగం చేస్తే ఉల్లంఘనను తీవ్రంగా పరిగణించి, అమలులో ఉన్న నిబంధనల ప్రకారం సంబంధిత వ్యక్తులపై తక్షణ క్రమశిక్షణాచర్యలు తీసుకోబడతాయని పాఠశాల విద్య డైరెక్టర్ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

# బీడి ఆకు సేకరణ ధర పెంపు

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** బీడీ ఆకు (తునికి ఆకు) సేకరించే కార్మికులు, ఆదివాసీలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. తునికాకు ధరను రూ.3,400కు పెంచుతున్నట్లు ప్రకటించింది.ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారి చేసింది. ప్రతి స్టాండర్డ్ బ్యాగ్ (50 ఆకుల చొప్పున ఉండే 1000 కట్టలు)కు సేకరణ ధరగా ప్రస్తుతం రూ.3,300 చొప్పున చెల్లిస్తున్నారు. 2026 సేకరణ సీజన్ నుంచి ప్రస్తుత ధరకు అదనంగా రూ.100 చెల్లించనున్నారు. ఈ పెంపుతో బీడీ ఆకు సేకరించే వారికి ఆర్థికంగా లబ్ధి చేకూరనుంది. దాదాపు 10 లక్షల మందికి మేలు జరుగుతుంది.

# గణనీయమైన వృద్ధి నమోదు చేసిన ఖాదీ, గ్రామీణ పరిశ్రమల రంగం


## కెవిఐసి ఛైర్మన్ మనోజ్‌కుమార్

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తుల టర్నోవర్ తొలిసారిగా రూ.1.87లక్షల కోట్ల మార్కును దాటిందని ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్(కెవిఐసి) ఛైర్మన్ మనోజ్ కుమార్ వెల్లడించారు. ప్రధాని మోడీ నాయకత్వంలో ఉత్పత్తి, అమ్మకాలు, ఉపాధి రంగాల్లో ఖాదీ, గ్రామీణ పరిశ్రమల రంగం విశేష పురోగతి సాధించిందన్నారు. ఈ మేరకు మంగళవారం న్యూఢిల్లీలోని రాజ్‌ఘాట్, గాంధీ దర్శన్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో టర్నోవర్ తాత్కాలిక గణాంకాలను విడుదల చేశారు. 2013-14 ఆర్థిక సంవత్సరంలో రూ.31,154కోట్లు ఉన్న అమ్మకాల టర్నోవర్ 2025-26 నాటికి రూ.1,87,105కోట్లకు చేరుకుని 51శాతం వృద్ధిని నమోదు చేసిందన్నారు. అదే సమయంలో ఉత్పత్తి టర్నోవర్ రూ.26, 109కోట్ల నుండి 380శాతం పెరుగదల సాధించిందన్నారు. ఈ రంగంపై ఆధారపడి ఉపాధిపొందుతున్న వారి సంఖ్య 1.30కోట్ల నుండి 2.04కోట్లకు పెరిగిందన్నారు. ఈ విజయాలకు ఆత్మ నిర్భర్ భారత్, వోకల్ ఫర్ లోకల్, లోకల్ టు గ్లోబల్ తదితర కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలే ప్రధాన కారణమని మనోజ్‌కుమార్ స్పష్టం చేశారు. ఖాధీ వస్త్రాల ఉత్పత్తి 2013-14లోరూ.811కోట్లు నుండి 2025-26 రూ.3,974 కోట్లకు చేరిందన్నారు. ఇక అమ్మకాలు రూ.1081కోట్ల నుండి రూ.7,869కోట్లకు పెరిగాయన్నారు. ఖాదీ కళాకారులకు చెల్లించే పారితోషకం కూడా గణనీయంగా పెరిగిందన్నారు. 2013-14లో ఒక్క హాంక్‌కు రూ.4గా ఉన్న పారితోషకం 275శాతం వృద్ధితో ప్రస్తుతం రూ.15కు చేరిందన్నారు.

# ఎన్నికలు ముగియగానే ప్రజలపై పెట్రో బాదుడు సరికాదు

## సిపిఐ జాతీయ నేత చాడ వెంకట్‌రెడ్డి

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** దేశంలో ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే పెట్రోల్ డీజిల్‌పై రూ. 8 నుండి రూ.9 వరకు పెంచి సామాన్య ప్రజలపై మోయరానిబారాన్ని నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మోపిందని సీపీఐ సీనియర్ నాయకులు, మాజీ శాసనసభ్యులు చాడ వెంకట్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యుద్ధం గత మూడు నాలుగు నెలల నుండి నడుస్తున్నప్పటికీ ఐదు రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గెలుపే లక్ష్యంగా ఆయిల్ ధరలు పెంచలేదని, ఎన్నికలు ముగిసిన వెంటనే విడతల వారీగా ఆయిల్ ధరలు పెంచారన్నారు. ఎన్నికలలో గెలుపు కోసం బిజెపి ఎన్ని అడ్డదారులైనా తొక్కుతుందన్నారు. ఆయిల్ ధరలు పెంపు వలన అన్ని నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలకు ఇబ్బందులు కల్పిస్తున్నారు. ఆయిల్ కంపెనీలతో లోపాయి కారి ఒప్పందంతో ప్రజల కష్టాలను, కన్నీళ్లను చూడకుండా ధరలు పెంచారని వెంకట్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. దేశం లక్షల కోట్ల అప్పులో కూరుకపోయినా బిజెపికి కోట్ల రూపాయల డబ్బు ఎక్కడి నుండి వస్తుందని వారు ప్రశ్నించారు. డబుల్ ఇంజన్ సర్కార్, పారదర్శకమైన సర్కార్ అని చెబుతున్న బిజెపి పెద్దలు, ఇప్పుడు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. పెంచిన ఆయిల్ గ్యాస్ ధరలను తగ్గించకపోతే ప్రజాస్వామ్యంలో ప్రజలే గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.



అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న బండారు దత్తాత్రేయ, వి.హనుమంత రావు, తాటికొండ విక్రమ్‌గౌడ్, గుజ్జ కృష్ణ, మధుసూదనాచారి తదితరులు

# ఫీజులు ఇమ్మని బిసిలు ఎన్నేళ్లు అడుక్కోవాలి?

## పాత పద్ధతిలో ఫీజులు చెల్లించాలి

## అఖిలపక్ష సమావేశం డిమాండ్

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** 'ఫీజులు ఇవ్వమని ప్రభుత్వాలను బీసీలు ఎన్ని యేళ్లు అడుక్కోవాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం దోబూజులా డుతోంది. జీవో నెంబర్ 7ను రద్దుచేసి, పాత పద్ధతిలో ఫీజులు చెల్లించాల'ని రాష్ట్ర ప్రభుత్వాన్ని అఖిలపక్ష సమావేశం డిమాండ్ చేసింది. బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్ అధ్యక్షతన మంగళవారం కాచిగూడలో అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాజీగవర్నర్ బండారు దత్తాత్రేయ, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, బిఆర్ఎస్ శాసనమండలి పక్ష నాయకుడు ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, విద్యార్థి జేఏసీ ఛైర్మన్ వేముల రామకృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్, గణేష్‌చారి, టీజేఎస్ నేత జస్వంత్ కుమార్ తదితరులు పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల ఫీజు బకాయిల నిధులను గ్రీన్ చానల్ ద్వారా వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



## భూసేకరణ బాధితుల సమస్యలపై గవర్నర్‌ను కలిసిన కవిత

### ఖమ్మం, పరిగి, ఆర్‌ఆర్‌ఆర్ బాధితుల సమస్యలపై వినతిపత్రం సమర్పణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 26:** రాష్ట్ర ప్రభుత్వ భూసేకరణ కారణంగా నిరాశ్రయులైన బాధితులకు న్యాయం చేయాలని తెలంగాణ రక్షణ సమితి (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గవర్నర్‌ను కోరారు. మంగళవారం ఆమె ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్, పలువురు బాధితులతో కలిసి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను లోక్‌భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ఒక వినతిపత్రం సమర్పించారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఇళ్ల కూల్చివేతకు గురైన బాధితులందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని, పరిగి మండలం కద్లాపూర్‌లో ఇండస్ట్రియల్ పార్క్ కోసం జారీ చేసిన భూసేకరణ నోటీసును రద్దు చేయాలని వారు గవర్నర్‌ను కోరారు. అలాగే, రీజినల్ రింగ్ రోడ్ (ఆర్‌ఆర్‌ఆర్) అలైన్‌మెంట్ మార్పు, ఇతర భూసేకరణ సమస్యలను కూడా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు, గవర్నర్‌తో భేటీ అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మహిళల ఇళ్లను కూల్చివేస్తున్నారని, రేవంత్ రెడ్డి ఒక నిర్దయుడైన ముఖ్యమంత్రి అని, కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గమైన పాలన అందిస్తోందని ఆమె విమర్శించారు. వంద రూపాయల చీరలు పంచి బాధితులను లక్షాధికారులను చేశానని సీఎం అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. తమ పోరాటాల ఫలితంగా వెలుగుమట్ల బాధితులకు అదే స్థలంలో భూమి కేటాయించడానికి ప్రభుత్వం అంగీకరించిందని, పరిగి, ఆర్‌ఆర్‌ఆర్ భూసేకరణ ప్రక్రియలను నిలిపివేసిందని కవిత తెలిపారు. ఇవి పాక్షి క విజయాలని, సంపూర్ణ న్యాయం కోసం కేంద్రం ప్రమేయం అవసరమని, అందుకే గవర్నర్‌ను కలిశామన్నారు. గవర్నర్ సానుకూలంగా స్పందించారని, అన్ని అంశాలపై నివేదిక తెప్పించుకుని న్యాయం చేస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. బాధితులకు న్యాయం జరగని పక్షంలో మరోసారి ఉద్యమబాట పడతామని ఆమె హెచ్చరించారు.

## బిఆర్ఎస్ హయాంలో కన్నా ఎక్కువగా ధాన్యం కొనుగోళ్లు

### వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి

### వాస్తవానికి ధాన్యం కొనుగోళ్ల బాధ్యత కేంద్రానిదే

### అది మరిచి రాష్ట్ర ప్రభుత్వంపై బిజెపి విమర్శలు విడ్డూరం

### పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ హయాంలో కంటే యాసంగి ధాన్యం కొనుగోళ్లను కాంగ్రెస్ ప్రభుత్వమే ఎక్కువగా చేసిందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. పదేళ్ళ పాలనలో ఎంత ధాన్యం కొనుగోలు చేశారో లెక్కలు తెలుసుకుని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయాలని బిఆర్ఎస్ నేతలకు హితవు పలికారు. ఈ విషయమై హైదరాబాద్‌లో సోమవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతను నిర్వర్తించడం లేదని విమర్శించారు. కేంద్రం చెప్పిన మేరకు కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని, కాని కొనడం లేదని మండిపడ్డారు. వాస్తవాలు ఇలా ఉంటే ధాన్యం కొనుగోళ్లపై తెలంగాణ బిజెపి నేతలు కేంద్రంలోని సర్కారును నిలదీయాల్సింది పోయి యాత్రలు చేయడం ఏమిటి? అని బిజెపి పాలిత అన్ని రాష్ట్రాల కంటే ఎక్కువ ధాన్యం తెలంగాణ కొనుగోలు చేస్తోందని, తాము 70 లక్షల మెట్రిక్ టన్నులు కొంటున్నామని వివరించారు. వాస్తవానికి ఈ ధాన్యం మొత్తం కేంద్రమే కొనాల్సి ఉందన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 8,575 కొనుగోలు కేంద్రాల్లో వేగంగా కొనసాగుతోందన్నారు. రాష్ట్రంలో చివరి గింజవరకు ధాన్యం కొనుగోలు చేసి 48 గంటల్లో నిధులు జమ చేస్తున్నామని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 54 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేశామన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఏ రాష్ట్రం ఎంత ధాన్యం కొన్నారో ఆ పార్టీ తెలంగాణ బీజేపీ నాయకులు చెప్పాలని డిమాండ్ చేశారు. గతేడాది యాసంగితోపాటు ఈ ఏడాది యాసంగిలో ధాన్యం కొనుగోళ్ల కోసం బిఆర్ఎస్ హయాంలో కంటే 5వేల కోట్లు ఎక్కువగా ఖర్చు చేశామని స్పష్టం చేశారు.

## వడదెబ్బకు భక్తురాలు మృతి

**తిరుపతి,మే 26, ప్రభాతవార్తప్రతినిధి:** తిరుచానూరు పద్మావతిఅమ్మవారి ఆలయం వద్ద ఓ భక్తురాలు వడదెబ్బకు గురై ప్రాణాలు విడిచింది. ఈ విషాద సంఘటన మంగళవారం రాత్రి జరి గింది. ఉన్నఫళంగా ఆలయం ముందు భక్తురాలు కుప్పకూలి పడి పోయింది. తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం మూడవ గేటు వద్ద ఘటన జరిగింది. విజయవాడ, భవానిపురంకు చెందిన కృష్ణవేణి (28)గా గుర్తిం చారు. కుటుంబ సభ్యులతో కలిసి పద్మావతి అమ్మవారి దర్శనానికి వచ్చారు. ఉన్నట్లుండి కుప్ప కూలిన మహిళను ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందింది. గుండెపోటుతో మృతి చెందినదా.. వడదెబ్బ తగిలి మృతి చెందినదా, అనేది తెలియాల్సి ఉంది .మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు. భర్త ఫిర్యాదుతో కేసు నమోదు చేసి తిరుచానూరు ఎస్సై సుమతి విచారణ చేస్తున్నారు. దీంతో భక్తుల కుటుంబం తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది.

# ఇండో పసిఫిక్ ప్రాంతం చోదకశక్తిగా మారాలి

### క్వాడ్ కూటమి సదస్సులో జైశంకర్

**న్యూఢిల్లీ, మే 26:** ఇండోపసిఫిక్ ప్రాంతం ప్రపంచ వృద్ధికి, స్థిరత్వానికి ప్రధాన చోదకశక్తిగా కొనసాగాలని భారత విదేశాంగమంత్రి ఎస్‌జైశంకర్ ఆకాంక్షించారు. సముద్ర భద్రభారత్, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్ దేశాల కూటమి అయిన క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశం మంగళవారం ఢిల్లీలో జరిగింది. ఈ సమావేశానికి భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ నేతృత్వం వహించగా, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్, జపాన్ విదేశాంగ మంత్రి తోషిమిట్సు మొతేగి పాల్గొన్నారు. జైశంకర్ మాట్లాడుతూ ఆర్థిక స్వావలంబన, వ్యూహాత్మక నమ్మకాన్ని పెంపొందించ డంలో క్వాడ్ దేశాలు కలిసి పనిచేయాల్సి న అవసరం ఉందన్నారు. సరఫరా వ్యవస్థల్లో స్థిరత్వం, కనెక్టివిటీ అవరోధాలు, తయారీ రంగంలో కేంద్రీకరణ, కీలక మౌలిక సదుపాయాల లోపాలను పరిష్కరించడానికి భాగస్వామ్య దేశాలు మరింత లోతైన సహకారం పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రపంచ స్థాయిలో సరఫరా వ్యవస్థల బలోపేతం, కనెక్టివిటీ సమస్యలు, వనరుల కేంద్రీకరణ, మౌలిక సదుపాయాల్లో లోపాల వంటి సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంది. ఈ అంశాలన్నీ కొత్త భాగస్వామ్యాలకు దారి తీస్తాయని జైశంకర్ పేర్కొన్నారు. విశ్వసనీయ, పారదర్శక భాగస్వామ్యాల ద్వారానే ఇండో పసిఫిక్ ప్రాంతంలో శాంతి, అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. క్వాడ్ దేశాలు సముద్ర ప్రజాస్వామ్యాలు, బహుళత్వ సమాజాలు, మార్కెట్ ఆర్థిక వ్యవస్థలుగా ఒకే విధమైన బాధ్యతను పంచుకుంటున్నాయని జైశంకర్ అన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మాట్లాడుతూ, క్వాడ్ ఇప్పుడు కేవలం చర్చల వేదికగానే కాకుండా కార్యాచరణ దిశగా అడుగులు వేస్తున్న వ్యూహాత్మక భాగస్వామ్యంగా మారుతోందన్నారు. ఇంధన భద్రత, సరఫరా వ్యవస్థలు, కీలక ఖనిజాలు, సముద్ర రవాణా స్వేచ్ఛ వంటి అంశాల్లో క్వాడ్ పాత్ర మరింత కీలకమవుతోందని తెలిపారు. ఇటీవల ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకున్న పరిణామాలు క్వాడ్ ప్రాధాన్యాన్ని మరింత పెంచాయని పేర్కొన్నారు. తాను అమెరికా విదేశాంగ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే పాల్గొన్న తొలి సమావేశం క్వాడ్‌దేనని రూబియో గుర్తుచేశారు. అది ఈ కూటమిపట్ల అమెరికా నిబద్ధతను స్పష్టం చేసిందన్నారు.

ఢిల్లీలో నిర్వహించిన ఈ సమావేశానికి భారత్ ఆతిథ్యం ఇవ్వడాన్ని ఆయన అభినందించారు. ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్ మాట్లాడుతూ, ఇండో పసిఫిక్ ప్రాంతంలో దేశాల సార్వభౌమ నిర్ణయాధికారాన్ని కాపాడాల్సి న అవసరం ఉందన్నారు. స్వేచ్ఛాయుత, స్థిరమైన, సంపన్నమైన ఇండోపసిఫిక్ కోసం క్వాడ్ దేశాలు కలిసి పనిచేస్తాయని తెలిపారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ ఈ ప్రాంత రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తోందని ప్రశంసించారు. జపాన్ విదేశాంగ మంత్రి తోషిమిట్సు మొతేగి మాట్లాడుతూ, స్వేచ్ఛాయుత ఇండోపసిఫిక్ లక్ష్య సాధనలో క్వాడ్ ఒక ముఖ్య వేదికగా నిలుస్తోందన్నారు. ఇండోపసిఫిక్ దేశాలు ఆర్థిక భద్రత, వ్యూహాత్మక సామర్థ్యాలను పెంపొందించుకోవాల్సి న అవసరం ఉందన్నారు. క్వాడ్ దేశాల మధ్య సహకారాన్ని మరింత వేగవంతం చేయడంపై ఈ సమావేశంలో స్పష్టమైన చర్చలు జరగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇండో పసిఫిక్ ప్రాంతంలో చైనా దూకుడు, సముద్ర సరిహద్దుల వివాదాలు, వాణిజ్య ఒత్తిళ్లు పెరుగుతున్న నేపథ్యంలో క్వాడ్ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రాంతీయ స్థిరత్వం, సరఫరా వ్యవస్థల భద్రత, స్వేచ్ఛాయుత సముద్ర రవాణాపై క్వాడ్ దేశాలు మరింత దృష్టి సారిస్తున్నాయి.

## ఎన్డీయే 12 యేళ్ల పాలనపై దేశవ్యాప్త విస్తృత ప్రచారం

### ప్రధాని మోడీతోనే వికసిత్ భారత్ లక్ష్యసాధన

**న్యూఢిల్లీ, మే 26:** ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నిన్నటితో 12 సంవత్సరాలు పూర్తయిన దశాబ్ద కాలాన్ని సుపరిపాలన, అభివృద్ధి, జాతీయ పరివర్తనకు చిరునామాగా బీజేపీ అభివర్ణించింది. ఈ ఘనతను పురస్కరించుకుని, దేశవ్యాప్తంగా భారీ ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తమ ప్రభుత్వం సాధించిన 22 ముఖ్యమైన విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు కేంద్ర మంత్రులు, బీజేపీ ముఖ్యమంత్రులు, ఎంపీలు, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ 12 ఏళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల విస్తరణ, ఆర్థిక సంస్కరణలు, డిజిటల్ పాలన, విదేశాంగ విధానంలో సాధించిన విజయాలు, సామాజిక రంగంలో చేపట్టిన కార్యక్రమాలను ఈ ప్రచారం ద్వారా ప్రజలకు వివరించనున్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ మాట్లాడుతూ.. ప్రధాని మోడీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ 12 ఏళ్ల ప్రస్థానాన్ని సంకల్పం నుంచి సాఫల్యం వరకు సాగిన యాత్రగా అభివర్ణించారు. 2014 మే 26న ప్రారంభమైన ఈ శకం కేవలం ప్రభుత్వ మార్పు కాదు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం తిరిగి పొందిన ఆత్మవిశ్వాసం, సాంస్కృతిక పునరుజ్జీవనానికి చారిత్రక ఘట్టమని ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్ అనే మంత్రంతో పాటు అంత్యోదయ స్ఫూర్తితో ప్రభుత్వం పాలన సాగించిందని, సామాన్యుడి జీవితంలో మార్పు తెచ్చిందని అన్నారు. వికాస్ భీ, విరాసత్ భీ రెండింటినీ సమతుల్యం చేశారని, ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపడం ద్వారా దేశం ఇప్పుడు మరింత సురక్షితంగా ఉందని తెలిపారు. 2047 నాటికి వికసిత భారత్ నిర్మాణానికి ఈ 12 ఏళ్ల పాలనే బలమైన పునాది అని ఆయన పేర్కొన్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందిస్తూ 2014 మే 26న భారతదేశ అభివృద్ధి, నాగరిక ప్రస్థానంలో ఒక నూతన అధ్యాయం ప్రారంభమైందని అన్నారు. ఆర్థికాభివృద్ధి, సామాజిక సంక్షేమం నుంచి ఆత్మనిర్భర్ భారత్, డిజిటల్ పరివర్తన వరకు, మౌలిక సదుపాయాల నుంచి బలమైన జాతీయ భద్రత వరకు ప్రతి రంగంలోనూ దేశం అపూర్వమైన వేగంతో పురోగమించిందని ఆయన వ్యాఖ్యానించారు. దేశ వృద్ధి ఇప్పుడు మరింత విస్తృతమైనదిగా, సమ్మిళితమైనదిగా మారింద న్నారు. మోడీ ఒక నిజమైన ప్రధాన్‌సేవక్ అని కొనియాడారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ గడిచిన 12 ఏళ్ల సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమానికి అంకితమైనవని అన్నారు. ఒకప్పుడు దేశం ఎదుర్కొన్న విధానాల పక్షవాతం నుంచి బయటపడి ఖసంస్కరణ, పనితీరు, పరివర్తన మంత్రంతో ముందుకు సాగుతోందని చెప్పారు. ఈ కాలాన్ని భారతదేశ పునర్నిర్మాణానికి, ప్రజా సంక్షేమానికి ఒక స్వర్ణయుగంగా అభివర్ణించారు. జన్‌ధన్ ఖాతాల నుంచి ఆయుష్మాన్ భారత్ వరకు, పీఎం ఆవాస్ యోజన నుంచి డిజిటల్ ఇండియా వరకు ఎన్నో పథకాలతో ప్రధాని మోదీ అభివృద్ధి, సంక్షేమాలలో కొత్త అధ్యాయాన్ని లిఖించారని ప్రశంసించారు.



ఫైల్ ఫొటో

## హైదరాబాద్‌లో మరో కొత్త జిసిసి కేంద్రం

### ముందుకొచ్చిన రీజెనరాన్

### ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:** అత్యున్నత స్థాయి మౌలిక సదుపాయాలు, ప్రతిభావంతులతో కూడి ట్యాలెంట్ పూల్ అందుబాటులో ఉండటం వల్ల ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు తమ గ్లోబల్ సామర్థ్య కేంద్రాల (జిసిసి) ఏర్పాటుకు హైదరాబాద్‌ను ఎంపిక చేసుకుంటున్నాయిని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. జిసిసిల రాకతో మన ఐటి ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని ఆయన అన్నారు. న్యూయార్క్‌లోని ట్యారిటౌన్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న బయోటెక్ దిగ్గజం రీజెనరాన్ అమెరికా వెలుపల మొదటి జిసిసిని ఏర్పాటు చేయడానికి తెలంగాణా రాష్ట్రాన్ని ఎంపిక చేసుకోవడం మన ప్రతిష్ఠను మరింత పెంచుతుందని ఆయన సంతోషం వ్యక్తం చేసారు. రీజనరాన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బ్యారీ కోవల్ ఆధ్వర్యంలో ఒక ప్రతినిధి బృందం మంగళవారం సచివాలయంలో ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో బేటీ అయింది. ఈ సందర్భంగా మంత్రి సమక్షంలో జిసిసి ఏర్పాటుకు సంబంధించి బ్యారీ కోవల్. తెలంగాణా లైఫ్ సైన్సెస్ సిఇఒ సర్వేశ్ సింగ్‌లు అవగాహన పత్రాల (ఎంఒయు)ను మార్చుకున్నారు. అనంతరం శ్రీధర్ బాబు మాట్లాడుతూ రెజెనరాన్‌కు ఐర్లాండ్, యూకే, జర్మనీ, నెదర్లాండ్స్ వంటి దేశాల్లో కార్యాలయాలు, ఉత్పత్తి కేంద్రాలు ఉన్నప్పటికీ, హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న జిసిసి ప్రత్యేకమైన గ్లోబల్ హబ్‌గా పనిచేస్తుందని తెలిపారు.. ఇది ప్రపంచవ్యాప్తంగా సంస్థ కార్యకలాపాలను సమన్వయం చేస్తూ క్లినికల్ ట్రయల్స్ నిర్వహణ, అధునాతన డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇంజినీరింగ్, కమర్షియల్ అనలిటిక్స్ వంటి అత్యున్నత స్థాయి డిజిటల్ సేవలను అందిస్తుందని చెప్పారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో దాదాపు 450 గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు పనిచేస్తుండగా, మరిన్ని అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులకు ముందుకు వస్తున్నాయని శ్రీధర్ బాబు తెలిపారు. జిసిసిల కేంద్రంగా ముంబయి, ఢిల్లీ, చెన్నైలను అధిగమించి హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచిందని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, డిజిటల్ టెక్నాలజీల రంగాల్లో ఉన్న బలమైన ఎకోసిస్టం ప్రపంచ కంపెనీలను ఆకర్షిస్తోందన్నారు. తెలంగాణ ప్రభుత్వం పరిశోధన, తయారీ రంగం, పారిశ్రామిక విధానాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని శ్రీధర్ బాబు తెలిపారు. జీనోమ్ వ్యాలీ విస్తరణ, త్వరలో ఏర్పాటు కానున్న గ్రీన్ ఫార్మా సిటీ వంటివి రాష్ట్ర లైఫ్ సైన్సెస్ రంగాన్ని మరింత బలోపేతం చేస్తాయని చెప్పారు. రెజెనరాన్ సంస్థ ఏర్పాటు చేయనున్న గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ ద్వారా రాబోయే సంవత్సరాల్లో పెద్ద సంఖ్యలో ఉన్నత స్థాయి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని మంత్రి పేర్కొన్నారు. ప్రపంచంలో ప్రముఖ బయోటెక్నాలజీ సంస్థల్లో ఒకటైన రెజెనెరాన్ ఇప్పటికే అనేక ఔషధాలను అభివృద్ధి చేసి ప్రపంచవ్యాప్తంగా సేవలు అందిస్తోందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో రెజెనెరాన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బ్యారి కోవాల్, రెజెనెరాన్ జిసిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజీవ్ ఒనాట్, సంస్థ ప్రతినిధులు, పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# నేడు, రేపు టిడిపి మహానాడు



అమరావతిలో సిద్ధమైన మహానాడు వేదిక

### క్లస్టర్ల వారీగా వర్చువల్ సమావేశాలు

### క్షేత్రస్థాయి కార్యకర్తలతో ఎపి సిఎం చర్చాగోష్టి

### హైబ్రిడ్ పద్ధతిలో పార్టీ వార్షికోత్సవాలు

### వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో ఎపి మంత్రి లోకేష్

**విజయవాడ,మే26, ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మక వార్షిక ఉత్సవం 'మహానాడు' ఈసారి సరికొత్త డిజిటల్ చరిత్రకు వేదిక కానుంది. ఆర్థిక భారం తగ్గించాలన్న ప్రధాని మోదీ పిలుపునకు స్పందిస్తూ, నెల్లూరులో నిర్వహించాలనుకున్న భౌతిక సభను రద్దు చేసుకుని 'హైబ్రిడ్ విధానం'లో ఈ వేడుకను నిర్వహించేందుకు పార్టీ సిద్ధమైంది. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణంతో నెలకొన్న విపత్కర పరిస్థితుల దృష్ట్యా, నెల్లూరు వేదికగా 3 రోజుల పాటు నిర్వహించాలనుకున్న భౌతిక మహానాడును దేశ శ్రేయస్సు కోరి పార్టీ రద్దు చేసుకుంది. ఆ స్థానంలో సాంకేతికతను జోడించి డిజిటల్ వేదికగా నిర్వహించాలని వ్యూహాత్మక నిర్ణయం తీసుకుంది. అమరావతిలోని ఎన్టీఆర్ భవన్‌లో పరిమిత సంఖ్యలో అగ్రనేతలతో భౌతికంగా మహానాడు జరుగుతుంది. దీనికి అనుసంధానంగా రాష్ట్రవ్యాప్తంగా 1,848క్లస్టర్లను ఏర్పాటు చేశారు. నియోజక వర్గాలు, మండల కేంద్రాల్లో భారీ ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా కేంద్ర కార్యాలయ వేదికను అనుసంధానించి కార్యకర్తలను నేరుగా ఉత్సవంలో భాగస్వాములను చేయనున్నారు. యువనేత నారా లోకేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టాక తొలిసారి జరుగుతున్న మహానాడు ఇది. ఆయన అనుభవంతో సుమారు 2వేల క్లస్టర్ల రీచ్‌తో దేశ చరిత్రలోనే రికార్డు సృష్టించేలా ఈ హైబ్రిడ్ మహానాడును డిజిటల్ శకంలోకి నడిపిస్తున్నారు. రెండేళ్ల పాలనా విజయాలతోపాటు వచ్చే మూడేళ్లలో ఏంచేస్తామో మహానాడు వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు చాటి చెప్తారని మంత్రులు తెలిపారు.

మంగళగిరిలోని తెలుగుదేశం కేంద్ర కార్యాలయంలో 27, 28 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి మహానాడు ఏర్పాట్లను మంత్రులు పయ్యావుల కేశవ్, అనిత, అనగాని సత్యప్రసాద్, సవిత పరిశీలించారు. స్త్రీశక్తి థీమ్‌తోపాటు, కార్యకర్తే అధినేత అనే నినాదం ఈసారి హైబ్రిడ్ విధానంలో జరిగే మహానాడులో ప్రతిబింబిస్తుందని ఆర్థికశాఖమంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు.

**చర్చలు, తీర్మానాలు. కార్యాచరణ:** రెండు రోజుల మహానాడులో ఏయే అంశాలపై తీర్మానాలు ప్రవేశపెట్టాలనే దానిపై పార్టీలో ఇప్పటికే కసరత్తు జరిగింది. ఈ ఏడాది చేపట్టనున్న మహానాడును స్త్రీ శక్తి థీమ్‌తో నిర్వహించాలని ఇప్పటికే నిర్ణయించుకున్న క్రమంలో మహానాడు వేదికగా జరగబోయే ప్రసంగాలు మహిళ శక్తి కేంద్రీకృ తంగా ఉండే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇదే సమయంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి కావస్తున్నందున్న వచ్చే ఎన్నికలకు రోడ్ మ్యాప్ సిద్ధం చేసుకునే దిశగా టీడీపీ అధినాయకత్వం మహానాడు వేదికగా దిశా నిర్దేశం చేసే సూచనలున్నాయి. దీంతోపాటు స్థానిక సంస్థల ఎన్నికలకు శ్రేణులను సమాయత్తం చేయనున్నారు. మహానాడు తొలిరోజున టీడీపీ జాతీయ అధ్యక్షులు సీఎం చంద్రబాబు బుధవారం ఉదయం 09.00 గంటలకు పార్టీ కేంద్ర కార్యాలయానికి వెళ్తారు.

## అసహజ జనాభా మార్పులపై అధ్యయన కమిటీ

### సరిహద్దు అక్రమ వలసలపైనా అధ్యయనం

### కేంద్ర హోంమంత్రి అమిత్‌షా



**న్యూఢిల్లీ, మే 26:** దేశంలో అక్రమ వలసలు, అసాధారణ జనాభా మార్పులపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జనాభా మార్పులను పర్యవేక్షించేందుకు కేంద్రం ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా మంగళవారం ప్రకటించారు. అక్రమ చొరబాట్లు, ఇతర కారణాల వల్ల జరుగుతున్న అసహజ జనాభా మార్పులు కారణంగా దేశ సార్వభౌమత్వం, జాతీయ భద్రత, సామాజిక సమతుల్యత, గిరిజన సమాజాల రక్షణకు పెద్ద సవాలుగా మారాయని పేర్కొన్నారు. ఈ కమిటీ ఏర్పాటుకు ప్రధాని నరేంద్ర మోడీ 2025 ఆగస్టు 15న చేసిన ప్రకటన ఆధారమని అమిత్ షా తెలిపారు. దేశవ్యాప్తంగా జనాభా మార్పుల ధోరణులను అధ్యయనం చేసి ముఖ్యంగా అక్రమ వలసలు, ఇతర అసాధారణ కారణాల వల్ల సంభవిస్తున్న మార్పులను విశ్లేషించడం కమిటీ ప్రధాన బాధ్యతగా వివరించారు. ఈ ఉన్నతస్థాయి కమిటీకి రిటైర్డ్ జస్టిస్ ప్రకాశ్ ప్రభాకర్ నౌలేకర్ ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. మాజీ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా, మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, ఆర్థికవేత్త డాక్టర్ శామికా రవి సభ్యులుగా ఉండనున్నారు. అలాగే జనగణన కమిషనర్ కూడా కమిటీలో సభ్యుడిగా ఉంటారు. కేంద్ర హోంశాఖలోని ఫారినర్స్ విభాగ జాయింట్ సెక్రటరీ సభ్య కార్యదర్శిగా వ్యవహరించనున్నారు. దేశంలోని మత, సామాజిక వర్గాల వారీగా అసాధారణ జనాభా పెరుగుదల నమూనాలను కమిటీ సమగ్రంగా పరిశీలించనుంది. అలాగే సమస్య పరిష్కారానికి సమయపాలిత కార్యాచరణ ప్రణాళికను రూపొందించి కేంద్రానికి సిఫార్సులు చేయనుంది. జనాభా మార్పు అనేది కేవలం సార్వభౌమత్వానికి సంబంధించిన అంశమే కాదు. ఇది జాతీయ భద్రత, శాంతిభద్రతలు, సామాజిక నిర్మాణం, గిరిజన సమాజాల పరిరక్షణకు కూడా నేరుగా సంబంధించిన విషయమని అమిత్ షా పేర్కొన్నారు. అయితే కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా రాజకీయ చర్చలకు దారితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా సరిహద్దు రాష్ట్రాల్లో అక్రమ వలసలు, జనాభా మార్పుల అంశం ఎప్పటికప్పుడు రాజకీయంగా వివాదాస్పదంగా మారుతోంది. ప్రతిపక్షాలు ఇపుడు ఈ అంశాన్ని తమకు అనుకూలంగా మలుచుకునే అవకాశం లేకపోలేదు.

# కాంగ్రెస్ హయాంలో సింగరేణి స్కామ్‌లకు గనిలా మారింది




### బొగ్గు ఉందో లేదో పరిశీలన కోసం అఖిలపక్షాన్ని తీసుకెళ్లండి

### తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం సమావేశంలో హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే26:** సింగరేణిలో రూ.16 వందల కోట్ల విలువైన బొగ్గు మాయమైందని బిఆర్ఎస్ మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి.హరీశ్‌రావు ఆరోపించారు. 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు ఎక్కడో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించాలని డిమాండ్ చేశారు. బొగ్గు ఉందో? లేదో? పరిశీలన కోసం అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను కోరారు. కాంగ్రెస్ హఠావో సింగరేణి బచావో.. బొగ్గు గని కార్మికుల నినాదం కావాలని హరీష్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో సింగరేణి స్కాంలకు గనిలా మారిందని అభివర్ణించారు. నైనీ బ్లాక్ బొగ్గు గనుల టెండర్.. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని బయట పెట్టిందన్నారు. త్వరలో సింగరేణిపై కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలు మరిన్ని బయటపెడతానని హరీష్‌రావు స్పష్టం చేశారు.. ఆనాడు చంద్రబాబు నాయుడు సింగరేణిలో ఉద్యోగాలు తీసేస్తే. కేసీఆర్ 19 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చి జీవం పోశాడు. ఉద్యోగాలు ఇచ్చుడు బిఆర్ఎస్ పని అయితే , ఉన్న ఉద్యోగాలను తొలగించడం కాంగ్రెస్ పని అని వ్యాఖ్యానించారు. సింగరేణిలో అందిన కాడికి కాంగ్రెస్ దోచుకుంటుంది. నైని బ్లాక్ విషయంలో కొందరు జర్నలిస్ట్ లు జైలు వెళ్ళే పరిస్థితి వచ్చింది. సింగరేణికి కేటాయించాల్సి న డ్యూస్ అడ్డగోలుగా పెరిగిపోతుంది అని చెప్పారు. కరెంట్ విషయంలో సింగరేణికి కేటాయించాల్సి న 20 వేల కోట్ల డ్యూస్ పెండింగ్ లో ఉంది. రాష్ట్ర ప్రభుత్వ ఓడి కేవలం 3,200 కోట్లు రాష్ట్ర ప్రభుత్వ ఓడి కంటే సింగరేణి ఓడి రూ. 4 వేల కోట్లు. ఫిక్స్ డిపాజిట్లు ఉండాల్సి న సింగరేణి ఈరోజు ఓడికి పోయిందన్నారు. రాజస్థాన్ తో కలిసి పాకిస్థాన్ బోర్డర్ లో జై షల్మీర్‌లో సింగరేణితో సోలార్ పవర్ ప్లాంట్ పెట్టేందుకు సిద్ధమయ్యారు. ఎన్‌టిపిఎస్ అత్యంత చౌకగా విద్యుత్ ఇచ్చేందుకు సిద్ధమైతే ఈ ప్రభుత్వం ఒప్పుకోవడం లేదన్నారు. సోలార్ పవర్ ప్లాంట్ టెండర్‌లో మొబిలైజేషన్ అడ్వాన్సులు పెట్టి, కమిషన్‌లు దండుకుంటున్నారు అని ఆరోపించారు. ఫుట్ బాల్ సోకుల కోసం సింగరేణి డబ్బులు రేవంత్ రెడ్డి వాడుకున్నాడు. బంగారు బాతులాంటి సింగరేణిని అప్పుల కుప్పగా ఈ ప్రభుత్వం మార్చిందని ఆరోపించారు. బొగ్గు గనుల్లో అవినీతి జరుగుతుందని బిఆర్ఎస్ లేవనెత్తితే కేంద్రం ఒక కమిటీ వేసిందని, కమిటీ ఏం తేల్చిందో పబ్లిక్ డొమైన్ లో పెట్టాలని ఆయన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని డిమాండ్ చేశారు. అలాగే రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌పై వేసిన సస్పెన్షన్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ శాఖలో వేల కోట్ల రూపాయిల అవినీతి జరుగుతోందంటూ ఈ సందర్భంగా హరీష్ రావు తీవ్ర ఆరోపణలు గుప్పించారు.

# చెరువు జాడ కనిపెట్టి.. కబ్జాలను చెదరగొట్టి


ఈదులకుంట చెరువులో మట్టిని తొలగిస్తున్న దృశ్యం

- 4వేల కోట్ల విలువైన భూమికి 'హైడ్రా' ఫెన్సింగ్
- మాదాపూర్‌లో 6.05 ఎకరాల ఈదులకుంట కబ్జాలకు కట్టడి
- కోకాపేట కొత్త చెరువులో 22 ఎకరాల ఆక్రమణల తొలగింపు
- ఒకే రోజు దాదాపు 34 ఎకరాల భూమిని కాపాడిన హైడ్రా

**హైదరాబాద్, మే 26,ప్రభాతవార్త:** చెరువుల కబ్జాలను హైడ్రా సీరియస్‌గా పరిగణించింది. మంగళవారం ఒకే రోజు రెండు చెరువులను హైడ్రా కాపాడింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ విలేజ్‌లో కబ్జాదారులు మాయం చేసిన 6.05 ఎకరాల ఈదులకుంట జాడను కనిపెట్టింది. ఆ పక్కనే ఉన్న 5.16 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా కబ్జాల చెరనుంచి విముక్తి కల్పించింది. అలాగే గండిపేట మండలంలోని కోకాపేట గ్రామంలోని కొత్త చెరువు మధ్యలోంచి బండ్ నిర్మించి ఎగువ ప్రాంతాన్ని కబ్జా చేయాలనే రియల్టర్ల ప్రయత్నాలకు బ్రేకులు వేసింది. కొత్త చెరువులో మొత్తం 22 ఎకరాల భూమిని హైడ్రా కాపాడింది. రెండు చోట్ల హైడ్రా ఫెన్సింగ్ వేసి దాదాపు రూ. 4 వేల కోట్ల విలువైన భూమి కబ్జాల పాలవ్వకుండా హైడ్రా రక్షించింది. స్థానికుల ఫిర్యాదుల మేరకు క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖలతో పరిశీలించి చెరువుల కబ్జాలను హైడ్రా అధికారులు నిర్ధారించుకున్నారు.ఐటీ కారిడార్‌లోని మాధాపూర్‌లో చెరువును మాయం చేయాలనే కబ్జాదదారుల ప్రయత్నాలను హైడ్రా అడ్డుకుంది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ విలేజ్ సర్వే నంబరు 7లో ఉన్న 6.05 ఎకరాల ఈదులకుంటను కబ్జాల చెర నుంచి విడిపించింది. శిల్పారామం ఎదురుగా ఉన్న తమ్మిడికుంట నిండితే వరద కాలువ ద్వారా ఈదుల కుంటకు నీరు చేరేది. ఆ కాలువను డైవర్ట్ చేయడంతో ఈదుల కుంటకు వరద నీరు చేరకుండా చేశారు. చెరువు రూపురేఖలు మార్చేసి.. హద్దులు చెరిపేసి... ఇక భవన నిర్మాణాలే ఆలస్యం అనుకున్న తరుణంలో స్థానికులు హైడ్రాను ఆశ్రయించారు. తమ్మిడికుంట ఈదులకుంట సున్నం చెరువులుగా గొలుసుకట్టుగా ఉన్న వాటిలో ఈదుల కుంట మాయమోతోందని హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీనిపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కూడా కేసు నమోదయ్యింది. స్థానికుల ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన హైడ్రాకు అక్కడ చెరువు ఆనవాళ్లు కనిపించాయి. గ్రామ, రెవెన్యూ రికార్డుల మేరకు 6.05 ఎకరాల చెరువున్నట్టు నిర్ధారించుకుంది. ఇదే విషయాన్ని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ శాటిలైట్ చిత్రాలు కూడా నిర్ధారించాయి. దీంతో మంగళవారం చెరువు హద్దులు నిర్ధారించి ఫెన్సింగ్ వేసింది. 6.05 ఎకరాల ఈదులకుంటకు తోడు.. ఆ పక్కనే సర్వే నంబరు 11/37లో ఉన్న 5.16 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా హైడ్రా కాపాడింది. మొత్తం 11.21 ఎకరాల భూమిని కాపాడినట్టు అయ్యింది. ఇలా మొత్తం మాధాపూర్‌లోనే దాదాపు రూ. 1800 కోట్ల విలువైన భూమిని హైడ్రా మంగళవారం కాపాడింది. ఈ భూమి చుట్టూ హద్దులు నిర్ధారించి ఫెన్సింగ్ వేస్తోంది. రెండు మండలాల సరిహద్దుల్లో ఉండడం కబ్జాదారులకు ఈదులకుంటతో పాటు.. పక్కనే ఉన్న ప్రభుత్వ భూమి వరంగా మారింది. కూకట్‌పల్లి మండలం, కూకట్‌పల్లి గ్రామంలో చెరువు లేందంటూ కబ్జాదారులు చూపించారు. ఇదే సమయంలో శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ విలేజ్‌లో 6.05 ఎకరాల చెరువు ఉంది. ఒకవేళ ఓవర్‌ల్యాప్ అయినా.. చెరువును ఎవరూ మార్చలేరు. ఈ వివాదాన్ని పరిష్కరించడంలో ఇరు మండలాల అధికారులు చొరవ చూపాలి. అది జాప్యం జరగడంతో ఇదే అదనుగా ఎన్‌వీఎన్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ చేతివాటం చూపించింది.

# ఒడిదుడుకుల్లో తెలంగాణ ఖజానా

## వ్యయం, ఆదాయం మధ్య భారీ అంతరం

## రెవెన్యూతో పాటు, అప్పుల్లోనూ పెరుగుదల

## మూడేళ్లలో సమకూరిన రూ.5.45 లక్షల కోట్లు

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:**తెలంగాణ ప్రభుత్వ ఖజానాకు వస్తున్న ఆదాయంలో వృద్ధి నమోదైంది. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఈ ఏడాది మార్చితో ముగిసిన 2025-26 ఆర్థిక సంవత్సరాంతానికి రాష్ట్రానికి వచ్చిన ఆదాయం మొత్తం రూ.5,45,085.89 కోట్లుగా ఉంది. అయితే ఏటేటా ఖర్చులు పెరుగుతున్నాయి కానీ రాబడి మాత్రం అందుకు తగిన విధంగా పెరగడం లేదనేది ఆర్థిక శాఖ, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ లెక్కలు చూస్తే వెల్లడవుతున్నాయి. బడ్జెట్ పత్రాలలో వేస్తున్న అంచనాలకు వాస్తవ రాబడికి మధ్య భారీ తేడా ఉంటోంది. సొంత ఆదాయ వనరుల విషయంలో వేసిన అంచనాలకు, వస్తున్న ఆదాయానికి మధ్య పెద్ద అంతరం కనిపిస్తోంది. ఫలితంగా అధికంగా అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రానికి వచ్చే ఆదాయంలో ట్యాక్స్ రెవెన్యూనే కీలకం. కానీ ఆర్థిక కార్యకలాపాలు మందగించడంతో ఆదాయం తగినంతగా రావడం లేదన్న అభిప్రాయం కూడా ఉన్నది. నిర్మాణ రంగం ఊపందుకుంటే రిజిస్ట్రేషన్ల ఆదాయం పెరగడమే కాకుండా, జీఎస్టీ, సేల్స్ ట్యాక్స్, ఇన్ కం ట్యాక్స్ ద్వారా ఖజానాకు వచ్చే ఆదాయం పెరుగుతుంది. ఈ రెండున్నరేళ్లలో వేసిన అంచనాల కంటే ఆదాయం తక్కువగా ఉందని ఆర్థిక శాఖ లెక్కలు చెపుతున్నాయి. ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వానికి అప్పులు తేవడంపై కేంద్రీకరించాల్సిన తప్పనిసరి పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇక తెలంగాణలో సాఫ్ట్‌వేర్ ఇండస్ట్రీ, మెడికల్ హబ్, ఇన్ ఫ్రాస్ట్రక్చర్ తరువాత ప్రధాన గ్రోత్ ఇంజిన్ రియల్ ఎస్టేట్, భవన నిర్మాణ రంగం ఉన్నాయి. 2022-23లో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ నుంచి వచ్చిన ఆదాయం 91.21 శాతం ఉండగా 2023-24లో 77.27 శాతానికి, 2024-25లో 46.48 శాతానికి తగ్గిపోయింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.18,228.82 కోట్ల ఆదాయం రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి వస్తుందని భావిస్తే కేవలం రూ.8,473.21 కోట్లు వచ్చి 79.90 శాతానికి పెరిగింది. అలాగే ట్యాక్స్ రెవెన్యూ ద్వారా వచ్చే ఆదాయం వేసిన అంచనాలు, వచ్చింది చూస్తే అధికారంలోకి వచ్చిన ఏడాది 2023-24 ఆర్థిక సంవత్సరంలో (2023 డిసెంబర్ నుంచి మార్చి 2024 వరకు)రూ.50,833.16 అంచనాలకు రూ.48, 456.23 కోట్లు రాగా, 2024-25లో రూ.1,64,397.64 అంచనాలకు రూ.1,36, 283.47 కోట్లు, 2025-26 లో రూ.1.75, 319.16కు గాను రూ.1,52,400.91 కోట్లు వచ్చాయి. ఈ విధంగా మూడేళ్లలో మొత్తం రూ.3,90, 549.96 కోట్ల అంచనాలకు గాను రూ.3,37, 140.61 కోట్లు ఆదాయం వచ్చింది. ఇది కాకుండా నాన్ ట్యాక్స్ రెవెన్యూ (పన్నేతర ఆదాయం)తో పాటు, కేంద్రం ఇచ్చే గ్రాంట్ ఇన్ ఎయిడ్ కలిసి 2023 డిసెంబర్ నుంచి 2026 మార్చి వరకు రూ.70,422.45 కోట్ల ఆదాయం వచ్చింది. 2023 డిసెంబర్ నుంచి 2026 మార్చి వరకు పన్నేతర ఆదాయం, కేంద్రం ఇచ్చిన గ్రాంట్ ఇన్ ఎయిడ్ వివరాలు చూస్తే 2023-24లో రూ.4,294.81 పన్నేతర ఆదాయం, కేంద్రం నుండి రూ.5,197.17 కోట్లు గ్రాంట్లుగాను, 2024-25లో రూ.23,607.77 కోట్లు, రూ.7,913.08 కోట్లు, 2025-26లో రూ.18,986.64 రూ.10,422.98 కోట్లు కాగా, మూడేళ్లలో మొత్తంగా రూ.46,889.22 కోట్ల పన్నేతర ఆదాయం, మరో రూ.23, 533.239 కోట్లు కేంద్రం నుండి గ్రాంటులుగా సమకూరాయి. ఈ విధంగా అన్నీ కలిపి మొత్తం రాష్ట్ర ఖజానాకు వివిధ మార్గాలు వచ్చిన ఆదాయం 2023 డిసెంబర్ నుంచి 2026 మార్చి వరకు ట్యాక్స్ రెవెన్యూ రూ.3,37,140. 61 కోట్లు, పన్నేతర ఆదాయం రూ.46, 889.22 కోట్లు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూ.23,533.23 కోట్లు, సేకరించిన రుణం రూ.1,37,522.83 కోట్లు కలిపి మొత్తం ఆదాయం రూ.5,45,085.89 కోట్లుగా ఉన్నాయి.

### అమెరికాలో గుజరాతీ మహిళపై

# దుండగుడి కాల్పులు..

## స్పాట్‌లోనే మహిళ మృతి

**రిచ్‌మండ్(వర్జీనియా), మే 26:** అమెరికాలో మరో భారతీయ సంతతి మహిళ దారుణ హత్యకు గురయ్యారు. వర్జీనియాలోని ఓ సూపర్‌మార్కెట్‌లో పనిచేస్తున్న గుజరాత్‌కు చెందిన మహిళపై దుండగుడు కాల్పులు జరిపి హతమార్చాడు. దోపిడీ యత్నంలో ఈ ఘాతుకం జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.మృతురాలిని మేఘనాబెన్ పటేల్ (45)గా గుర్తించారు. ఆమె గుజరాత్‌లోని మెహసానా జిల్లా, విసాపూర్ తాలూకాలోని జంత్రాల్ గ్రామానికి చెందినవారు. గత పదేళ్లుగా వర్జీనియాలోని ఈ సూపర్‌మార్కెట్‌లో ఆమె పనిచేస్తున్నారు. మేఘనాబెన్ తల్లిదండ్రులు కర్సన్‌భాయ్ పటేల్, కపిలాబెన్ ప్రస్తుతం జంత్రాల్ గ్రామంలోనే నివసిస్తున్నారు. ఈ దారుణ ఘటన మొత్తం స్టోర్‌లోని సీసీటీవీ కెమెరాలో రికార్డయింది. వీడియోలోని దృశ్యాల ఆధారంగా.. జంతువుల చర్మం ప్రింట్ ఉన్న ప్యాంటు, గ్రే జాకెట్ ధరించిన ఓ వ్యక్తి ముఖానికి ముసుగుతో స్టోర్‌లోకి ప్రవేశించాడు. ఆ సమయంలో స్టోర్‌లో జనం ఎవరూ లేరు. అతను నేరుగా కౌంటర్ వద్దకు వచ్చి మేఘనాబెన్‌తో మాటలు కలిపాడు. కొద్దిసేపటి తర్వాత అనూహ్యంగా జేబులోంచి తుపాకీ తీసి ఆమెపై కాల్పులు జరిపాడు. కాల్పులతో ఆమె కిందపడిపోగానే, నిందితుడు అంతటితో ఆగలేదు. కౌంటర్ పైనుంచి దూకి ఆమెపైకి వంగి మరిన్ని రౌండ్లు కాల్పులు జరిపినట్లు వీడియోలో స్పష్టంగా కనిపించింది. అనంతరం నిందితుడు వచ్చిన దారిలోనే పరారయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. నిందితుడిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. మేఘనాబెన్‌కు భర్త ఉపేంద్రభాయ్ పటేల్, కుమార్తె నక్షిబెన్, కుమారుడు స్మిత్ ఉన్నారు. ఈ ఘటనతో అమెరికాలోని భారతీయ సమాజంలో విషాదం నెలకొంది.

# నేను నా కుమార్తెను కోల్పోయా మమతా బెనర్జీ తన కుర్చీని కోల్పోయారు

## ఆర్జీకర్ మృతురాలి తల్లి ఎమ్మెల్యే విమర్శలు

**కోల్‌కత్తా, మే 26:** పశ్చిమ బెంగాల్‌ను కుదిపేసిన ఆర్జీ కర్ అత్యాచారం, హత్య కేసులో బాధితురాలి తల్లి, బీజేపీ ఎమ్మెల్యే రత్న దేబ్‌నాథ్ సీఎం సువేందు అధికారిని కలిశారు. సచివాలయంలో జరిగిన ఈ సమావేశం అనంతరం ఆమె మాజీ సీఎం మమతా బెనర్జీ రాజకీయ ఓటమిని ప్రస్తావిస్తూ సోషల్ మీడియాలో ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆర్జీకర్ వైద్య కళాశాలలో తన కుమార్తెపై హత్యాచారం జరిగిన ఘటనపై రత్న దేబ్‌నాథ్ కుమార్తె తల్లిగా న్యాయపోరాటం చేస్తూ, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పానిహటి నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. సీఎంతో భేటీ తర్వాత సోషల్‌మీడియాలో రత్న దేబ్‌నాథ్ ఒక పోస్ట్ చేశారు. ఈరోజు నేను నబన్నా (సచివాలయం) 14వ అంతస్తులో ముఖ్యమంత్రితో సమావేశంలో ఉన్నాను. ఆయన పేరు సువేందు అధికారి. నిజాయతీకి ఉన్న శక్తి అపారం. అన్యాయంపై ఓపికగా పోరాడితే చాలని పేర్కొన్నారు. ఈరోజు నేనూ, మమత ఇద్దరం నష్టపోయాం. నేను నా ఏకైక కుమార్తెను కోల్పోయి ప్రజాసేవకు అంకితమయ్యాను. మమత 14వ అంతస్తులోని తన సీఎం కుర్చీని కోల్పోయారని అన్నారు. మమత, ఆమె బృందం మరింత దారుణమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని, వేచి చూడండి అంటూ హెచ్చరించారు. సమావేశం అనంతరం రత్న దేబ్‌నాథ్ మీడియాతో మాట్లాడుతూ తాను ఎమ్మెల్యే అయినా తన జీవితంలో సంతోషం లేదని, కుమార్తెకు న్యాయం జరగడమే తన ఏకైక లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కేసుకు సంబంధించి తాను అనుమానిస్తున్న కొందరి పేర్లను ముఖ్యమంత్రికి అందజేశానని, గతంలో దర్యాప్తు అధికారులకు కూడా అవే పేర్లు ఇచ్చానని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా ఏర్పడిన బీజేపీ ప్రభుత్వం ఈ కేసు విచారణను వేగవంతం చేసింది. ఆర్జీకర్ ఘటన సమయంలో కీలక పదవుల్లో ఉన్న ఐపీఎస్ అధికారులు వినీత్ గోయల్, ఇందిరా ముఖర్జీ, అభిషేక్ గుప్తాలపై శాఖాపరమైన విచారణకు సీఎం సువేందు అధికారి ఆదేశించారు. విచారణ పూర్తయ్యే వరకు వారిని సస్పెండ్ చేశారు. కాగా, ఈ కేసు దర్యాప్తు కోసం సీబీఐతో ముగ్గురు సభ్యుల ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని కలకత్తా హైకోర్టు గతంలోనే ఆదేశించిన సంగతి తెలిసిందే.

# వ్యవసాయరంగాన్ని కుదేలు చేస్తోన్న కోతుల బెడద

## రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల ఆందోళన

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త :** తెలంగాణలో కోతుల సమస్య రాష్ట్ర వ్యవసాయ రంగాన్నే కుదిపేస్తున్న పెను సమస్య అని పర్యావరణ వేత్తలు, రైతు సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. వానరాల బెడద కారణంగా రైతులు వ్యవసాయాన్ని, గ్రామాలను వదిలిపెట్టి వలసపోయే ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు తెలంగాణ సమాఖ్య ఆధ్వర్యంలో "కోతుల బెడదకు చెక్ పెట్టాలి.. రైతాంగాన్ని కాపాడాలి" అనే అంశంపై హైదరాబాద్‌లో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సదస్సులో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి, రైతు స్వరాజ్య వేదిక నాయకులు కన్నెగంటి రవి, ప్రొఫెసర్ దొంతి నరసింహారెడ్డి తదితరులు పాల్గొని తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 11 జిల్లాలో కోతుల బెడదా తీవ్రంగా ఉందని నల్గొండ, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ తదితర జిల్లాల్లోని ప్రతీ మండలంలో కోతులు సమస్య ఉందని చెప్పారు. కోతుల దాడుల వల్ల పంట నష్టమే కాకుండా, ప్రాణనష్టం జరిగిన ఘటనలు కూడా ఎన్నో ఉన్నాయన్నారు. కోతుల బాధలు తాళలేక రైతులు తమ సొంత డబ్బులు వేసుకుని ఒక్కో కోతికి రూ. 500 చొప్పున ఇస్తూ కోతులు పట్టే వారిని పిలిపించుకుంటున్నారని, అయితే వారు ఈ ఊరిలో పట్టిన కోతులను తీసుకెళ్లి పక్క ఊరి సరిహద్దుల్లో వదిలేస్తుండడంతో సమస్య ఒకరి నుంచి మరొకరికి బదిలీ అవుతోంది తప్ప శాశ్వత పరిష్కారం దొరకడం లేదన్నారు. పదేళ్లుగా కోతుల సమస్య తీవ్రమోతోందే తప్ప పరిష్కారం దొరకడం లేదని వక్తలు అన్నారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో వరి సాగవుతోందనే లెక్కలు చూసి వ్యవసాయం అంతా బాగుందని ప్రభుత్వం భ్రమిస్తోందని, కానీ క్షేత్రస్థాయిలో రైతుల అగచాట్లు పాలకులకు తెలియడం లేదని మండిపడ్డారు. అడవిలో ఒక కోతికి కడుపు నిండాలంటే 10 నుండి 12 గంటలు శ్రమించాలని, కానీ గ్రామాల్లో, ఇళ్లల్లో దూరినా, లేదా పంట పొలాలపై పడినా ఒకే గంటలో వాటి కడుపు నిండుతోందని, దాంతో వానరాలు జనావాసాల వైపు వస్తున్నాయని వివరించారు. హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ రాష్ట్రాల్లో మాదిరిగా తెలంగాణలోనూ కోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని లేదంటే వ్యవసాయరంగ దశ దిశ మారిపోయే ప్రమాదం ఉందన్నారు.

# ప్రజల హక్కుల పరిరక్షణ బాధ్యత అందరిపైన ఉంది: ప్రొఫెసర్ ఎం.కోదండరామ్

**సైఫాబాద్, మే 26 ప్రభాతవార్త:** అన్ని వర్గాల ప్రజలకు ప్రజా కళాకారులు కీలకమని ఎమ్మెల్సీ. తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ చెప్పారు. గతంలో కొనసాగిన ఫ్యూడల్ వ్యవస్థ వల్ల మనిషి స్వేచ్ఛగా జీవించే హక్కును కోల్పోయారని, ప్రస్తుతం ప్రజల భావోద్వేగాలను ఆసరాగా చేసుకుని రెచ్చగోట్టె కుట్రలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన తెలంగాణ ప్రజా నాట్యమండలి 4వ రాష్ట్ర మహాసభలో ప్రతినిధుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. ప్రజల హక్కుల పరిరక్షణ బాధ్యత మన అందరిపైన ఉందని, నాటి కళాకారుల చరిత్ర, త్యాగాలను తెలుసుకుని నేటి యువ కళాకారులు ధైర్యంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజాన్ని మెల్కోలిపి చైతన్యం చేసే విధంగా కళాకారులు తమ సాంస్కృతిక దృష్టి కోణాన్ని మలుచుకుని కళారూపాలను రూపొందించుకోవాలని సూచించారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నర్సింహ్మా మాట్లాడుతూ మతోన్మాద శక్తులు మత విద్వేషాలను రెచ్చగోట్టి ప్రజల మధ్య వైషమ్యాలను సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో కళాకారులు అప్రమత్తంగా ఉండాలని, పాటలు ద్వారా ప్రజలను చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రధానంగా సోషల్ మీడియా ద్వారా కళా ప్రదర్శనలిస్తూ ప్రజలను చైతన్యవంతం చేయడమే ముఖ్యమన్నారు. మతోన్మాదుల అగడాలను తరిమికోట్టెందుకు ప్రజా కళాకారులు తమ పాటలను మరింతగా విస్తృతం చేయాలని సూచించారు. ఈసభలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కన్నం లక్ష్మీనారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేన శంకర్, ఎస్.ఛాయాదేవి, ఇఫ్టా జాతీయ కౌన్సిల్ సభ్యుడు కె.స్వామి, ప్రజా నాట్యమండలి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాస్, పల్లె నర్సింహ్మా, నాయకులు పడాల నళిని, నెర్లకంటి శ్రీకాంత్ తదితరులు

# లైసెన్స్‌డ్ సర్వేయర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

## తెలంగాణ రెవెన్యూ లైసెన్స్ పొందిన సర్వేయర్ల సంఘం నేతల విజ్ఞప్తి



ఆత్మగౌరవ సభలో నినాదాలు చేస్తున్న లైసెన్స్‌డ్ సర్వేయర్స్ అసోసియేషన్ నేతలు

**ధర్నాచౌక్, మే 26, ప్రభాతవార్త:** లైసెన్స్‌డ్ సర్వేయర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని తెలంగాన రెవెన్యూ లైసెన్స్ పొందిన సర్వేయర్ల సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ రెవెన్యూ లైసెన్స్‌డ్ సర్వేయర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో కనీస పని కల్పించాలి, గౌరవ వేతనం ప్రకటించాలి, మాది గొంతమ్మ కోరిక కాదు, గౌరవప్రదమైన హక్కు అంటూ ఆత్మగౌరవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నగర రమేష్, ప్రధాన కార్యదర్శి కొమ్ము శేఖర్‌లు మాట్లాడుతూ లైసెన్స్‌డ్ సర్వేయర్లకు కమీషన్ ఆధారిత జీతాలకు బదులుగా ప్రాథమిక నెలవారీ జీతం అందించాలని విజ్ఞప్తి చేశారు. లైసెన్స్ పొందిన సర్వేయర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సంక్షేమ పథకాలను అమలుచేయాలని, సర్వేయర్ల వ్యవస్థను బలోపేతం చేయటానికి, సర్వేయర్ల హక్కులను పరిరక్షించటానికి చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, లైసెన్స్‌డ్ సర్వేయర్లకు గౌరవ వేతనం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రంగు శివకుమార్, కోశాధికారి కొల్లూరి రాజేష్,


ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఎదుగాని బాలకృష్ణ, సతీష్, కన్వీనర్ సందీప్ మరియు 33 జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన లైసెన్స్‌డ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

# పశ్చిమబెంగాల్‌లో మమతకు షాక్!

### 100 మందికిపైగా కౌన్సిలర్లు రాజీనామా

**కోల్‌కత్తా, మే 26:** పశ్చిమ బెంగాల్‌లో తాజాగా జరిగిన ఎన్నికల్లో బీజేపీ చేతిలో ఘోర పరాజయం పాలైన తృణమూల్ కాంగ్రెస్ టీఎంసీ క్రమంగా సంక్షోభంలో కూరుకుపోతోంది. తాజాగా దాదాపు వంద మంది టీఎంసీ కౌన్సిలర్లు తమ పదవులకు రాజీనామా చేయడంతో పార్టీకి కష్టాలు మరింత పెరిగాయి. క్షేత్ర స్థాయిలోని కల్లోలం సీనియర్ నాయకులలోనూ కనిపిస్తోంది. పలువురు బహిరంగంగానే మమతా బెనర్జీ నాయకత్వాన్ని ధిక్కరిస్తున్నారు. టీఎంసీ చరిత్రలోనే ఇది అత్యంత క్లిష్టమైన సమయంగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తృణమూల్ లో సంక్షోభం ఒకప్పుడు తిరుగులేని శక్తిగా వెలుగొందిన తృణమూల్ కాంగ్రెస్, ఒక్క ఓటమితో పూర్తిగా బలహీనపడినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. బెంగాల్ ఎన్నికల ఓటమి తర్వాత లోక్‌సభ ఎంపీ కకోలి ఘోష్ దస్తిదార్ వంటి సీనియర్ నేతలు తమ అసంతృప్తిని బహిరంగంగా వెళ్లగక్కుతున్నారు. మరోవైపు టీఎంసీ నియంత్రణలో ఉన్న స్థానిక సంస్థల్లో పెద్ద ఎత్తున రాజీనామాలు జరుగుతున్నాయి. గత కొన్ని రోజులుగా వివిధ మునిసిపాలిటీలకు చెందిన సుమారు 100 మంది కౌన్సిలర్లు రాజీనామాలు సమర్పించారు. ఈ రాజకీయ ప్రకంపనలు టీఎంసీ ఆధీనంలో ఉన్న మున్సిపల్ కార్పోరేషన్లు, మున్సిపాలిటీల్లో బీజేపీకి బలపడే అవకాశాన్ని కల్పిస్తున్నాయి. స్థానిక ఎన్నికలకు ముందే రాజీనామాల పర్వం రాజకీయ సంక్షోభం తీవ్రత ఎంతగా ఉందంటే, వచ్చే ఏడాది స్థానిక ఎన్నికలకు జరగకముందే పలు మునిసిపల్ బోర్డులు రద్దు అయ్యే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి.

# రూ.5కే చేపలకూరతో భోజనం బెంగాల్‌లో సువేందు ఆహారభరోసా!



**కోల్‌కత్తా, మే 26:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ ప్రభుత్వాలు ఏర్పాటుచేస్తున్న తరహాలోనే బెంగాల్ ప్రభుత్వం కూడా ఐదు రూపాయలకే నాన్ వెజ్ భోజనం అందించనున్నట్లు ప్రకటించింది. ఐదు రూపాయలకే చేపల కూర లేదా ఫ్రై తో కలిపి అన్నం అందిస్తారు. బెంగాల్ సీఎం సువేందు అధికారి మాట్లాడుతూ త్వరలోనే ఈ పథకాన్ని అమలు చేయబోతున్నట్లు ప్రకటించారు. పశ్చిమ బెంగాల్‌లో ప్రభుత్వ ఆధ్వర్యంలో గత ఫిబ్రవరిలో మా క్యాంటీన్లను ఏర్పాటు చేశారు. ఇందులో సబ్సిడీపై పేద ప్రజలకు రూ.5కే భోజనం అందిస్తున్నారు. ఇకపై వీటిలో రూ.5లకే చేపల కూర లేదా ఫ్రై తో భోజనం ఇవ్వాలని సీఎం ఆదేశించారు. అన్నం, చేప కలిపి రూ.5కే అందిస్తారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు ఈ క్యాంటీన్లు నడుస్తాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 400 క్యాంటీన్లు ఉండగా, త్వరలో వీటి సంఖ్యను పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. బీజేపీ ప్రభుత్వం చేపల కూర అందించడానికి రాజకీయ కారణాలు కూడా ఉన్నాయి. బీజేపీ అధికారంలోకి వస్తే బెంగాల్‌లో ప్రజలు నాన్ వెజ్ తినలేరని, గుడ్డు, చేపలు కూడా మర్చిపోవాల్సిందే అని అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా టీఎంసీ ఆరోపించింది. పశ్చిమ బెంగాల్‌లో బిజెపి నాన్ వెజ్‌ను నిషేధిస్తుందని తెలిపింది. ఈ ఆరోపణల్ని అప్పట్లోనే బీజేపీ ఖండించింది. పైగా రాష్ట్ర బీజేపీ నేతలు పలు చోట్ల చేపల కూరతో ఫెస్టివల్స్ నిర్వహించారు. చేపలు పట్టుకుని మరీ ప్రచారం చేశారు. తాము నాన్ వెజ్‌కు వ్యతిరేకం కాదని చెప్పారు. తాము సొంతంగా పాలిస్తున్న రాష్ట్రాలతోపాటు, కూటమి ప్రభుత్వాలు ఉన్న చోట కూడా మాంసాహారంపై ఎలాంటి నిషేధం లేదని బీజేపీ బదులిచ్చింది. బెంగాల్‌లో కూడా ఎలాంటి నిషేధం విధించబోమని తెలిపింది. అందుకే ఇప్పుడు ఏకంగా రూ.5కే ఏకంగా నాన్ వెజ్‌తో భోజనాన్ని అందించాలని బిజెపి ప్రభుత్వం నిర్ణయించింది.

# పంట అవశేషాలను కాల్చొద్దు

## రైతుల్లో అధికారులు అవగాహన కల్పించాలి: మంత్రి తుమ్మల

హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:సాగు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పంట అవశేషాలను కాల్చే విధానాన్ని పూర్తిగా మానుకోవాలని రైతులకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం రైతునేస్తం కార్యక్రమంలో సచివాలయం నుండి పాల్గొన్న మంత్రి... పంట వ్యర్థాలను కాల్చడం ద్వారా జరిగే అనర్థాలు, యూరియా సరఫరా సమస్యలు, ఎల్‌నినో ప్రభావం, పంటల ఎంపిక, భూసారం పరిరక్షణ తదితర అంశాలపై విస్తృతంగా మాట్లాడారు. అవగాహన లేక పోవడం, తదుపరి పంట త్వరగా వేసు కోవాలనే ఉద్దేశ్యంతో రైతులు వరి, మొక్కజొన్న, ఇతర పంట అవశేషాలను కాల్చుతున్నారని తెలిపారు. ఈ ప్రక్రియ రైతుల సాగు భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తుందని హెచ్చరించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల నేలలోని సేంద్రియ పదార్థం పూర్తిగా నాశనమై భూసారం తగ్గిపోతుందని, నేలలోని సహజ పోషకాలు దెబ్బతింటాయని చెప్పారు. ఫలితంగా పంటలకు వేసే యూరియా, పురుగుమందులు సరిగా పనిచేయవని, దిగుబడి గణనీయంగా తగ్గిపో తుందని హెచ్చరించారు. పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలియదున్నడం ద్వారా నేల సారం పెరుగుతుందని, సేంద్రియ శక్తి పెరిగి పంటలకు మంచి ఫలితాలు వస్తాయని మంత్రి పేర్కొన్నారు. ఇందుకోసం అవసరమైన వ్యవసాయ యంత్రాలు, పనిముట్లను వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద సబ్సిడీపై అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇకపై ఎవరైనా రైతులు పంట అవశేషాలు కాల్చినట్లు గుర్తిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. శాటిలైట్ సాంకేతికత ద్వారా పంట అవశేషాలు ఎక్కడ కాల్చుతున్నారో గుర్తించి, సంబంధిత రైతులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయంలో వ్యవసాయ అధికారులు కూడా అత్యంత అప్రమత్తంగా ఉండాలని, గ్రామస్థాయిలో రైతులకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా.. యూరియా సరఫరా విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిపై మంత్రి తుమ్మల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ఇవ్వాల్సిన యూరియాను కూడా కేంద్ర ప్రభుత్వం సరైన సమయంలో అందించలేక పోతుందని మండిపడ్డారు. ఖరీఫ్ సీజన్ అవసరాల కోసం గత నవంబర్ నెల నుంచే పదేపదే విజ్ఞప్తులు చేసినప్పటికీ, కేంద్రం యూరియా సరఫరాలో నిర్దిష్ట ప్రణాళిక లేకుండా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు.

దేశంలో యూరియా ఉత్పత్తి చేయడం, రాష్ట్రాలకు సరఫరా చేయడం పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. అయినప్పటికీ రాష్ట్ర బిజెపి నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం అన్యాయమన్నారు.

## పలు జిల్లాల్లో అకాల వర్షాలు

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:**ఉదయం నుంచి నిప్పులు భానుడి భగభగలతో నిప్పుల కొలిమిని తలపించిన వాతావరణం మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా చల్లబడి పలు జిల్లాల్లో అకాల వర్షాలు కురిపించింది. సాయంత్రం భూపాలపల్లి, మంచిర్యాల, పెద్దపల్లి, హనుమకొండ, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల్లో ఒక్కసారిగా నల్లటి మేఘాలతో నిండిపోయింది. చూస్తుండగానే బలమైన ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. పలు జిల్లాల్లో మంగళవారం సాయంత్రం వర్షాలకు తీవ్రమైన ఎండల నుంచి ఆయా జిల్లాల ప్రజలు ఉపశమనం పొందగా పలు ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిముద్దయింది. గాలివాన బీభత్సానికి భూపాలపల్లి జిల్లా చిట్యాలలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న ఒక భారీ వృక్షం ఒక్కసారిగా నేలకొరిగింది.



# చిన్న నవ్వే చాలు !

ఏడాది పాటు పుస్తకాలతో కుస్తీ

**రోజులో 10 గంటలు కార్యాలయాల్లోనే గడిచిపోతున్న గజిబిజి జీవితాలు మనవి. మరి మనిచేసే చోట సంబంధాలు ఎంత అనుకూలంగా ఉంటే చుట్టూ అంత సానుకూలంగా ఉంటుంది అంటే కాదంటారా? మరి అలాంటి వాతావరణాన్ని ఎవరూ తెచ్చిపెట్టరు. మనకు మనమే సాధించుకోవాలి. ఎలా అంటే..**

★ అనుకూల వాతావరణాన్ని రూపొందించడానికి, అదరినీ ఆకట్టుకోవడానికి పెద్దపెద్ద కసరత్తులు చేయాల్సిన పనేం లేదు. మంచి పలకరింపు, చిరునవ్వు, మనకంటే తక్కువస్థాయిలో ఉన్నవాళ్లకు పనిలో మెలకువలు చెబుతూ, పెద్దవాళ్లు ఇచ్చే సలహాలు పాటిస్తే చాలు. పనిసాఫీగా సాగిపోతుంది. ★ చిన్నవాళ్లైనా పెద్దవాళ్లైనా వారి ప్రత్యేక రోజుల్ని గుర్తుపెట్టుకుని శుభాకాంక్షలు చెప్పండి. వీలుంటే కేక్ కట్ చేయించి ఒక చిన్న పార్టీ వాతావ రణాన్ని క్రియేట్ చేయండి.మళ్లీ వచ్చే సంవత్స రం దాకా మరచి పోరు సరికదా. మనపట్ల అభిమానమూ, గౌరవమై పెరుగుతాయి. ★ తోటి ఉద్యోగులు పనిని త్వరగా, సమర్థవంతంగా పూర్తిచేసినప్పుడు మెచ్చుకోండి. అవసరమైతే వారిని ఎలా చేశా వంటూ అడిగి తెలుసుకోండి. దీనివల్ల ఇరువురిమధ్యా స్నేహమూ బలపడు తుంది. రోజులో ఎక్కువ సమయం గడిపేచోట స్నేహపూరిత వాతావరణమా, లేదా వైరంతో ఎడముఖం, పెడముఖంతో అనేది మనమీదే ఆధారపడి ఉంటుంది. మరి ఒక్కసారి ప్రయత్నించి చూడండి. □

# ప్రత్యక్ష ప్రయోగాలతో..



పట్టిన పిల్లలకు ఆటవిడుపు వినోదాన్నే కాదు. విజ్ఞానాన్నీ అందిస్తే బాగుంటుంది కదా! చిన్న చిన్న సైన్స్ ప్రయోగాలు వారిలో కొత్త విషయాలను తెలుసుకోవాలన్న ఉత్సాహాన్ని ఇస్తాయి. ఉదాహరణకు వినెగర్‌తో బేకింగ్ సోడా చర్య జరిపినప్పుడు కార్బన్‌డయాక్సైడ్ వాయువు ఉత్పత్తి అవుతుంది. దాన్ని పిల్లలకు ప్రత్య క్షంగా చూపించేందుకు ఓ గాజు గ్లాసులోకి 1/3 వంతు వినెగర్ తీసుకోండి. ఆపై అందులో చెంచా బేకింగ్ సోడా వేస్తే సరి. ఈ రెండూ కలిసినప్పుడు నీళ్ల నురగలు/ బుడగలు కక్కుతూ సీసా బయటకి పొంగుతాయి. ఆ బుడగలే కార్బన్‌డయాక్సైడ్ వాయువు అని చెబితే వాళ్లకి థ్రిల్లింగ్‌గా ఉంటుంది. దాంతో మరో ప్రయోగం కోసం ఎదురు చూస్తారు. ❑

# అనాసతో పరవశం



**కొంతమంది అనాస పండుని తొక్క తీసేసి నేరుగా తినడానికి ఇష్టపడితే మరికొందరు జ్యూస్ తాగడానికి ఆసక్తి చూపిస్తారు. అయితే ప్రత్యేకించి వేసవిలో దీనివల్ల అటు ఆరోగ్య పరంగానే కాకుండా ఇటు సౌందర్యపరంగా కూడా అనేక ప్రయోజనాలు ఉన్నాయి.**

**చర్మం మెరిసేలా....** అనాసలో ఉండే విటమిన్ సి మరియు అమైనో యాసిడ్స్ చర్మంలో కొలాజెన్ ఎక్కువగా ఉత్పత్తయ్యేలా చేసి తద్వారా చర్మం బిగుతుగా, పటుత్వం కోల్పోకుండా చేస్తాయి. అలాగే చర్మంపై పేరుకొనే మృతకణాలను తొలగించి కాంతివంతంగా మారుస్తాయి. ఇందులో ఉండే విటమిన్ సి వల్ల మొటిమలు తగ్గుముఖం పట్టడమే కాకుండా వాటివల్ల ఏర్పడిన మచ్చలు కూడా క్రమంగా చర్మ ఛాయలో కలిసిపోతాయి. ఫలితంగా ప్రకాశ వంతమైన చర్మాన్ని సొంతం చేసుకోవచ్చు. దీని కోసం తొక్క చెక్కిన ఫైనాపిల్ ముక్క ఒకటి తీసుకుని నేరుగా చర్మంపై రుద్దుకోవాలి. కాసేపు ఆరనిచ్చి తర్వాత చల్లని నీటితో శుభ్రం చేసుకుంటే సరిపోతుంది.

**జుట్టు రాలకుండా...** ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరినీ బాధ పెడుతున్న సమస్య జుట్టు రాలడం. అనాసలో పుష్కలంగా ఉండే విటమిన్ సి జుట్టు రాలడం నివారించడంలో సమర్థంగా పని చేస్తుంది. అయితే ఈ ప్రయోజనాన్ని పొందాలంటే ప్యాక్స్, జ్యూస్‌ల రూపంలో కాకుండా ఫైనాపిల్‌ని రోజూ తీసుకునే ఆహారంలో భాగం చేసుకోవడం మంచిది. అప్పుడే సత్ఫలితాలను ఆశించే అవకాశం ఉంటుంది.

**యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా...** అనాసలో విటమిన్ సితో పాటు పొటాషియం కూడా పుష్కలంగా లభిస్తుంది. వీటిలో యాంటీ ఆక్సిడెంట్లు కూడా అధిక మొత్తంలో ఉంటాయి. ఇవి శరీరంలో వ్యాది నిరోధక శక్తిని పెంచడమేకాదు.. చర్మం నవయవ్వ నంతో నిగనిగలాడేలా కూడా చేస్తాయి.

**అదనపు ప్రయోజనాలు ..** అనాస గుజ్జులో కొద్దిగా ఆలివ్ ఆయిల్ కలిపి పెదాలకు రాసుకుంటే అధరాల్లో తేమ ఎక్కువ సమయం నిలిచి ఉంటుంది. ఫలితంగా పెదవులు పొడిబారకుండా ఉంటాయి. పాదాలపై ఉండే పగుళ్ల తగ్గడానికి కూడా ఫైనాపిల్ బాగా సహాయపడుతుంది. అనాసలో ఉండే మాంగనీస్ శరీరంలో ఎముకల ఎదుగుదలకు బాగా ఉపయోగపడు తుంది. ఫలితంగా ఎముకలు బలంగా తయారవడంతోపాటు ఆరోగ్యంగా కూడా ఉంటాయి. ముఖ్యంగా చిన్నపిల్లల్లో ఇది చక్కని ఫలితాలనిస్తుంది. ఎముకల సంబంధిత సమస్యలేవీ దరి చేరకుండా సంరక్షిస్తుంది. ఫైనాపిల్ జ్యూస్ తాగడం వల్ల నెలసరికి సంబంధించిన సమస్యలు కూడా తగ్గుతాయి. ముఖ్యంగా పిరియడ్స్ సమయంలో బాగా నొప్పి సతమతమయ్యేవారు ఫైనాపిల్ జ్యూస్, తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది. ❑

# ఈద్ ఉల్ అజ్హా త్యాగనిరతికి ప్రతీక !

ఇస్లాం ధర్మంలో అత్యంత పవిత్రమైన పండుగలలో ఈద్‌ఉల్‌అజ్హా లేదా 'బకరీద్' ఒకటి. దీనిని 'త్యాగాల పండుగ' అని పిలు స్తారు. ప్రవక్త హజ్రత్ ఇబ్రహీం తన జీవితంలో ఎదు ర్కొన్న కఠినమైన పరీక్షలు, దైవప్రేమ కోసం ఆయన చేసిన మహోన్నత త్యాగాన్ని స్మరించు కుంటూ ఈ పండుగను జరుపుకుంటారు. అయితే, బకరీద్ అంటే కేవలం నూతన వస్త్రాలు ధరించడం, రుచికరమైన వంటకాలు చేసుకోవడం, కేవలం ఒక జంతువును బలి ఇవ్వడం మాత్రమే కాదు. అంతర్వ్యక్తిత్వంలో, సమాజం లో మార్పును, మానవత్వ పరిమళాన్ని ఆశించే ఒక సంస్కరణా కోణంలో చూసినప్పుడు ఈ పండుగ మనకు అంతర్గత మాలిన్యాలను వదిలించుకోవాలని, సమాజ శ్రేయస్సు కోసం స్వార్థాన్ని త్యాగం చేయాలని బోధిస్తుంది.

**'బలి' వెనుక ఉన్న అంతరార్థం!**

బక్రీద్ అనగానే చాలా మంది 'కుర్బానీ' (పశువు బలి) గురించి ఆలోచిస్తారు. కానీ, దీని వెనుక ఉన్న తాత్విక సందేశాన్ని అర్థం చేసుకోవడం నేటి కాలంలో ఎంతో అవసరం. ఈనాటి మతాలు ఆత్మలు లేని కాళేబరాలు మిగిలిపోయాయి! అంటుకే ఆధ్యాత్మికుల్లో ఆత్మీయత, ధార్మికుల్లో ధర్మం కారువయ్యింది! బలి, బలి కోసమేనా? బలి అంతరార్థం ఏమైనా ఉందా? అన్న ప్రశ్నకి సమాధానం తెలుసుకోవాల్సి ఉంది.

**సర్వోన్నత పుణ్య స్థాయికి చేరాలంటే?**

మంచిచెడు లాభనష్టాలను ధార్మిక పరిభాషలో పాప పుణ్యాలు అంటారు. అదే ఆకాడమిక్ పరిభాషలో చెప్పాలంటే ప్లస్ మైనస్ మార్కులు అని చెప్పవచ్చు.



సత్కర్మలు చేస్తున్నప్పుడు ప్లస్ మార్కులు పడుతుంటాయి. దుష్కార్మలకి పాల్పడుతున్నప్పుడు మైనస్ మార్కులు పడుతుంటాయి. అయితే ఒక భక్తుడు గొప్ప పుణ్య స్థాయికి చేరాలంటే ఏమి చేయాలో ఖురాన్ చెబు తున్న వైనాన్ని చూడండి. ఖురాన్ 3:97 "తనకు అత్యంత ప్రియమైన దానిని తన మార్గంలో లేక తన ప్రేమను పొందే నిమిత్తంత్యాగం చేయనంతవరకు మీరు పుణ్య స్థాయికి చేరుకోలేరు" అని అల్లాహ్ తీర్మాన పూర్వ కంగా ప్రకటిస్తున్నాడు. దీనికి ఆచరణాత్మక ఆదర్శం ప్రవక్త ఇబ్రాహీం జీవితంలో చూడగలం. ఆయనికి 96 సంవత్సరాల వృద్ధాప్యంలో లేకలేక కలిగిన కుమారుడు ఇస్మాయీల్. వానిని నా ప్రేమ నిమిత్తం బలి ఇవ్వమని దేవుడు కలలో ప్రేరేపించాడు. మారుమాట్లాడకుండా ఆయన తన ప్రియాతి ప్రియమైన కుమారుడిని ఆచరణాత్మకంగా బలిస్తుండగా దేవుడే స్వయంగా నిలువరించి ఒక పొట్టేలును బలిమ్మన్నాడు. అతని ఆ త్యాగనిరతిని మెచ్చుకొని దేవుడు ఖలీల్ అంటే తన స్నేహితుడు అని బిరుదు ఇచ్చాడు. అంతే కాదు ప్రపంచ మానవాళికి నిన్ను నాయకునిగా నియమించానని అల్లాహ్ ప్రకటిం చాడు. ఈ గొప్ప త్యాగాన్ని పునఃస్మరణ చేసుకుంటూ జరుపుకొనే పండుగే 'ఈద్‌ఉల్‌అజ్హా లేదా 'త్యాగాల పండుగ' (బక్రీద్).

**దుర్లక్షణాలు , దురలవాట్ల త్యాగం!**

ప్రవక్త ఇబ్రాహీం ప్రదర్శించిన ఆనాటి గొప్ప త్యాగం నుండి నేడు పొందవలసిన వాస్తవస్ఫూర్తి ఏమిటి? దేవుడు ఏ చెడులను త్యజించమని ఆదేశిస్తున్నాడో లాంటి ప్రతి చెడును దైవ ప్రసన్నత నిమిత్తం వదలుకోవటమే బకరీద్ పండుగ వాస్తవ ఆత్మీయ పరమార్థం. గొర్రెలూ, మేకల బలిదానం కేవలం ఒక ప్రతీక మాత్రమే! ఆత్మీయ శుద్ధీకరణ బక్రీద్ పరమార్థం! ఈ పండుగ ఉద్దేశ్యం నెరవేరాలంటే ప్రతి విశ్వాసీ తనకి అత్యంత ప్రియంగా ఉన్న ప్రతికూల భావోద్వేగాలైన స్వార్థం, అహంకారం, క్రోధం, అత్యాశ, ఈర్ష్య, ద్వేషం, పగ, ప్రతీకారం, శతృత్వం, అలాగే చుట్టా, బీడీ, సిగరెట్, పాన్ పరాగ్, సారా, డ్రగ్ వంటి దుర్వ్యసనాలు మనిషికి అతిపెద్ద శత్రువులు. వీటిని బలివ్వటమే అసలైన ఖుర్బానీ. పశువులను బలివ్వటం ఒక లాంఛనం మాత్రమే. అసలైన ఆత్మ తనలో ఉన్న పశు ప్రవృత్తులను బలివ్వాలి. పదీ,ఇరవై వేలు ఖర్చు చేసి గొర్రెలూ, మేకలు బలివ్వటం సులువే. అందుకే అల్లాహ్ ఏమంటున్నాడో చూడండి. ఖురాన్ 22:37 "వాటి (కుర్బానీ జంతువుల) మాంసంగానీ, వాటి రక్తంగానీ అల్లాహ్‌కు చేరవు. కానీ మీ హృదయాలలోని భయభక్తుల వైఖరి (తఖ్వా) మాత్రమే ఆయనకు చేరుతుంది' ఖురాన్ ప్రకటిస్తుంది. ఈ మధ్య కాలంలో కొందరు వెర్రెక్కినట్లు వేలాది రూపాయల్లో అయ్యే ఖుర్బానీని లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఇది కేవలం బడాయికి పోవటమే. దీని పరిణామంగా పుణ్యం లభించటం మాట దేవుడెరుగు పాపం మాత్రం చుట్టుకుంటుంది. అల్లాహ్ క్షమించుగాక. ఆమీన్. ఈ వాక్యం బాహ్య ఆచారాల కంటే అంతర్గత సంస్కరణే ముఖ్యమని నిరూపిస్తోంది.

**సామాజిక సమతుల్యత, ఆర్థిక చేయూత!**

బక్రీద్ పండుగలో ఉన్న అతిపెద్ద సామాజిక సంస్కరణాత్మక అంశం – సంపద పంపిణీ. కుర్బానీ చేసిన మాంసాన్ని మూడు భాగాలుగా విభజించాలని ఇస్లాం నిర్దేశించింది. 1వ భాగం పేదలు మరియు నిరుపేదలకు 2వ భాగం బంధువులు మరియు స్నేహితులకు 3వ భాగం స్వంత కుటుంబానికి.

**ఇది నిరంతర త్యాగశీలకి ఒక ప్రేరకం మాత్రమే!**

నేటి ఆధునిక సమాజంలో ఆర్థిక అసమానతలు పెరిగి పోతున్నాయి. ఒకవైపు విలాసాలు, మరోవైపు ఆకలి కేకలు కనిపిస్తున్నాయి. బకరీద్ పండుగ ధనవంతుడు, పేదవాడు అనే తేడా లేకుండా అందరికీ ఒకే రకమైన ఆహారాన్ని అందించి, సమాజంలో ఆర్థిక సమతుల్యతను సాధించాలనే సంస్కరణను సూచిస్తుంది. కేవలం పండుగ రోజుల్లోనే కాదు, నిత్యజీవితంలో కూడా మన సంపాదనలో కొంత భాగాన్ని సమాజంలోని వెనుకబడిన వర్గాల విద్య, వైద్యం, మరియు ఉపాధి కోసం త్యాగం చేయాలనే స్పృహను ఇది కలిగిస్తుంది.సమాజంలోని అనాథలు, వృద్ధులు, మరియు ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే దేవునికి మనం ఇచ్చే అతిపెద్ద బహుమతి. ఇదే ఇస్లాం ధర్మ అసలు సారం.

**- ముష్తాఖ్ అహ్మద్ అభిలాష్**

# 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్'నుండి 'ప్రియసఖి' సాంగ్



ఎపిక్ – ఫస్ట్ సెమిస్టర్థ్ చిత్ర బృందం తాజాగా రెండవ గీతం 'ప్రియసఖి'ని విడుదల చేసింది. ఈ పాట తన భావోద్వేగ లోతు, హాయినిచ్చే అనుభూతితో ఇప్పటికే ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంటోంది. ప్రేమ అనే భావన చుట్టూ అల్లుకున్న ఈ పాట, ఒక యువకుడు తనకు ఎంతో ప్రత్యేకమైన వ్యక్తి పట్ల మనసులో దాచుకున్న మౌన భావాలను, ఆరాధనను, అనురాగాన్ని అందంగా ఆవిష్కరించింది. గేయ రచయిత సురేష్ బనిశెట్టి అందించిన సాహిత్యం సరళంగా ఉంటూనే, హృదయానికి హత్తుకునేలా ఉంది. ప్రతి పదం పాట భావానికి అద్భుతంగా సరిపోతూ, శ్రోతలను తక్షణమే ఆకట్టుకుంటుంది. సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ సరికొత్తగా, ప్రశాంతంగా, భావోద్వేగభరితంగా ఉండే ఒక బాణీని సృష్టించి మరోసారి తన ప్రతిభను నిరూపించుకున్నారు. లండన్ నేపథ్యంతో చిత్రీకరించిన 'ప్రియసఖి' పాట దృశ్యపరంగా అద్భుతంగా ఉంది. ఆ సుందరమైన దృశ్యాలు పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చాయి. నాయకానాయికలు ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య మధ్య కనిపించిన కెమిస్ట్రీ మరోసారి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. '90' వెబ్ సిరీస్ తో ఆకట్టుకొని, వెండితెరకు దర్శకుడిగా పరిచయమవుతున్న ఆదిత్య హాసన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్ మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

# 'చెన్నై లవ్ స్టోరీ' మూవీ నుంచి 'వదలనే..' పాట విడుదల

హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా 'కలర్ ఫొటో', 'బేబి' వంటి కల్ట్ క్లాసిక్ మూవీస్ ప్రేక్షకులకు అందించిన మేకర్స్ ఎస్ కేఎన్, సాయి రాజేశ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'చెన్నై లవ్ స్టోరీ'. ఈ చిత్రాన్ని అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై ఎస్ కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్నారు. సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. మెలొడీ బ్రహ్మ మణిశర్మ 'చెన్నై లవ్ స్టోరీ' సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ సినిమా సెకండ్ సింగిల్ 'వదలనే..' పాటను సోమవారం హైదరాబాద్ లో జరిగిన గ్రాండ్ ఈవెంట్‌లో ఆస్కార్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి చేతుల మీదుగా లాంఛ్ చేశారు.



మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి మాట్లాడుతూ బేబి సినిమా చూసిన తర్వాత సాయి రాజేశ్ ఫ్యాన్స్‌లో నేనూ ఒకరిగా మారిపోయాను. డీవోపీ డేనియల్ విశ్వాస్ మాట్లాడుతూ డైరెక్టర్ రవి నంబూరి స్క్రిప్ట్ చెప్పిన తర్వాత ఫస్ట్ వినిపించిన సాంగ్ ఇదే. మణి కంపోజిషన్ నా విజువల్స్‌ను ఎంతో ఇన్స్ ఫైర్ చేసింది. డైరెక్టర్ రవి నంబూరి మాట్లాడుతూ ఈ వేదిక మీద మాట్లాడాలంటే భయమేస్తుంది. ఇంతమంది మ్యూజిక్ డైరెక్టర్స్‌ను చూస్తుంటే ఈ వేదిక ఒక మ్యూజిక్ యాప్ లా అనిపిస్తోంది. కో ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ చెన్నై లవ్ స్టోరీ సినిమా ఈ ఏడాది బిగ్గెస్ట్ బస్టర్ లవ్ స్టోరీ మూవీ అవుతుంది. వంద కోట్లకుపైగా కలెక్ట్ చేస్తుంది. హీరోయిన్ శ్రీ గౌరిప్రియ మాట్లాడుతూ నేను సింగర్ కావాలని ప్రయత్నించాను. ఏ కాంపిటేషన్ కు వెళ్లినా మణిశర్మ పాటలు పాడాను. అలా ఆయన నన్ను కొత్త సింగర్‌గా ఇన్స్ ఫైర్ చేశారు. ప్రొడ్యూసర్ సాయి రాజేశ్ మాట్లాడుతూ మణిశర్మకోసం ఇంతమంది మ్యూజిక్ డైరెక్టర్స్ మా ఈవెంట్ కు వచ్చారు. హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ చెన్నై లవ్ స్టోరీ గురించి లాస్ట్ టైమ్ చెప్పాను. నేను కూడా మీలాగే సినిమా కోసం వేచి చూస్తున్నా. త్వరగా సినిమా రిలీజ్ చేయమని మా ప్రొడ్యూసర్స్‌ను అడుగుతున్నా. ఈ సినిమా ఎలాంటి విజయం అందించబోతుందో మాకు తెలుసు. వదలనే పాట గురించి చెప్పాలంటే..ఈ పాట పిక్చరైజేషన్ పాండిచ్చేరిలో చేశాం.

## తెర

# 'మా ఇంటి బంగారం' ట్రైలర్ లాంచ్



ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద సమంత, రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం'మా ఇంటి బంగారం. సమంత ప్రధాన పాత్రలో నందినీ రెడ్డి తెరకెక్కించిన ఈ మూవీని జూన్ 19న రిలీజ్ చేయబోతోన్నారు. సమంత మాట్లాడుతూ.. 'మా ఇంటి బంగారం' ట్రైలర్ అందరికీ నచ్చే ఉంటుందని భావిస్తున్నాను. మా కోసం ఇక్కడికి వచ్చిన ప్రతీ ఒక్క అభిమానికి థాంక్స్. నందినీ, రాజ్ ప్రతీ విషయంలో పర్ ఫెక్ట్‌గా ఉంటారు. ఇంత వరకు నేను వారితో వాదించే విషయం గానీ, అలాంటి ఓ ఘటన గానీ ఎదురు కాలేదు.'మా ఇంటి బంగారంలో ప్రతీ ఎమోషన్ ఉంటుంది. నందినీ రెడ్డి మాట్లాడుతూ .. సమంత దినదినా భివృద్ధి చెందుతున్నారు. ఒకప్పటి సమంతకి ఇప్పటి సమంతకు ఎంతో తేడా ఉంది. ఇప్పుడు ఆమె నెక్స్ట్ లెవెల్లో ఉన్నారు. యాక్షన్, కామెడీ, ఎమోషన్ ఇలా ప్రతీ సీన్‌లో సమంత అదర గొట్టేశారు. రాజ్ నిడిమోరు మాట్లాడుతూ ..'మా ఇంటి బంగారం' అనే పేరులోనే ఎంతో ఎఫెక్షన్, లవ్ ఉంటుంది. దాని వెనకాల డార్క్ సైడ్, పొసెసివ్ నెస్ కూడా ఉంటుంది. హిమాంక్ దువ్వూరు మాట్లాడుతూ .. 'మా ఇంటి బంగారం' ట్రైలర్ చూస్తేనే సమంత యాక్టింగ్ ఏ రేంజ్‌లో ఉంటుందో అర్థం అవుతుంది. శ్రీముఖి మాట్లాడుతూ .. సమంత హీరోయిన్ అని చెప్పడంతోనే కథ వినకుండానే ఓకే చెప్పాను. సమంత నిజంగానే ఓ బంగారం. ఆమె యాక్షన్ లైవ్‌లో చూడటం ఓ ట్రీట్. ఈ చిత్రంలో ఆమె నవ్విస్తారు, ఏడ్పిస్తారు, శ్రీనివాస్ గవిరెడ్డి మాట్లాడుతూ .. ముందుగా నేను దర్శకుడిగా ఓ సినిమా చేశాను. 'శుభం'తో నటుడిగా మారాను. ఇప్పట్లో నా ఫోకస్ దర్శకత్వం వైపు అయితే లేదు. పూర్తిగా నటన మీదే ఫోకస్ చేస్తున్నాను.

# 'త్రికాల' 28న విడుదల



భారతీయ సనాతన ధర్మంలో దాగి ఉన్న ఆధ్యాత్మిక రహస్యాలను ఆధారంగా చేసుకుని రూపొందిన మైథలాజికల్ ఫిక్షనల్ థ్రిల్లర్'త్రికాల్ల ప్రపంచవ్యాప్తంగా మే 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రముఖ నటి శ్రద్ధాదాస్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో మాస్టర్ ఫేమ్ మహేంద్రన్, అజయ్, సీనియర్ నటి ఆమని కీలక పాత్రలు పోషిం చారు. మణి తెల్లగూటి కథ, దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రాధిక-శ్రీనివాస్ నిర్మించగా, చాగంటి ప్రొడక్షన్ ఎల్‌ఎల్‌పి ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తోంది.ఇప్పటికే విడుదలైన ట్రైలర్, ప్రచార చిత్రాలు, పాటలు ప్రేక్షకుల్లో సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. ముఖ్యంగా అడవి నేపథ్యంలో రూపొందించిన విజువల్స్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్, వెన్నులో వణుకు పుట్టించే బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ప్రేక్షకులను ఆకట్టు కుంటున్నాయి. హైఎండ్ జునీశ్రీ, అద్భుతమైన కెమెరా వర్క్ సినిమాకు మరింత గ్రాండియర్ తీసుకువచ్చాయి. ముఖ్యంగా 'అమ్మ" పాట ప్రేక్షకులను భావోద్వేగానికి గురిచేస్తూ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. శ్రద్ధాదాస్ కొత్త లుక్, మాస్టర్ మహేంద్రన్ యాక్షన్ సీక్వెన్స్‌లు, అజయ్ పవర్‌ఫుల్ క్యారెక్టర్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచుతున్నాయి. ఈ సందర్భంగా దర్శకుడు మణి తెల్లగూటి మాట్లాడుతూ. .ప్రపంచంపై చీకటి కమ్ముకున్న సమయంలో వెలుగుగా అవతరించే ఒక శక్తి చుట్టూ 'తికాల' కథ సాగుతుంది. సనాతన ధర్మంలోని కొన్ని ఆధ్యాత్మిక అంశాలను థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో మిళితం చేసి ఈ చిత్రాన్ని తెరకెక్కించాం.

# 'పెద్ది'లో గౌర్నాయుడు పాత్ర ఆనందాన్ని ఇచ్చింది: శివరాజ్ కుమార్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ రూరల్ యాక్షన్ డ్రామా 'పెద్ది'. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్, అద్భుతమైన ట్రైలర్ తో సినిమాపై అంచనాలు భారీ స్థాయికి చేరుకున్నాయి. ఈ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

**బుచ్చిబాబు ఈ కథ చెప్పినప్పుడు మిమ్మల్ని ఎక్సైట్ చేసిన అంశాలు ఏమిటి?**

పెద్ది అద్భుతమైన కథ. నా పాత్ర కూడా చాలా బాగుంది.

**మీరు చేసిన గౌర్నాయుడు పాత్రలో ఉన్న ప్రత్యేకత ఏమిటి?**

గౌర్నాయుడు పాత్రకు ఒక లక్ష్యం, ఒక ఉద్దేశం ఉంటుంది. ఆ పాత్రను దర్శకుడు బుచ్చిబాబు చాలా అద్భుతంగా ఆవిష్కరించారు.

**ఇందులో మీది రామ్ చరణ్ కి కోచ్ పాత్రేనా?**

కోచ్ పాత్రలానే ఉంటుంది. పెద్ది పాత్ర జర్నీ చాలా అద్భుతంగా సాగుతుంది. ఆ ప్రయాణంలో ఎన్నో పాత్రలు వస్తాయి. నేను చేసిన గౌర్నాయుడు పాత్ర విషయానికి వస్తే, పెద్దిగౌర్నాయుడు మధ్య ఉండే అనుబంధం చాలా ఆసక్తికరంగా ఉంటుంది.

**రామ్ చరణ్ పెర్ఫార్మెన్స్ ?**

ఈ సినిమాతో రామ్ చరణ్ గారికి నేషనల్ అవార్డు వస్తుందని నేను భావిస్తున్నాను. ఆయన బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్, పెర్ఫార్మెన్స్ అద్భుతంగా ఉంటాయి. చాలా కష్టపడి, ఏకాగ్రతతో ఈ పాత్ర చేశారు.

**పెద్ది షూటింగ్ జర్నీ ఎలా అనిపించింది?**

రామ్ చరణ్ గారు, దర్శకుడు, టెక్నీషియన్స్ అందరూ నన్ను ఎంతో ఆప్యాయంగా చూసుకున్నారు. అందరం ఒక కుటుంబంలా కలిసి పనిచేశాం.

**దర్శకుడు బుచ్చిబాబు గురించి?**

బుచ్చిబాబు ఈ సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దారు. ఆయన మేకింగ్, టేకింగ్ సూపర్. కథకు ఏం అవసరమో అదే తెరకెక్కించారు.

**సినిమాలో మల్టిపుల్ స్పోర్ట్స్ ఉన్నాయి కదా?**

అవును. ఇందులో పలు క్రీడలు ఉంటాయి. అయితే ప్రతి క్రీడ కథతో చాలా బలంగా అనుసంధానమై ఉంటుంది. ఆ అంశాన్ని ప్రేక్షకులు బిగ్ స్క్రీన్‌పై ఎంతో ఎంజాయ్ చేస్తారు.

**క్లైమాక్స్ చాలా చర్చ జరుగుతోంది. అది ఎలా ఉండబోతోంది?**

చాలా సర్‌ప్రైజింగ్ క్లైమాక్స్ ఉంటుంది. దాన్ని మీరు థియేటర్‌లో చూసి ఆస్వాదించాలి. పెద్ది జర్నీ చాలా బాగుంటుంది. ప్రేక్షకులందరికీ నచ్చుతుంది.

**మీరు ఎలాంటి పాత్రలు చేయడానికి ఇష్టపడతారు?**

నాకు మనసుకు నచ్చిన పాత్రలు చేయడం ఇష్టం. పెద్దిలో చేసిన గౌర్నాయుడు పాత్ర కూడా అలాంటిదే.

# 'నాగబంధం' 3డి స్టాండీ కర్టెన్ రైజర్ ఈవెంట్



భారతీయ సినీ పరిశ్రమ లో అత్యంత ఆసక్తిగా ఎదురు చూస్తున్న మైథలాజికల్ యాక్షన్‌అడ్వెంచర్ 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' పై రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. దర్శకుడు అభిషేక్ నామా, హీరో విరాట్ కర్ణ క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఈ భారీ చిత్రం ప్రతి ప్రమోషనల్ అప్డేట్‌తో దేశవ్యాప్తంగా ఆకట్టుకుంటుంది. భారతీయ పురాణాలు, అడ్వెంచర్, ప్రాచీన రహస్యాలు, దైవిక శక్తులు, హైఆక్టేన్ యాక్షన్ అంశాలతో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు ఇప్పటివరకు చూడని సినిమాటిక్ అనుభూతిని అందించనుంది. ఎన్ఐకే స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని అభిషేక్ పిక్చర్స్ సమర్పిస్తోంది. భారీ నిర్మాణ విలువలు, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను రూపొంది స్తున్నారు. తాజాగా చిత్ర బృందం హైదరాబాద్‌లోని ఏఎంబీ సినిమాస్లో ప్రత్యేకంగా రూపొందించిన 'నాగబంధం' 3దీ స్టాండీ కర్టెన్ రైజర్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో హీరో విరాట్ కర్ణ, హీరోయిన్ నభా నటేష్, నిర్మాత పాల్గొని 3దీ స్టాండీని లాంచ్ చేశారు. భారీ ఎత్తున హాజరైన అభిమానుల మధ్య ఈ ఈవెంట్ ఉత్సాహభరితంగా సాగింది. ప్రాచీన దేవాలయాలు, మిస్టికల్ ప్రపంచాలు, భారీ యుద్ధ ఘట్టాలు, దైవిక శక్తులతో కూడిన సన్నివేశాలను అత్యాధునిక సాంకేతికతతో తెరపై ఆవిష్కరించేందుకు చిత్రబృందం కృషి చేస్తోంది.

# ఫైనల్లోకి దూసుకెళ్లిన ఆర్సీబీ




* చిత్తయిన గుజరాత్ టైటాన్స్
* పేకమేడలా కూల్చిన పేసర్లు
* భారీ తేడాతో ఆర్సీబీ విక్టరీ
* వరుసగా రెండోసారి ఫైనల్లో
* పాటిదార్ కెప్టెన్ ఇన్నింగ్స్
* గిల్ సేనకు మరో ఛాన్స్

**ధర్మశాల, మే 26:** డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ క్వాలిఫయర్-1లో దుమ్మురేపింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో గుజరాత్ టైటాన్స్‌ను హడలెత్తించింది. మ్యాచ్‌ను ఏకపక్షంగా ముగించి వరుసగా రెండోసారి ఫైనల్లోకి దూసుకుపోయింది. 255రన్స్ భారీ లక్ష్యాన్ని చేధించడానికి బ్యాటింగ్‌కు దిగిన గుజరాజ్ 19.3ఓవర్లలో 162రన్స్ కే కుప్పకూలింది. సాయి సుదర్శన్(14) హిట్‌వికెట్‌తో గుజరాత్ పతనం ప్రారంభమైంది. ఆ వెంటనే శుభ్‌మన్ గిల్(2)ను భువనేశ్వర్ బౌల్డ్ చేయగా, జాస్ బట్లర్(29)ను హేజిల్ వుడ్ అవుట్ చేశాడు. ఆవెంటనే పేకమేడలా వికెట్లు కూలాయి. రషిక్ ఒకే ఓవర్లో నిశాంత్(5), హోల్డర్(0) పనిపట్టగా, డఫీ... వాషింగ్టన్, రషీద్‌లను అవుట్ చేశాడు. మరో ఎండ్‌లో తెవాటియా(68) రాణించడంతో గుజరాత్ 150 మార్కు దాటింది. ఆర్సీబీ బౌలర్లలో డఫీ 3 వికెట్లు.. భువనేశ్వర్, రసిఖ్, కృనాల్ పాండ్యా రెండేసి వికెట్లు తీశారు. గుజరాత్ జట్టులో ఏకంగా ఏడుగురు సింగిల్ డిజిట్‌కే అవుటయ్యారు.

అంతకుముందు టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 254 పరుగుల భారీ స్కోరు చేసింది. కెప్టెన్ రజత్ పాటిదార్(33 బంతుల్లో 93; 5 ఫోర్లు, 9 సిక్స్‌లు) సిక్స్‌ల సునామీతో గుజరాత్ బౌలర్లను ఉతికి ఆరేశాడు. ఓపెనర్ వెంకటేశ్ అయ్యర్(19) నిరాశపరిచినా.. విరాట్ కోహ్లీ(43), దేవదత్ పడిక్కల్(30) ధాటిగా ఆడి రెండో వికెట్‌కు 72 రన్స్ జోడించారు. 9వ ఓవర్లో హోల్డర్ వెంటవెంటనే ఇద్దరినీ పెవిలియన్ పంపాడు. ఈ దశలో క్రీజ్‌లోకి వచ్చిన రజత్ పాటిదార్, కృనాల్ పాండే(28 బంతుల్లో 43) ఆరంభంలో ఆచితూచి ఆడినా ఆ తర్వాత ఒక్కసారిగా గేర్ మార్చారు. సిక్స్‌లు, ఫోర్లతో అలరించారు. వీరి ధాటికి కెజ్రోలియా ఓవర్లో 28 రన్స్ వచ్చాయి. 16వ ఓవర్లో 21 రన్స్, 17వ ఓవర్లో 15 రన్స్, 18వ ఓవర్లో 10 రన్స్, 19వ ఓవర్లో 1 రన్స్, 20వ ఓవర్లో 19 రన్స్.. ఇలా చివరి ఆరు ఓవర్లలో ఏకంగా 114 పరుగులు పారాయి.

### కోహ్లీ ఖాతాలో మరో రికార్డ్

కింగ్ కోహ్లీ ఖాతాలో మరో రికార్డ్ చేసింది. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన క్వాలిఫయర్ మ్యాచ్‌లో 43 పరుగులు చేయడం ద్వారా ఈ సీజన్‌లో 600 పరుగులు పూర్తి చేశాడు. వరుసగా నాలుగు సీజన్లలో 600 ప్లస్ రన్స్ చేసిన తొలి బాట్స్‌మెన్‌గా రికార్డు నెలకొల్పాడు. రబడ ఓవర్లో రెండు ఫోర్లు, ఓ సిక్స్ సాధించిన కోహ్లీ... 25 బంతుల్లో 43 రన్స్ చేశాడు. ఈ సీజన్‌లో కోహ్లీ 15 ఇన్నింగ్స్‌ల్లో 50సగటు, 164.38 స్ట్రైక్‌రేట్‌తో 600 పరుగులు చేశాడు. ఇందులో ఓ సెంచరీ, 4హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఇప్పటివరకు ఐపీఎల్‌లో వరుసగా 3 సీజన్లలో ముగ్గురు మాత్రమే600ప్లస్ రన్స్ చేశారు. క్రిస్ గేల్ (2011, 2012, 2013), వార్నర్ (2016, 2017, 2019), రాహుల్ (2020, 2021, 2022) ఈ జాబితో ఉన్నారు.

## సింగపూర్ ఓపెన్‌లో సింధూ ముందంజ, ఆయుష్ నిష్క్రమణ

**సింగపూర్:** భారత్ అగ్రశ్రేణి షట్లర్ పీవీ సింధూ... సింగపూర్ ఓపెన్‌ను విజయంతో శుభారంభం చేసింది. సింధూతో పాటు సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ కూడా ముందంజ వేసింది. కాగా ఆయుష్ షెట్టి, ఉన్నతి హూడా ఓటమితో తొలిరౌండ్‌లోనే నిష్క్రమించారు.

పీవీ సింధూ మహిళలసింగిల్స్ తొలి రౌండ్‌లో ఐదీ సీడ్ పుత్రి కుసుమ(ఇండోనేషియా)పై వరుసెట్లలో 21-17, 21-18 తేడాతో అలవోకగా గెలుపొందింది. సింధూ మునుపటి ఫామ్‌ను చాటుతూ అద్భుతమైన ఆటతీరుతో కుసుమను ముచ్చెమటలు పట్టించింది. ఏ దశలోనూ సింధూ జోరుకు కుసుమ నిలువలేకపోయింది. ఈ విజయంతో సింధూ రెండో రౌండ్‌కు దూసుకెళ్లింది. డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ సింధూ.. రెండో రౌండ్‌లో మాజీ ప్రపంచఛాంపియన్ రికో గుంజీ (జపాన్)తో తలపడనుంది. ఇక ఆసియా క్రీడల



స్వర్ణ పతక జోడీ సత్విక్‌సాయిరాజ్ -చిరాగ్ శెట్టి కూడా పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 25వ ర్యాంకర్, మలేషియా జోడీ చెన్ జి - ప్రెస్లీ స్మిత్‌లను 26-28, 21-15, 21-13 తేడాతో ఓడించి ముందంజవేశారు. ప్రపంచ 4వ ర్యాంకర్ భారత జోడి తొలి సెట్‌లో హోరాహోరీగా తలపడింది. సుదీర్ఘంగా జరిగిన ఈ గేమ్‌లో చివరికు 26-28తో ఓడినా...తరువాతి సెట్లలో పుంజుకుని విజయంతో ముగించింది. భారత వర్ధమాన షట్లర్ ఆయుష్ శెట్టి 21-11, 14-21, 12-21తో ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ కాంస్య పతక విజేత విక్టర్ ఆక్సెల్సెన్ చేతిలో ఓడాడు. తొలి సెట్ నెగ్గినా, అదే జోరు కొనసాగించలేక టోర్నీ నుంచి నిష్క్రమించాడు.

ఇక గత నాలుగేళ్లలో మూడు సూపర్ 100 టైటిల్స్ నెగ్గిన ఉన్నతి హూడా కూడా తొలి రౌండ్‌లోనే నిష్క్ర మించింది. ఆమెపై ఎనిమిదో సీడ్ టొమోకా మియాజాకి 21-14, 21-10తో గెలుపొం దింది. భారత ఇతర ఆటగాళ్ల లక్ష ్య సేన్, హెచ్ఎస్ ప్రణయ్, మాల్వికా బన్సోద్ నేడు తమ పోరు





### హెడ్ టు హెడ్

ఇరు జట్లు ఇప్పటివరకు 23 మ్యాచ్‌లాడగా, సన్‌రైజర్స్ హైదరాబాద్ 14 మ్యాచ్‌ల్లో గెలుపొంది పైచేయితో ఉంది. రాజస్థాన్ రాయల్స్ 9 మ్యాచ్‌ల్లో నెగ్గింది. ఈ సీజన్‌లో తలపడ్డ రెండుసార్లూ సన్‌రైజర్స్ గెలుపొందింది. ఏప్రిల్ 13న సొంతగడ్డ ఉప్పల్‌లో 57 పరుగుల భారీ తేడాతో, ఏప్రిల్ 25న జైపూర్ వేదికగా 5వికెట్లతో నెగ్గింది. రెండుసార్లు కూడా సన్‌రైజర్స్ 200 ప్లస్ స్కోర్లు చేసింది.

### వేదిక: ముల్లన్‌పూర్, రాత్రి 7.30 గంటల నుంచి

ముల్లన్‌పూర్ స్టేడియం స్కోరింగ్ మ్యాచ్‌లకు వేదిక. ఇక్కడ 8 మ్యాచ్‌లకు గాను 6 మ్యాచ్‌ల్లో 200 ప్లస్ స్కోర్లు నమోదయ్యాయి. చిన్న బౌండరీలు, స్పీడ్ ఔట్‌ఫీల్డ్ కారణంగా పరుగుల వరదలో ఎవరు పైచేయి సాధిస్తే వారిదే విజయం. ఇక్కడ టాస్ గెలిచిన జట్టు మొదట బౌలింగ్ ఎంచుకుని, రాత్రి వేళ చేజింగ్ వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది.

# ముల్లన్‌పూర్‌లోనూ సన్‌రైజింగేనా?

## ఎలిమినేటర్ మ్యాచ్‌కు సిద్ధమైన హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్

న్యూచండీఘర్, మే 26: సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మరోసారి తలపడేందుకు సిద్ధమయ్యాయి. గ్రూప్ స్టేజ్‌లో రెండుసార్లు తలపడ్డ ఈ జట్లు... ముచ్చటగా మూడోసారి ముల్లన్‌పూర్ వేదికగా నేడు జరిగే ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఢీకొంటున్నాయి. ఏడాది గ్యాప్ తర్వాత రెండు జట్లు కూడా ప్లే ఆఫ్ ఆడుతున్నాయి. నాకౌట్‌లో గెలిస్తేనే ముందుకు, లేదంటే ఇంటికే. ఈ డూ ఆర్ డై మ్యాచ్‌లో నెగ్గి క్వాలిఫయర్-2కు ఎంట్రీ ఇవ్వాలని ఇరు జట్లు ఫోకస్ పెట్టాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ దూకుడుకు, రాజస్థాన్ రాయల్స్ వ్యూహాత్మక ఆటతీరుకు మధ్య జరగబోయే ఈ పోరు క్రికెట్ అభిమానుల్లో అత్యంత ఉత్కంఠ రేపుతోంది.

### హాట్రిక్ విజయంపై గురి

ఈ సీజన్‌లో తలపడ్డ రెండుసార్లు కూడా సన్‌రైజర్స్ హైదరాబాద్ పూర్తి ఆధిక్యాన్ని ప్రదర్శించింది. ఈ విజయాల ఊపులో రాయల్స్‌పై హాట్రిక్ విజయాన్ని సొంతం చేసుకోవాలని చూస్తోంది. అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్ వంటి విధ్వంసకర బ్యాటర్లతో హైదరాబాద్ బ్యాటింగ్ లైనప్ పటిష్టంగా ఉంది. అభిషేక్ గత మ్యాచ్‌లో అర్ధసెంచరీతో ఇరగదీయగా, రాయల్స్‌పై ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఇషాన్ 91, 74 రన్స్ చేశాడు. ముఖ్యంగా క్లాసెన్ ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. వీరికి నితీష్ రెడ్డి రూపంలో చక్కని తోడ్పాటు లభిస్తోంది. సూపర్ ఆల్‌రౌండర్‌గా తనదైన పాత్ర పోషిస్తున్నాడు. బౌలింగ్‌లో పాట్ కమిన్స్ ప్రధాన అస్త్రం. ఇక ఇషాన్ మలింగ, సకిబ్ హుస్సేన్ వికెట్ల వేట కొనసాగిస్తున్నారు.

### రివేంజ్‌పై రాయల్స్ ఫోకస్

మరోవైపు రాజస్థాన్ రాయల్స్ జట్టు 15 ఏళ్ల సంచలన కుర్రాడు వైభవ్ సూర్యవంశీపై భారీగా ఆశలు పెట్టుకుంది. జైపూర్‌లో హైదరాబాద్‌పై కేవలం 36 బంతుల్లోనే శతకం బాదిన సూర్యవంశీ ఈ మ్యాచ్‌లోనూ కీలకంకానున్నాడు. అతనికి తోడుగా యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్, రియాన్ పరాగ్ లతో రాజస్థాన్ బ్యాటింగ్ బలంగా ఉంది. బౌలింగ్‌లో జోఫ్రా ఆర్చర్ పవర్‌ప్లేలో వికెట్లు తీయడంపైనే రాజస్థాన్ గెలుపు అవకాశాలు ఆధారపడి ఉన్నాయి. ముల్లన్‌పూర్ స్టేడియంలో రాజస్థాన్ జట్టుకు మంచి రికార్డు ఉంది. ఈ సీజన్‌లో ఇక్కడ ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ రాజస్థాన్ విజయం సాధించింది.

### ఇరుజట్ల అంచనా

**సన్‌రైజర్స్ హైదరాబాద్:** అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్, నితీష్ రెడ్డి, సలీల్ అరోరా, స్మరన్, పాట్ కమిన్స్ (కెప్టెన్), హర్షల్ పటేల్, శివాంగ్ కుమార్, ఇషాన్ మలింగ, సాకిబ్; **ఇంఫాక్ట్ ప్లేయర్:** ట్రావిస్ హెడ్

**రాజస్థాన్ రాయల్స్:** యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ, ధ్రువ్ జురెల్, రియాన్ పరాగ్ (కెప్టెన్), డోనోవన్ ఫెరీరా, శుభమ్ దూబే, దాసున్ షనక, జోఫ్రా అర్చర్, నాండ్రే బర్గర్, యష్ రాజ్ పుంజా, బ్రిజేష్ శర్మ; **ఇంఫాక్ట్ ప్లేయర్:** రవీంద్ర జడేజా



## ఫ్రెంచ్ ఓపెన్ రెండో రౌండ్‌లో కోకా గాఫ్, సబలెంకా

**పారిస్:** ఫ్రెంచ్ ఓపెన్‌లో మహిళా సీడెడ్ ప్లేయర్లు శుభారంభం చేశారు. మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ కోకా గాఫ్, అరీనా సబలెంకా సునాయాస విజయాలతో ముందంజ వేయగా, మెద్వదెవ్ 5 సెట్ల పోరులో ఓటమి పొందాడు. తొలి రౌండ్‌లో కోకా గాఫ్(అమెరికా) 6-4, 6-0తో తన దేశానికే చెందిన టౌన్సెండ్‌పై అలవోకగా నెగ్గగా, సబలెంకా కూడా 6-4, 6-2తో 50వ ర్యాంకర్ జెస్సికా బౌజాస్‌పై విజయం అందుకుంది. గత ఏడాది ఆస్ట్రేలియా, యుఎస్ ఓపెన్ నెగ్గిన సబలెంకా.. ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో గాఫ్ చేతిలో ఓడి రన్నరప్‌తో సరిపెట్టింది. ఈసారి టైటిల్ లక్ష్యంగా వచ్చిన సబలెంకా తొలి రౌండ్‌ను అలవోకగా అధిగమించింది. ఇక పురుషుల సింగిల్స్‌లో సంచలనం నమోదైంది. మెద్వదెవ్ అయిదు సెట్ల పోరులో వైల్డ్ కార్డ్ ఎంట్రీ ఆడమ్ వాల్టన్ చేతిలో ఓటమి పొందాడు. వాల్టన్ 6-2, 1-6, 6-1, 1-6, 6-4తేడాతో మెద్వదెవ్‌పై నెగ్గి ముందంజ వేశాడు. కాగా టాప్ ర్యాంకర్ జానిక్ సినర్ తొలి రౌండ్‌లో ఫ్రెంచ్ వైల్డ్ కార్డ్ ఆటగాడు క్లెమెంట్ టాబర్‌తో తలపడనున్నాడు.

# రూ.5 వేల కోట్లకు కోల్ ఇండియా ఆఫర్ ఫర్ సేల్

**ముంబయి, మే 26:** కోల్ ఇండియా లిమిటెడ్ బుధవారం తాజా ఆఫర్ ఫర్ సేల్ ను ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. ఈ ఆఫర్ ద్వారా మొత్తం రూ.5,000 కోట్ల విలువైన షేర్ల విక్రయానికి వచ్చే అవకాశం ఉంది. ప్రతిపాదిత ఓఎఫ్ఎస్‌లో ప్రభుత్వం ప్రాథమిక ఇష్యూ పరిమాణంగా 1 శాతం వాటాను విక్రయించనుంది. దీని ద్వారా సుమారు రూ.2,500 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అదనంగా గ్రీన్ షూ ఆప్షన్ ద్వారా మరో 1 శాతం వాటాను విక్రయించి మరో రూ.2,500 కోట్లు సమీకరించనుంది. దీంతో మొత్తం లావాదేవీ పరిమాణం రూ.5,000 కోట్లకు చేరనుంది. షేర్ల కనిష్ఠ ధరను ఒక్కో షేరుకు రూ.412గా నిర్ణయించారు. మార్కెట్ ధరతో పోలిస్తే సుమారు 10 శాతం తగ్గింపుతో ఉంది. కొన్ని రోజులుగా ఈ వాటా విక్రయంపై మార్కెట్లో చర్చలు కొనసాగుతున్నాయి. ఈనెల 25న ప్రభుత్వ వర్గాలు కోల్ ఇండియాలో 2 శాతం ఈక్విటీ వాటా విక్రయానికి సన్నాహాలు జరుగుతున్నాయని వెల్లడించాయి. చివరకు మంగళవారం అధికారిక వివరాలు




వెలువడ్డాయి. ఈ వాటా విక్రయం ప్రభుత్వ విస్తృత పెట్టుబడుల ఉపసంహారణలో భాగంగా చేపడుతోంది. ప్రభుత్వ రంగ సంస్థలలోని వాటాలను నగదుగా మార్చుకునే ప్రక్రియలో ఇది కీలక అడుగుగా భావిస్తున్నారు. గత 16 ఏళ్లలో కోల్ ఇండియాలో వాటాల విక్రయం ద్వారా ప్రభుత్వం ఇప్పటికే సుమారు రూ.47,000 కోట్లు సమీకరించింది. తాజా ఓఎఫ్ఎస్‌తో మొత్తం దాదాపు 52వేల కోట్లకు చేరే అవకాశముంది. భారత ప్రభుత్వ రంగ సంస్థల డిస్ఇన్వెస్ట్‌మెంట్ చరిత్రలో కోల్ ఇండియా ప్రయాణం అత్యంత ప్రాధాన్యమైనదిగా నిలిచింది. 2010లో కంపెనీ నిర్వహించిన ఓఎఫ్ఎస్‌లో ఒక్కో షేరుకు రూ.245 ధరగా నిర్ణయించారు.

అది ఆ కాలంలోనే అతిపెద్ద ఓఎఫ్ఎస్‌లలో ఒకటిగా నిలిచింది. అప్పటి నుంచి కోల్ ఇండియా ప్రభుత్వం చేపట్టే డివెస్ట్మెంట్ ప్రణాళికల్లో కీలక పాత్ర పోషిస్తూనే, అత్యధికంగా ట్రేడయ్యే ఓఎఫ్ఎస్ షేర్లలో ఒకటిగా కొనసాగుతోంది. ప్రస్తుత ఓఎఫ్ఎస్ మార్కెట్ ధర కంటే తక్కువ ధర ఉండటంతో పాటు షేర్లలో ఉన్న అధిక లిక్విడిటీ కారణంగా సంస్థాగత పెట్టుబడిదారుల నుంచి మంచి స్పందన వచ్చే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.




## 8వేల కోట్ల నిధుల సమీకరణలో యూనియన్‌బ్యాంక్

**ముంబయి, మే 26:** ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.8 వేల కోట్లనిధులు సమీకరణకు నిర్ణయించింది. బిఎస్ఇకి మంగళవారం దాఖలుచేసిన ఎక్స్ఛేంజి ఫైలింగ్‌లో బ్యాంకు బోర్డు డెట్ మూలధన వనరులను బేసెల్3 ఆధారిత అదనపు టైర్‌వన్, టైర్2 బాండ్లరూపంలో సమీకరించేందుకు నిర్ణయించింది. మొత్తం ఐదువేల కోట్లు ఈరూపంలో రాబట్టాలని నిర్ణయించింది. వీటితోపాటే మరో రూ.3 వేల కోట్లు ఈక్విటీ మూలధన వనరులను విడదల వారీగా సేకరించేందుకు నిర్ణయించింది. మొత్తంగా 8 వేల కోట్ల పరిమితికి లోబడి పబ్లిక్ ఇష్యూద్వారా సమీకరించేందుకు నిర్ణయించింది. పబ్లిక్ ఆఫర్, లేదా రైట్స్ ఇష్యూ, ప్రైవేట్‌ప్లేస్‌మెంట్స్, క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్, ప్రాధాన్యతా కేటాయింపులు ఏది వీలైతే ఆ పద్దతిలో ఈనిధులు సేకరించాలని నిర్ణయించింది. బ్యాంకు బోర్డు డైరెక్టర్ల సమావేశం మంగళవారం జరిగింది. మొత్తంపరిమితి రూ.8వేల కోట్లు దాటకుండా నిధులుసేకరించేందుకు ఆమోదం తెలిపినట్లు బిఎస్ఇకి ఫైలింగ్ ఇచ్చింది. కాగా బ్యాంకు షేర్లు 1.01శాతం క్షీణించి బిఎస్ఇలో 167.25 వద్ద ట్రేడ్ అయ్యాయి.




## లాభాల స్వీకరణతో నష్టాల్లోకి మార్కెట్లు

ముంబయి, మే 26: మార్కెట్లు ప్రారంభంలో లాభాలతో ట్రేడ్ అయినా దేశీయ సూచీలు ఈక్విటీల్లో లాభాల స్వీకరణ ఒత్తిడికి లోనయి నష్టాల్లోనే ముగిసాయి. తాజా అమెరికా దాడులు మరియు చర్చలు మరింత కాలం పట్టవచ్చన్న వ్యాఖ్యలు పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. నెలవారీ నిఫ్టీ ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ కాలరిమితిముగింపు వంటివి స్టాక్ సూచీలకు కీలకంగా మారాయి. ప్రధాన సూచీలు బీఎస్ఈ సెన్సెక్స్ 479.25 పాయింట్లు లేదా 0.63 శాతం పడిపోయి 76,009.70 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీ 118 పాయింట్లు లేదా 0.49 శాతం క్షీణించి 23,913.70 వద్ద స్థిరపడింది. గత రెండు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1.74 శాతం, నిఫ్టీ 0.91 శాతం లాభపడ్డాయి. భారతి ఎయిర్టెల్ 1.49 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.01 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 0.98 శాతం క్షీణించి సూచీలపై ఒత్తిడి తెచ్చాయి. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.33 శాతం, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.21 శాతం పెరిగాయి. బీఎస్ఈలో 2,153 షేర్లు పెరగగా, 2,050 షేర్లు తగ్గాయి. 192 షేర్లు మార్పులేకుండా ముగిశాయి.

డాలర్‌తో రూపాయి మారకం విలువలు బలహీనపడి 95.77వద్ద ట్రేడైంది. భారత 10 ఏళ్ల బాండ్ యీల్డ్ 7.038 శాతానికి పెరిగింది. ఎంసీఎక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ 0.56 శాతం తగ్గి రూ.1,58,186కు చేరింది. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు 4.61 శాతం తగ్గి 103.54 డాలర్లకు పడిపోయింది. ప్రపంచ మార్కెట్లుమధ్యప్రాచ్య ఉద్రిక్తతలు, ఉక్రెయిన్ పరిణామాలను గమనిస్తూ ఆసియా, యూరప్ మార్కెట్లు స్వల్ప నష్టాల్లో ట్రేడ్ అయ్యాయి. అమెరికా అధ్యక్షుడు ఇరాన్‌తో చర్చలు సానుకూలంగా సాగుతున్నాయని పేర్కొన్నప్పటికీ, చర్చలు విఫలమైతే మళ్లీదాడులు జరగవచ్చని హెచ్చరించడం మార్కెట్లలో అప్రమత్తత పెరిగింది. ఇక స్టాక్స్ పరంగా చూస్తే మార్క్‌సాన్స్ ఫార్మా 15.68శాంపెరిగింది. యునిపార్ట్స్ ఇండియా 8.55శాతం, బ్లూజెట్ హెల్త్‌కేర్ 3.77శాతంచొప్పునపెరిగితే రైల్‌వికాస్ నిగమ్4.66శాతం క్షీణించింది. సుప్రజిత్ ఇంజినీరింగ్ 6.44శాతంపెరిగింది. ఫైన్‌ల్యాబ్స్ 5.64శాతం తిరోగమిస్తే మాన్ ఇండస్ట్రీస్‌కూడా 2.26శాతం పడిపోయింది. మొబిక్విక్ సిస్టమ్స్ 3.75 శాతం, టెక్నో ఇంజినీరింగ్ కంపెనీ12.51శాతం పతనం చవిచూసాయి.

## యాంటిడంపింగ్ సుంకంతో సాలీనా 25వేల కోట్ల రాబడి

**న్యూఢిల్లీ, మే 26:** వాణిజ్యశాఖపరిధిలో ఉన్న యాంటి డంపింగ్ సుంకాలు అమలుచేయకపోవడం వల్ల ఆర్థికంగా సాలీనా రూ.11,938 కోట్లు నష్టం వస్తోంది. అదే సుంకాలు అమలుచేస్తే సాలీనా రూ.28,540 కోట్లు ఫోరెక్స్ రూపంలో అందుతాయని ఒక రేటింగ్ సంస్థ సర్వేలో తేలింది. ట్రేడ్ రెమిటీస్ డైరెక్టరేట్ జనరల్ కార్యాలయం ఈమేరకు ఆర్థికశాఖ ఒక నిర్ణయం తీసుకుంటుందని భావిస్తోంది. మొత్తం 56 డిజిటిఆర్ సిఫారసు చేసిన ఉత్పత్తుల్లో యాంటిడంపింగ్ సుంకాలు అమలుకావడంలేదని తేలింది. అదే డిజిటిఆర్ సిఫారసుచేసిన యాంటిడంపింగ్ సుంకాలు అమలుచేస్తే విదేశీకరెన్సీ రూపంలో రూ.28,540 కోట్ల వరకూ అంటే డాలర్లలో 3 బిలియన్ డాలర్ల వరకూ అందుతాయని సిడెప్ రీసెర్చి, ప్రపంచ వాణిజ్యసంస్థ అధ్యయన కేంద్రం సంయుక్తనివేదిక విడుదలచేసాయి. మొత్తం 33 ఉత్పత్తులపై ఈ సుంకాలు అమలుకావడంలేదు. ప్రస్తుత కాలంలో సుమారుగా 1.54 లక్షల కోట్లు దిగుమతులు జరిగాయి. 2030 నాటికి ఈ ఉత్పత్తుల దిగుమతులు 2.70 లక్షలకోట్లువరకూ ఉండవచ్చని అంచనా. అలాగే సుంకాల అమలుకాక



పోవడంవల్ల 24వేల మంది ఉపాధి కరువవుతోంది. 2030 నాటికి 38 వేల నుంచి 42 వేలమంది ఉపాధికి గండిపడుతుందని అంచనా. రసాయనాలపై దేశీయంగా చైనాలో విక్రయిస్తే మెట్రిక్ టన్నుకు 100 డాలర్లు ఉంటుంది. అదే భారత్‌కు ఎగుమతిచేస్తే టన్నుకు 70 డాలర్లవరకూ యాంటిడంపింగ్ సుంకం ఉంటుంది. రెండుదేశాలమధ్య తేడాయే 30డాలర్లుగా ఉందని సర్వేలో తేలింది. 2020వరకూ అమలుచేసిన భారత్ ఆపై నిలిపివేసింది. అమెరికాలో కూడా ఈసుంకాలు అమలులో ఉన్నప్పటికీ ఇటీవలే వాటిని నిలిపివేసింది. అలాగే భారత్‌లో కూడా ఏడేళ్లక్రితమే నిలిచిపోయినట్లు తెలుస్తోంది.

## యేడాది చివరికే ఇండోకెనడా వాణిజ్య ఒప్పందం

### ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యం 50 బిలియన్ డాలర్లు

**ఒట్టావా, మే 26:** భారత్, కెనడా మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఎఫ్టీయే చర్చలు ఈ ఏడాది చివరినాటికి పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. మూడు రోజుల అధికారిక పర్యటనలో ఉన్న గోయల్ 100కిపైగా భారతీయ కంపెనీల ప్రతినిధులతో కూడిన అతి పెద్ద విదేశీ వ్యాపార ప్రతినిధి బృందానికి ఆయన నాయకత్వం వహిస్తున్నారు. పీయూష్ గోయల్ కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీని కలిసి ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలపై చర్చించారు. భారత్‌కెనడా మధ్య సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సిఇపిఎ)పై ఇప్పటివరకు రెండు విడతల చర్చలు పూర్తయ్యాయి. ఒట్టావాలో కెనడా వాణిజ్యమంత్రి మనిందర్ సిద్ధుతో కలిసి మాట్లాడిన గోయల్, ఇరు దేశాల ప్రధానమంత్రులు ఈ ఏడాది చివరినాటికి లేదా అంతకంటే ముందే సమగ్ర దృష్టితో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని పూర్తి చేయాలని ఆదేశించారని, ప్రస్తుతం 17 బిలి యన్ అమెరికన్ డాలర్లుగా ఉన్న ద్వైపాక్షిక




వాణిజ్యాన్ని 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు పెంచడమే లక్ష్యమని తెలిపారు.

భారత్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కెనడా కార్మికులు, వ్యాపారాలకు గేమ్ ఛేంజర్‌గా మారుతుందని, భారీ మార్కెట్ అవకాశాలను తెరుస్తుందన్నారు. ఇంధనం, వ్యవసాయం, సాంకేతికత, విద్య రంగాల్లో కొత్త అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. ఒట్టావాలో మూడో విడత చర్చల్లో ఇరు దేశాలు వాణిజ్య, పెట్టుబడి అవకాశాల విస్తరణపై సమీక్ష నిర్వహించాయి.

2026 చివరినాటికి సమతుల్యమైన, పరస్పర ప్రయోజనకరమైన ఒప్పందాన్ని పూర్తి చేయాలనే సంకల్పాన్ని పునరుద్ఘాటించినట్లు భారత వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ తరహా వాణిజ్య ఒప్పందాల ద్వారా రెండుదేశాలు పరస్పరం దిగుమతి సుంకాలను గణనీయంగా తగ్గించడం లేదా రద్దు చేయడం జరుగుతుంది. సేవారంగంలోనూ నిబంధనలను సడలించి పెట్టుబడులను ప్రోత్సహించే అవకాశం ఉంటుంది. ఇక గోయల్ కెనడా వ్యవసాయ, ఆహార మంత్రి హీత్ మాక్‌డొనాల్డ్‌తో కూడా సమావేశమై ఆహార భద్రత, స్థిరమైనవ్యవసాయం, అగ్రిటెక్నాలజీ రంగాల్లో సహకారం పెంపుపై చర్చించారు. టొరొంటోలో నిర్వహించే పరిశ్రమల రౌండ్‌టేబుల్ సమావేశాల్లో పీయూష్ గోయల్ పాల్గొంటారు.

## టాటాసన్స్ ఛైర్మన్ పొడిగింపు మళ్లీ వాయిదా

**ముంబయి, మే26:** కార్పొరేట్ రంగంలో ఉత్కంఠను రేకెత్తిస్తున్న టాటాసన్స్ బోర్డు సమావేశంలో నష్టాల్లో ఉన్న కంపెనీల పనితీరుపై విస్తృత సమీక్ష నిర్వహించడంతో పాటు టాటాసన్స్ ఛైర్మన్‌చంద్రశేఖరన్ పదవీకాలం మూడోసారి తరలింపుపైనా చర్చలు వాయిదా వేసారు. మంగళవారం బాంబే హౌస్‌లో జరిగిన రోజంతా సాగిన మారథాన్ బోర్డు సమావేశం టాటా గ్రూప్ కంపెనీల ఆదాయం, లాభాలు, ప్రతి షేరుకు లాభం తదితర అంశాలపై పైనే కొనసాగింది. టాటాసన్స్ హోల్డింగ్ కంపెనీ లిస్టింగ్ అలాగే ఛైర్మన్ చంద్రశేఖరన్(చంద్రా) మూడో టర్మ్‌పై ఈ సమావేశంలో చర్చ జరగలేదు. వీటిని వచ్చేనెల 12న జరిగే తదుపరి బోర్డు సమావేశంలో చర్చించాలని వాయిదావేసారు. ప్రత్యేకంగా మే 26న నిర్వహించిన ఈ బోర్డు సమావేశంలో నష్టాల్లోఉన్న కొన్ని గ్రూప్ సంస్థల ఆర్థిక ఫలితాలు, భవిష్యత్ అంచనాలు, వ్యూహాత్మక ప్రణాళికలపై చర్చ జరిగింది. పలువురు కంపెనీల సీఈఓలు తమ పవర్ పాయింట్ ప్రజెంటేషన్లతో సమావేశంలో పాల్గొన్నారు. ఫిబ్రవరి 24నజరిగిన టాటా సన్స్ బోర్డు సమావేశంలో టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ మరియు



నామినీ డైరెక్టర్ నోయెల్ టాటా లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానంగా ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఎయిర్ ఇండియా, టాటా డిజిటల్, టాటా ఎలక్ట్రానిక్స్ వంటి కంపెనీల లాభదాయకతపై ఆయన ప్రశ్నలు సంధించగా, చంద్రశేఖరన్‌కు ఫిబ్రవరి 2027 నుంచి మూడోసారి ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా అవకాశం ఇవ్వాలన్న అంశాన్ని కూడా ప్రస్తావించారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.